ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 24.09.2025 | సంపుటి : 12 సంచిక : 66 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

### మేడారం జాతరను జాతీయ పండుగగా

# కేంద్రం ప్రకటించాలి



## నిధులెందుకు ఇవ్వడం లేదు? | కేంద్రాన్ని నిలదీసిన ముఖ్యమంత్రి రేవంత్

- కుంభమేలా చేసుకున్న పుణ్యమేంది?
- మేడారం చేసుకున్న పాపమేంది?
- జాతరకు నిధులు ఇవ్వాల్సిందే
- పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశాలు
- మేడారం సందర్శించిన సీఎం రేవంత్
- అమ్మవార్ల గద్దె వద్ద ప్రత్యేక పూజలు
- నిలువెత్తు బంగారం సమర్పించిన ముఖ్యమంత్రి.. అభివృద్ధి పనులపై సమీక్ష

**ములుగు(జనంసాక్షి):**ఆదివాసీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కుంభమేళాకు రూ.వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసుల కుంభమేళా 'మేడారం జాతర'కు మాత్రం ఎందుకు నిధులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. ఈ జాతరకు జాతీయ హోదా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్న అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. మిగతా 2లో..

> *ఆదివాసీలు అంటే ఈ దేశం మూలవాసులు. అందుకే ఈనాడు ఆదివాసీల గూడెంలలో, తండాల్లో, మారుమూల ప్రాంతాల్లో అదనంగా 22వేల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం. సమ్మక్క-సారలమ్మ గద్దెల పునఃనిర్మాణ కార్యక్రమం నా జీవితంలో గొప్ప అవకాశం. గతంలో అభివృద్ధి గురించి నేతలను అడగటమే గగనమైన పరిస్థితి ఉండేది. అభివృద్ధికి నిధులు అడిగితే ఏదో భిక్షం ఇస్తున్నట్లు వ్యవహరించేవారు"*
> – సీఎం రేవంత్ రెడ్డి



అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న సీఎం రేవంత్.. చిత్రంలో మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ



### ములుగు జిల్లాలో 23 గ్రామాల

# స్థానిక ఎన్నికలపై 'సుప్రీం' స్టే

- మేమంతా గిరిజనేతరులమే
- మా గ్రామాలను గిరిజన గ్రామాలుగా ఎలా గుర్తిస్తారు?
- మంగపేట మండలంలోని ఆయా గ్రామాల ప్రజల వాదన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించడంపై ఆయా గ్రామాల గిరిజనేతరులు సర్వోన్నత మిగతా 2లో..

# కృష్ణాజలాల్లో 70% వాటా మాదే

### ఎందాకైనా కొట్లాడుతాం.. నీటి వాటాకోసం వెనక్కు తగ్గేదేలేదు

గత ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగింది
ట్రైబ్యునల్‌లో సమర్థమైన వాదనలు వినిపిస్తాం: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి
అల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకుని తీరుతామని వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కృష్ణాట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరఫున సమర్థమైన వాదనలు వినిపిస్తామని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఇవాళ్టి నుంచి మూడు రోజులపాటు కృష్ణా ట్రైబ్యునల్‌లో వాదనలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ దిల్లీ వెళ్లారు. ట్రైబ్యునల్ ముందు రాష్ట్ర వాదనలు స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధిస్తామన్నారు."కృష్ణా జలాల్లో మనకు రావాల్సిన వాటా తప్పక రావాల్సిందే. ట్రైబ్యునల్ ముందు రాష్ట్రం తరఫున వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్-2 ఉమ్మడి రాష్ట్రానికి 1050 టీఎంసీలు కేటాయించింది. ఇప్పుడు కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 70 శాతం కేటాయించాలని వాదనలు వినిపిస్తున్నాం. సాగుభూమి, నదీ పరివాహకంలో జనాభా ఆధారంగా అధిక వాటా కోరుతున్నాం. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం



జరిగింది. కేవలం 299 టీఎంసీలకు అంగీకరిస్తూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సంతకం చేసింది. ఈ చర్యతో రాష్ట్రానికి పదేళ్లుగా అన్యాయం జరుగుతోంది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 780 టీఎంసీలను కోరుతోంది"" ఏపీ ప్రభుత్వం కృష్ణా మిగతా 2లో..



# అట్టహాసంగా జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**71వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం అట్టహాసంగా జరిగింది. విజేతలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము..పురస్కారాలతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. 2023కి గానూ కేంద్రం ఉత్తమ చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణులను ఇటీవల ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఉత్తమ నటుడి మిగతా 2లో..

- మోహన్‌లాల్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు
- ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము
- పలువురు బాలీవుడ్, టాలీవుడ్ నటులు, దర్శకులకు పురస్కారాలు అందజేత






### గ్రూప్-1 రద్దుపై

# మరో అప్పీల్

### విచారణకు స్వీకరించిన ధర్మాసనం

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను రద్దు చేస్తూ ఇటీవల వెలువడిన తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలైంది. గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి ఒకరు ఈ అప్పీల్ దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సదరు అభ్యర్థి అప్పీల్‌ను సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది. టీజీపీఎస్సీ కూడా అప్పీల్ దాఖలు చేశారని న్యాయవాది పేర్కొనగా.. ఈ రెండు పిటిషన్లు కలిపి బుధవారం విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. గ్రూప్-1 మిగతా 2లో..

### ఘోష్ కమిషన్ నివేదికను

# కొట్టేయండి

హైకోర్టులో సవాల్ చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్




### వెల్లువలా బహుళ జాతి సంస్థల

# పెట్టుబడులు

### మామిడి, నారింజ పండ్ల సాగు రైతులకు భారీ ప్రోత్సాహం

- 3,745 కోట్ల పెట్టుబడి, 1,518 మందికి ఉపాధి కల్పించే మూడు కంపెనీలకు
- క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం ఇండస్ట్రియల్ ప్రమోషన్ క్యాబినెట్ సబ్
- కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు



**హైదరాబాద్(జనంసాక్షి):**భారీగా పెట్టుబడులు పెడుతూ యువతకు ఉపాధి, వివిధ రకాల పండ్లు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం కలిగించే పద్ధతుల్లో బహుళ జాతి కంపెనీలు రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టేందుకు వెల్లువలా కదిలి వస్తున్నాయని,రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయని డిప్యూటీ సీఎం, క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాల ఆసక్తి చూపుతున్న జెఎస్‌డబ్ల్యూ, యూఏవీ లిమిటెడ్ మహేశ్వరంలో కొత్త యూనిట్ ప్రారంభించడానికి, తోషిబా ట్రాన్స్మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, మిగతా 2లో..

### లక్షల కోట్లు అప్పులు చేసి

# రాష్ట్రాన్ని ఆగం చేశారు

- కేసీఆర్ కుటుంబ జల్సాలకు తెలంగాణ తాకట్టు
- మండిపడ్డ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

2లో..



### బకాయిలు వసూలు చేయడానికి కోర్టులేమైనా

# రికవరీ ఏజెంట్లా?

### సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణిపై సుప్రీంకోర్టు అసహనం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కోర్టులు డబ్బులు రికవరీ చేసే ఏజెంట్లు కాదని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణిపై అసహనం వ్యక్తంచేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ కేసును విచారిస్తూ ఈవిధంగా స్పందించింది. డబ్బు రికవరీ వంటి సివిల్ వివాదంలో అరెస్ట్‌ను ఒక సాధానంగా ఉపయోగించకూడదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆ వివాదంలో కిడ్నాప్ అభియోగాలు మోపడంపై ఆందోళన వ్యక్తంచేసింది. క్రిమినల్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తోన్న ట్రెండ్‌ను ఇది ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించింది. జస్టిస్ డెలివరీ మిగతా 2లో..

### కేటీఆర్‌కు అరుదైన

# గౌరవం

తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025కు ఆహ్వానం




### ఎనిమిదేళ్లుగా దోచుకుని

# ఇప్పుడు సంబరాలా?

### జిఎస్టీ దోపిడీపై పొన్నం ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):**జీఎస్టీ విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. దేశ ప్రజలను దోచుకునేందుకే నాడు జీఎస్టీని ఆయుధంగా వాడారని, వాళ్లే పన్నులు వేసి, వాళ్లే తగ్గించి, ఇప్పుడు వాళ్లే సంబురాలు చేసుకుంటున్నారని దీనిని మించిన మూర్ఖత్వం మరొకటి ఉండదని ఆయన దుయ్యబట్టారు. మంగళవారం గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ 8 ఏళ్లుగా జీఎస్టీ పేరుతో పేదల రక్తం తాగి ఇప్పుడు పేదలకు లబ్ధి చేసినట్టు- బిజెపి నాయకులు బిల్డప్ ఇస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. జీఎస్టీ తగ్గింపు అంత ఎన్నికల డ్రామా అని, ఇంకా జీఎస్టీ ఫలాలు పేదోడికి అందలేదన్నారు.



కాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2025లో దసరా, దీపావళి పండుగలను జీఎస్టీ రూపంలో ముందుగానే తీసుకువచ్చారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునం దన్‌రావు ఉద్ఘాటించారు. కొంతమంది తెలివి లేని వాళ్లు జీఎస్టీ గురించి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వాళ్లందరికీ మంచి బుద్ధి ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామిని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మీడియాతో ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడారు. అమ్మవారి ఆలయంలో దర్శన ఏర్పాట్లు- చాలా బాగున్నాయని వివరించారు. మిగతా 2లో..



### కోల్‌కతాను ముంచెత్తిన

# భారీ వర్షాలు

### విద్యుత్ షాక్‌తో ముగ్గురు ప్రాణాలు, వరదల్లో కొట్టుకుపోయి ఇద్దరు మృతి.. పలు ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలం

**కోల్‌కతా(జనంసాక్షి):**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కోల్‌కతాను ముంచెత్తాయి. వరదల కారణంగా ఉత్తర కోల్‌కతాలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ షాక్ వల్ల ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. వరదల్లో కొట్టుకుపోయి మరో ఇద్దరు మరణించారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉన్నందున దక్షిణ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో రానున్న కొన్ని గంటల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ మిగతా 2లో..

# భారత్‌తో సంబంధాలు కీలకమే

- ఆ దేశం అమెరికాకు అత్యంత కీలక భాగస్వామి
- ఇరు దేశాల అభివృద్ధికి ఈ సహకారం అవసరం
- వాణిజ్యం, రక్షణ, ఇంధనం, ఔషధాలు, కీలకమైన ఖనిజాలు తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి
- అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్(జనంసాక్షి):**సుంకాలు, హెచ్1బీ వీసా ఆందోళనలు కొనసాగుతున్న వేళ.. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్క్ రుబియో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో సంబంధాలు తమ దేశానికి ఎంతో కీలకమని వ్యాఖ్యానించారాయన. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీపై స్పందిస్తూ రుబియో తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 80వ సమావేశం సందర్భంగా.. జైశంకర్, మార్కో రుబియో భేటీ అయ్యారు. భారత్-అమెరికా ద్వైపాక్షిక మిగతా 2లో..

### ప్రాణాలు ఫణంగా పెట్టి..

# ఆఫ్ఘన్ బాలుడి సాహసం

- విమానం ల్యాండింగ్ గేర్ పట్టుకుని ఢిల్లీకి వచ్చిన ఆఫ్ఘన్ బాలుడు
- మైనర్ కావడంతో శిక్ష వేయకుండా మళ్లీ తిప్పిపంపిన అధికారులు

9 లో..

### ప్రతిభావంతులకు

# చైనా ఆహ్వానం

కెరీర్ అవకాశాలకు పెద్దపీట

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
24.09.2025

## బకాయిలు వసూలుచేయడానికి కోర్టులేమైనా రికవరీ ఏజెంట్లా?

సిస్టమ్‌కు ఈ కేసు తీవ్ర ముప్పు అని పేర్కొంది. "బకాయిల మొత్తాన్ని వసూలుచేయడానికి కోర్టులేమీ రికవరీ ఏజెంట్లు కావు. న్యాయవ్యవస్థ దుర్వినియోగాన్ని అనుమతించబోం" అని తేల్చిచెప్పింది. అరెస్టులు చేసే ముందు తమవద్దకు వచ్చిన కేసు క్రిమినలా..?సివిలా..? అని పోలీసులు సరిగా పరిశీలించాలని సూచించింది. ఇలాంటి కేసులు పోలీసుల్ని క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టివేస్తాయని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ అంగీకరించారు. కొన్ని సందర్భాల్లో అలాంటి గందరగోళం ఉంటుందన్న సుప్రీం ధర్మాసనం.. సివిల్ వివాదాల్లో వేధింపుల సాధనంగా క్రిమినల్ చట్టాలను ఉపయోగించకుండా నిరోధించేందుకు తెలివిగా వ్యవహరించాలని సూచించింది.

## ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయండి

### హైకోర్టులో సవాల్ చేసిన ఐఎఎస్ స్మితా సబర్వాల్

**హైదరాబాద్(జనంసాక్షి):**సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరం అంశంపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టులో ఆమె సవాల్ చేశారు. నోటీసుల జారీ, వాంగ్మూలం నమోదు చేసిన విధానాన్ని సవాల్ చేసిన ఆమె.. ఆ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నివేదిక ఆధారంగా తనపై తదుపరి చర్యలు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు- సమాచారం. ప్రస్తుతం ఈ పిటిషన్ రిజిస్ట్రీ పరిశీలనలో ఉండగా.. పరిశీలన పూర్తయి లిస్ట్ అయిన తర్వాత విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి ఎస్కే జోషీ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఇటీ-వల ఊరట లభించింది. కమిషన్ నివేదిక సిఫారసుల ఆధారంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు, ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను కేసీఆర్, హరీశ్‌రావుల పిటిషన్‌తోపాటు- అక్టోబరు 7కి హైకోర్టు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సభర్వాల్ సైతం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## భారత్‌తో సంబంధాలు కీలకమే'

సంబంధాలపై ఇరువురు చర్చించారు. ఈ పరిణామంపై రుబియో స్పందిస్తూ.. భారత్ అమెరికాకు అత్యంత కీలక భాగస్వామి. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, ఔషధాలు, కీలకమైన ఖనిజాలు.. తదితర రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి. ఇరు దేశాల అభివృద్ధికి ఈ సహకారం అవసరం. భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలు బలోపేతం చేయడం ద్వారా రెండు దేశాలకు అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛా, ఓపెన్ విధానాన్ని ప్రోత్సహించేందుకు భారత్‌తో కలిసి పనిచేస్తాం అని పేర్కొన్నారాయన. మరోవైపు.. రుబియోతో భేటీపై జైశంకర్ స్పందిస్తూ.. మార్కో రూబియోతో సమావేశం సానుకూలంగా సాగింది. అయితే ప్రాధాన్య అంశాలపై మరిన్ని చర్చలు అవసరం అని పేర్కొన్నారు.

## కోల్‌కతాను ముంచెత్తిన భారీ వర్షాలు

శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వానల వల్ల పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగినట్లు విమానయాన సంస్థలు వెల్లడించాయి. అటు ఎయిరిండియా, ఇండిగో ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి.భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు చాలా ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. కొన్ని భవనాలు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు సాధ్యమైనంతవరకు ఇళ్లల్లోనే ఉండాలని.. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. భారీ వరదల వల్ల షాహిద్ ఖుదిరామ్, మైదాన్ స్టేషన్ల మధ్య పలు రైల్వే కార్యకలాపాలను నిలిపివేసినట్లు అధికారులు పేర్కొన్నారు.ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకరస్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పంజాబ్, హరియాణా, చండీగఢ్‌ల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. పఠాన్‌కోట్, గుర్‌దాస్‌పుర్, ఫాజిల్కా, కపూర్థలా, తరన్‌తరన్, ఫిరోజ్‌పుర్, హోషియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీ చేసింది. పంజాబ్‌లో వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. రాజస్థాన్ రాజధాని జైపుర్‌తో సహా పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి.

## ఎనిమిదేళ్లుగా దోచుకుని ఇప్పుడు సంబరాలా?

దసరా ఏర్పాట్లు బాగా చేసిన కలెక్టర్, ఆలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఆలయ కమిటీలు ఇంకా వేసినట్లు- లేదని, త్వరలో వేస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు ఎంపీ రఘునందన్‌రావు. జీఎస్టీ రూపంలో గతంలో ప్రజలపై విపరీతమైన భారాలు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మండిపడ్డారు. గతంలో కాఫీ మీద కూడా జీఎస్టీ 28 శాతం ఉండేదని గుర్తుచేశారు. దేశ ప్రజల కోసం పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నిండు నూరేళ్ల ఆయుష్షు ఇవ్వాలని అమ్మవారిని కోరుకున్నానని పేర్కొన్నారు. 4 స్లాబులుగా ఉండే జీఎస్టీని 2 శ్లాబులుగా చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు.





# మేడారం జాతరను జాతీయ పండగగా కేంద్రం ప్రకటించాలి

అనంతరం ఏర్పాటు-చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఆలయ అభివృద్ధి బాధ్యతతో కూడిన భావోద్వేగమని పేర్కొన్నారు. ఈ పనులతో మంత్రి సీతక్కతోపాటు- తన జన్మ ధన్యమైనట్లేనన్నారు. సమ్మక్క- సారలమ్మ ఆశీస్సులతో 2023 ఫిబ్రవరి 6న ఇక్కడినుంచే పాదయాత్ర మొదలు పెట్టా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు ఈ గడ్డపై నుంచి అడుగులు వేశాం. ఆనాడు పాలకులు సమ్మక్క - సారలమ్మ ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపారు. కానీ, మా ప్రభుత్వం ఎన్ని రూ.కోట్లయినా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఆదివాసులను, పూజారులను, సంప్రదాయ కుటుంబాలను ఇందులో భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. స్థానికుల అభిప్రాయాలు తెలుసుకొనేందుకే ఇక్కడికి వచ్చానని వివరించారు. 100 రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చూడాలి. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండేలా డిజైన్లు రూపొందించాం. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొనేలా నిర్మాణాల రూపకల్పన చేశాం. జంపన్నవాగులో నీరు నిల్వ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. రాబోయే వంద రోజుల్లో నిష్ఠతో పనులు పూర్తి చేయాలి. రాతి కట్టడాలే నిర్మిస్తాం. మహా జాతర నాటికి పనులు పూర్తి చేస్తాం. స్థానికుల భాగస్వామ్యం, సహకారంతోనే ఇది సాధ్యం. మహా జాతరకు మళ్లీ వస్తా. ఈసారి జాతరను గొప్పగా చేసుకుందాం అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు మేడారం ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సీఎం రేవంత్ తెలుసుకున్నారు. పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు. ఆ అమ్మవార్ల ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడింది. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి వనదేవతలను సందర్శిస్తున్నా. ప్రకృతి వైపరీత్యాలనూ తట్టు- కునేలా శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించేలా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళికలు, డిజైన్‌లను అధికారులు పూజారులకు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఈ ప్రణాళికలపై ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకున్న సీఎం, వారి ఏకాభిప్రాయం పొందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసీల సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు- స్పష్టం చేశారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, వారి సంప్రదాయాలు, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని.. వారి సంప్రదాయంలో ఏమాత్రం మార్పు రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధిని డబ్బులతో కాకుండా భక్తితో చూడాలని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా పనులు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పనులు వంద రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉందని, పనులను పూర్తి చేసే బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. జంపన్న వాగులో నీరు నిల్వ ఉండేలా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.ఇంకా ఆలయ అభివృద్ధి కోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు- చేయాలని కూడా సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట రావు, బాలు నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మా బొజ్జు, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య, ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, దేవాదాయశాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, ఏటూరు నాగారం ఎఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఈఓ వీరస్వామి, జిల్లా అధికారులు, పూజారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాజలాల్లో 70% వాటా మాదే

జలాలను బేసిన్ అవతలకు తరలిస్తోంది. అల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకుని తీరుతాం. తెలంగాణ జల హక్కులను కాపాడేందుకు ఎవరితోనైనా పోరాడుతాం" అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు"

### ములుగు జిల్లాలో 23 గ్రామాల

## స్థానిక ఎన్నికలపై 'సుప్రీం' స్టే

న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కన పెట్టి.. నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరఫు న్యాయవాది విష్ణువర్ధన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్న వేళ స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం.. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికలపైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## గ్రూప్-1 రద్దుపై మరో అప్పీల్

మెయిన్ పత్రాల పునర్ మూల్యాంకనం చేయాలంటూ గతంలో సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. టీ-జీపీఎస్సీ విడుదల చేసిన ర్యాంకుల లిస్టు రద్దు చేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. ఎనిమిది నెలల్లో మెయిన్స్ పత్రాల పునర్మూల్యాంకనం చేయాలని టీ-జీపీఎస్సీని ఆదేశించిన విషయం తెలిసిందే. ఒకవేళ ఎనిమిది నెలల్లో ప్రక్రియ పూర్తి చేయపోతే మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ అభ్యర్థి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సీజే ధర్మాసనం విచారణకు స్వీకరించింది.



## జీఎస్టీ అమలను పర్యవేక్షిస్తున్నాం

### అమలు చేయని వారి వివరాలు ఆరా

**న్యూఢిల్లీ,సెప్టెంబర్23(జనంసాక్షి):** జీఎస్‌టీ- సంస్కరణలు అమల్లోకి రావడంతో నిత్యావసరాల నుంచి కార్ల వరకు పన్నుల భారం తగ్గి, కొనుగోలుదార్లకు భారీగా సొమ్ము ఆదా కానుంది. జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చినప్పటికీ కొన్ని ఈ-కామర్స్ వేదికలు ఆ ప్రయోజనాలను బదిలీ చేయడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఈ ఫిర్యాదులపై ఆరా తీస్తున్నట్లు- వెల్లడించాయి. ధరల మార్పును పర్యవేక్షిస్తున్నట్లు వెల్డించింది. ఈ ఫిర్యాదులపై ఇప్పుడే స్పందించలేం. సెప్టెంబర్ 30లోగా క్షేత్రస్థాయిలో జీఎస్టీ అమలుపై నివేదిక అందనుందని పేర్కొన్నాయి. జీఎస్టీ 2.0 సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. దాంతో కిరాణా సరకులపై కుటుంబ ఖర్చులు 13శాతం తగ్గనుండగా, ఒక చిన్న కారు కొనుగోలు చేస్తే దాదాపు రూ.70,000 వరకు ఆదా కానుంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం.. స్టేషనరీ, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలపై ఖర్చులు 7-12శాతంతగ్గనున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18శాతం పన్నును తొలగించడంతో.. ఈ మేరకు ఆదా కానుంది. మొత్తం 375 రకాల వస్తువులపై జీఎస్‌టీ- రేట్లు- తగ్గాయి.

## వెల్లువలా బహుళ జాతి సంస్థల పెట్టుబడులు

గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్ గేర్ మరియు బుషింగ్స్ పరిశ్రమ ఏర్పాటుకు, హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ కంపెనీ ఏర్పాటుకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఈ మూడు భారీ కంపెనీల ఏర్పాటు ద్వారా 3,745 కోట్ల రూపాయల పెట్టుబ డులు, 1,518 మంది యువతకు ఉపాధి లభిస్తుందని మంత్రుల బృందం తెలిపింది. సుమారు 2,398 కోట్లతో ఏర్పాటు చేస్తున్న కోకా కోలా బేవరేజెస్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 600 మందికి ఉపాధి లభిస్తుందని, 785 కోట్లతో రూపాయల పెట్టుబడితో వస్తున్న జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ద్వారా 364 మందికి ఉపాధి లభిస్తుందని, 562 కోట్ల రూపాయల పెట్టుబడి తో వస్తున్న తోషిబా కంపెనీ ద్వారా 554 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రులకు వివరించారు.కోకా కోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ సాగు చేసే రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బేవరేజెస్ పరిశ్రమల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యాన పంటల ఉత్పత్తులు ఆయా కంపెనీలకు అవసరం అవుతాయని, తద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ వంటి పంటలు సాగు ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడి రాష్ట్ర రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. దావోస్ తో పాటు వివిధ దేశాల నుంచి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన వివిధ కంపెనీలు జరిగిన ఎంవోయూలు, విధి విధానాలపై క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు సమీక్షించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ,ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్,పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆగం చేశారు

**- కేసీఆర్ కుటుంబ జల్సాలకు తెలంగాణ తాకట్టు**

**- మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**

**ఖమ్మం(జనంసాక్షి):**రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి తెచ్చిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే.. పదేండ్లు పరిపాలించిన నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలు నిలదీస్తే సమాధానంచెప్పడం లదన్నరు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే తెలంగాణ ప్రజల జీవితాల్లో వెలుగులు వస్తాయని భావించి సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కుటుంబం చేతిలో పదేండ్లు తెలంగాణ బందీ అయ్యిందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో నెలకు 11 వేల కోట్ల వడ్డీలు కడుతున్నామని, గత పాలకులు చేసిన 26 వేల కోట్ల అప్పుకు 11.50 శాతం ఉన్న వడ్డీని 8 శాతానికి తగ్గించామని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం క్యాబినెట్ పనిచేస్తున్న తీరును చూసి రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ లో చేరుతున్నారని తెలిపారు.ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జిల్లా నాయకులే కాదు.. ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ లో చేరడానికి వస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని, వారి కుటుంబ అవసరాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు- పెట్టారని మండిపడ్డారు. అప్పుల భారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిశామని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఉప్పు, పప్పు ఏది కొనుగోలు చేసినా పన్ను చెల్లిస్తున్నారని, ఆ పన్నులతోనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ఖజానాలోని ప్రతి పైసాకు అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ఉద్యోగులు సకల జనుల సమ్మె చేసి ప్రత్యేక రాష్ట్రం కోసం కృషి చేస్తే గత పాలకులు ఉద్యోగులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని వెల్లడించారు. తమప్రభుత్వం రాగానే నెలకు రూ.700 కోట్ల చొప్పున ఉద్యోగుల బకాయిలు చెల్లించుకుంటూ వస్తున్నామని వివరించారు. పదేండ్లలో రాష్ట్రంలో ఒక బడి, రోడ్డు, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ప్రజలకు దక్కలేదన్నారు. గోదావరిపై లక్ష కోట్లు- అప్పు తెచ్చి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని వివరించారు.

## వీసా ఫీజుల పెంపుతో అమెరికాకు నష్టమే

### ట్రంప్ చర్యలతో ఇంటాబయటా విమర్శలు

### కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ,సెప్టెంబర్23(జనంసాక్షి):** హెచ్1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనం సృష్టించడం ఒక ఎత్తయితే , దీనిపై దేశీయంగా, విదేశాల్లోనూ విమర్శలు వెల్లువెత్తున్నాయి. ట్రంప్ నిర్ణయంపై టెక్ కంపెనీలు సమాలోచనలు చేస్తున్నాయి. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కారణాలతోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శశిథరూర్ మాట్లాడుతూ...ట్రంప్ నిర్ణయాలు దేశీయ రాజకీయాలతో ముడిపడి ఉంటాయని అభిప్రాయపడ్డారు. హెచ్1బీ వీసాల కారణంగా ఎక్కువ జీతాలు తీసుకొనే అమెరికన్ల కంటే, తక్కువ జీతాలు తీసుకొనే భారతీయుల వైపే అక్కడి కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని ట్రంప్ ఆయన కార్యవర్గం భావిస్తోంది. అయితే, ఫీజు లక్ష డాలర్లకు పెంచితే తమకు కావాల్సిన, ఎక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తులు మాత్రమే అమెరికాకు వస్తారని వారు అనుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనక ట్రంప్ లాజిక్ ఏంటో, ఇది నిజంగా వర్కౌట్ అవుతుందా అనేది నాకు అర్థం కావడం లేదు. దీంతో అనేక కంపెనీలు ఎక్కువ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్‌కు ఇచ్చేస్తాయని శశిథరూర్ పేర్కొన్నారు. ఇక, భారత దిగుమతులపై ట్రంప్ పెద్ద మొత్తంలో సుంకాలు విధించడంపైనా థరూర్ మాట్లాడారు. అనేక సమస్యల పరిష్కారానికి సుంకాలు అనేవి ఒక మాయా సాధనంగా ట్రంప్ భావిస్తున్నారన్నారు. ఈ టారిఫ్‌ల నుంచి వచ్చే బిలియన్ డాలర్లతో యూఎస్‌లో నెలకొన్న లోటును పూడ్చాలనేది ఆయన ఉద్దేశమై ఉంటుందన్నారు. అయితే, భారత్‌పై సుంకాల విధింపుతో ఆయనకు ఇక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. భారత్‌ను ఉద్దేశిస్తూ తరచూ ట్వీట్లు పెట్టడం, ఆయన సలహాదారుడు నవారో అభ్యంతరకర వ్యాఖ్యలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌కు కాస్త ఎదురుదెబ్బేనన్నారు. అయితే, ప్రస్తుతం వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు.

## అట్టహాసంగా జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం..

అవార్డును షారుక్‌ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే, ఉత్తమ నటి అవార్డును రాణీ ముఖర్జీ (మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే) స్వీకరించారు. ఇదే వేడుకలో ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును మోహన్ లాల్‌కు ప్రదానం చేశారు. అంతకుముందు శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్ మాట్లాడుతూ.. "దాదా ఫాల్కే పురస్కారాన్ని నేను కలలో కూడా ఊహించలేదు. అంతా మ్యాజిక్ అనిపిస్తోంది. ఈ అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది. ఈ పురస్కారం నా ఒక్కడికే కాదు ఇది మలయాళ సినీ పరిశ్రమకు చెందుతుంది. మరింత బాధ్యతగా పనిచేస్తా" అని పేర్కొన్నారు. టాలీవుడ్ నుంచి ఉత్తమ చిత్రంగా 'భగవంత్ కేసరి' ఎంపిక కాగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి పురస్కారాలు అందుకున్నారు. సాయి రాజేశ్ (ఉత్తమ స్క్రీన్‌ప్లే- బేబీ సినిమా), పీవీఎన్ఎస్ రోహిత్ (ఉత్తమ నేపథ్య గాయకుడు- బేబీ మూవీ), ప్రశాంత్ వర్మ (హనుమాన్ సినిమా.. బెస్ట్ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్) హర్షవర్ధన్ రామేశ్వర్ (ఉత్తమ నేపథ్య సంగీతం- యానిమల్ మూవీ), సుకృతి వేణి (ఉత్తమ బాల నటి- గాంధీతాత చెట్టు) అవార్డులు పొందారు.



## దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసాల్లో కస్టమ్స్ సోదాలు

**జనంసాక్షి:**మలయాళ నటులు పృథ్వీరాజ్ సుకుమారన్ దుల్కర్ సల్మాన్ నివాసాల్లో మంగళవారం కస్టమ్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. లగ్జరీ కార్ల స్మగ్లింగ్ ఆరోపణలకు సంబంధించి నమోదైన కేసుపై కస్టమ్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. 'ఆపరేషన్ నమకూర్' పేరుతో దేశవ్యాప్తంగా పలువురు నివాసాల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా కోచి, తిరువనంతపురంలో ఉన్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఇళ్లతో పాటు, పనంపిల్లి నగర్‌లోని దుల్కర్ నివాసానికి వెళ్లి సోదాలు చేశారు. అయితే, వారివద్ద నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి విలాసవంతమైన వాహనాలను గుర్తించలేదని సమాచారం. కేవలం వీరి పైనే కాదు, కేరళ వ్యాప్తంగా కోచి, కోలికోడ్, మలప్పురం సహా వివిధ ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి.ఇంటెలిజెన్స్ వర్గాలు ఇచ్చిన నివేదికల ప్రకారం.. భూటాన్ ఆర్మీ తన వాహనశ్రేణిలోని కొన్ని ఖరీదైన వాహనాలను ఉపసంహరించుకుంది. వాటిని కొందరు ఏజెంట్లు వేలంలో అతితక్కువ ధరకు దక్కించుకున్నారు. వాటికి ఎలాంటి కస్టమ్స్ డ్యూటీ చెల్లించకుండా ఇండియాకు స్మగ్లింగ్ చేశారన్న సమాచారం బయటకు వచ్చింది.

## వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 23(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను వినియోగించుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన మెప్మా భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 లక్షల రూపాయలతో నిర్మించిన మహిళా భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా 3500 మందికి ఇందిరమ్మ ఇళ్ల ద్వారా 5 లక్షల రూపాయలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, 500 రూపాయలకే వంట గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతుందన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో రెండు కోట్ల రూపాయల రుణాలను మహిళలకు అందజేశారు. పట్టణ ప్రజలకు సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజు, కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నీలోఫర్ ఆస్పత్రిలో డాక్టర్ల కోసం హాస్టల్ బిల్డింగుల నిర్మాణం

- స్థల పరిశీలన చేసిన అధికారులు



హైదరాబాద్ (జనంసాక్షి) : నీలోఫర్ హాస్పిటల్ ప్రాంగణంలో 280 మంది డాక్టర్లు(పీజీ స్టూడెంట్స్, సీనియర్ రెసిడెంట్స్) ఉండేందుకు అనువుగా హాస్టల్ బిల్డింగ్స్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ అధ్యక్షతన నీలోఫర్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశాన్ని నీలోఫర్‌లో మంగళవారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి ఆదేశాల మేరకు హాస్టల్ బిల్డింగ్ నిర్మాణం కోసం నీలోఫర్ హాస్పిటల్ ప్రాంగణంలో స్థల పరిశీలన చేశారు. 180 మంది ఫీమేల్ డాక్టర్లు, 100 మంది మేల్‌డాక్టర్లకు సరిపడా భవనాలు నిర్మించేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసింది. ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించనున్నట్టు క్రిస్టినా ఓ ప్రకటనలో తెలిపారు. హాస్పిటల్ ప్రాంగణంలోనే హాస్టల్ ఉండడం డాక్టర్లతో పాటు, పేషెంట్లకు కూడా మేలు చేస్తుందన్నారు. వందలాది మంది డాక్టర్లు 24 గంటలపాటు హాస్పిటల్‌లోనే అందుబాటులో ఉంటారని, తద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె తెలిపారు. హాస్పిటల్ బిల్డింగ్ పైన నిర్మించిన ఐరన్ స్ట్రక్చర్‌ను త్వరలోనే వైద్య సేవల కోసం అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని, అవసరమైన రిపేర్లు చేయించాలని టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్ర రెడ్డికి క్రిస్టినా సూచించారు. హాస్పిటల్ ప్రాంగణంలో నిర్మించిన ధర్మశాల భవనాన్ని(జీ+3) నీలోఫర్ ఆరోగ్యశాఖకు అప్పగించాలని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌ను క్రిస్టినా ఆదేశించారు. 72 రూములు ఈ భవనంలో అందుబాటులో ఉన్నాయని, రోగుల సహాయకుల కోసం ఈ భవనాన్ని ఉపయోగిస్తామని ఆమె తెలిపారు. నీలోఫర్ హాస్పిటల్ బ్రాండింగ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను ఆమె ఆదేశించారు. హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, రద్దీని తగ్గించే అంశంపై సమావేశంలో చర్చించారు. సీఎస్ఆర్ ఫండ్స్‌తో గతంలో జరిపిన కొనుగోళ్లపై సమావేశంలో చర్చించారు. ఈ కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవడంపై సెక్రటరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఇకపై కొనుగోళ్లు అన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరపాలని ఆదేశించారు. అవసరమైన ఎక్విప్‌మెంట్ కోసం హాస్పిటల్ సూపరింటెండెంట్ ప్రతిపాదనలు రూపొందించాలని, ఆ ప్రతిపాదనలను డీఎంఈ పరిశీలించి, టీజీఎంఎస్ఐడీసీకి పంపించాలని సెక్రటరీ ఆదేశించారు. నిబంధనల ప్రకారం గ్లోబల్ టెండర్ల ద్వారా టీజీఎంఎస్ఐడీసీ కొనుగోళ్లు చేపట్టాలని ఆ సంస్థ ఎండీ ఫణీంద్ర రెడ్డికి సెక్రటరీ సూచించారు.

# ఆరోగ్యాంధ్రప్రదేశ్ మనందరి లక్ష్యం

- ఆరోగ్యం కాపాడుకోవడం అతి ముఖ్యం
- ఏపీలో 98 శాతం ఆస్పత్రుల్లోనే ప్రసవాలు
- సిజేరియన్ల నిరోధానికి తక్షణ చర్యలు
- అసెంబ్లీలో వైద్యారోగ్యశాఖపై చర్చలో సిఎం చంద్రబాబు



అమరావతి, సెప్టెంబర్23 (జనంసాక్షి) : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మనందరి ఆకాంక్ష అని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో మంగళవారం వైద్యా, ఆరోగ్య శాఖ పై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. 2026 నాటికి ఏపీలో 5.37 కోట్ల మంది జనాభా ఉంటారని వెల్లడించారు. 2047 నాటికి భారత్ జనాభా 162 కోట్లు దాటుతుందని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. 2047 నాటికి చైనా జనాభా 100 కోట్లే ఉంటుందని తెలిపారు. ఆరోగ్యం కాపాడుకోవడం అతి ముఖ్యమని సూచించారు. దక్షిణాదిలో జనాభా క్రమంగా తగ్గుతోందని చెప్పుకొచ్చారు. యూపీ, బిహార్ వల్లే జనాభా బ్యాలెన్స్ అవుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గుతోందని తెలిపారు. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య జాతీయ సగటు కంటే ఎక్కువ అని వివరించారు. డబళయ్యూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మనదగ్గరే ఎక్కువ అని చెప్పుకొచ్చారు. ఏపీలో ప్రస్తుతం 1.15 లక్షలమంది వైద్యులు ఉన్నారని వెల్లడించారు. భారతదేశంలో సగటు- జీవితకాలం 70 ఏళ్లు అని వివరించారు.మనదేశంలో ఇమ్యూనైజేషన్ 97 శాతమని చెప్పుకొచ్చారు. ఏపీలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 42 శాతమేనని వివరించారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించామని వెల్లడించారు. త్వరలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో 100 శాతం సాధిస్తామని ఉద్ఘాటించారు. గర్భిణుల్లో అనీమియా 32 శాతం ఉందని తెలిపారు. సిజేరియన్‌లో మనమే నెంబర్‌వన్.. ఇది సరికాదని చెప్పుకొచ్చారు. 90 శాతం సిజేరియన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో 90 శాతం సిజేరియన్ ఆపరేషన్లు ప్రైవేటు- ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని.. తమ ప్రభుత్వం ఇలాంటి ధోరణిని ఏమాత్రం ఆమోదించ బోదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గర్భిణులకు సురక్షిత ప్రసవంపై అవగాహన కల్పించాలని, యోగా నేర్పించే పరిస్థితి రావాలని.. దీనిపై ఇప్పటి నుంచే శ్రద్ధ పెట్టాలని, పిలిచి మాట్లాడాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు సూచించారు. ఎప్పుడైనా సరే ఆపరేషన్.. ఆపరేషనే. భగవంతుడు ఇచ్చిన సహజసిద్ధమైన శరీరాన్ని కోయడం మంచిది కాదు. సిజేరియన్‌లో అగ్రస్థానంలో ఉన్నాం.. ఇది సరికాదు. ఇలాంటివి ఎలా నియంత్రించాలో ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరిగితే.. అందులో 42 శాతం ప్రభుత్వాస్పత్రుల్లో జరుగుతున్నాయని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా క్రమంగా తగ్గుతోంది. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ తగ్గిపోతోంది. యూపీ, బిహార్ వల్లే భారత్‌లో జనాభా బ్యాలెన్స్ అవుతోంది. ఏపీలో పీహెచ్‌సీల సంఖ్య.. జాతీయ సగటు కంటే ఎక్కువగానే ఉంది. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం మెడికల్ ఆఫీసర్లు మన వద్ద ఎక్కువే ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.15 లక్షల మంది వైద్యులు ఉన్నారు. మన దేశంలో సగటు- జీవిత కాలం 70 ఏళ్లుగా ఉంది. ఇమ్యూనైజేషన్ 97 శాతం సాధించాం. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు 78 శాతం సాధించాం. త్వరలోనే వంద శాతం సాధిస్తాం. గర్భిణుల్లో అనీమియా 32 శాతంగా ఉందని వివరించారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- బిఆర్ఎస్ శ్రేణులకు హరీష్ రావు పిలుపు

సంగారెడ్డి, సెప్టెంబర్23 (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచించారు. మంగళవారం మునిపల్లి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండి.. పల్లెలో గులాబీలా జెండాలు ఎగిరే విధంగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలను గడపగడపకు వివరించాలని హరీష్ రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గ్రామాల్లో గడపగడపకూ వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు- వేసినందుకు రాష్టంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురవుతున్నారో ప్రజలకు గడపగడపకూ తిరిగి ప్రజలకు అర్థం అయ్యేలా వివరించాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు తప్పనిసరి.. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు వస్తుందని అన్నారు. కష్టకాలంలో పార్టీని బలోపేతం చేసేవారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసేవారికి తగిన గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి, మునిపల్లి మాజీ ఎంపీపీ శైలజ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మంతురి శశికుమార్, యువత అధ్యక్షుడు ఆనంద్, నాయకులు పెద్దలోడి వెంకటేశం, పెద్దలోడి మొగులయ్య, శంకరయ్య, విట్టల్, పాండు, నాగేష్, దత్తు, ఈశ్వరప్ప, సుధాకర్, పవన్ రెడ్డి, రవి తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ కుంటలో ఉత్సవాలకు ఆటంకాలు లేవు

- బతుకమ్మ కుంట కేసును అక్టోబర్ 9కి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) : అంబర్ పేటలోని బతుకమ్మకుంటలో ఈ నెల 26న జరపతలపెట్టిన బతుకమ్మ ఉత్సవాలకు ఆటంకాలు తొలగాయి. బతుకమ్మకుంట ప్రారంభోత్సవాన్ని, అక్కడ నిర్వహిస్తున్న ఉత్సవాలను ఆపాలంటూ అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్ తో దశాబ్దాలుగా పోరాడుతున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి వేసిన పిటిషన్ పై విచారణను అక్టోబర్ 9కి హైకోర్టు వాయిదా వేసింది. గతంలోనే అక్కడ పనులు చేసుకునేందుకు అనుమతిచ్చిన హైకోర్టు అక్కడ ఈ నెల 26న నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ ఉత్సవాల విషయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. దీంతో అక్కడ ఉత్సవాలు గతంలో నిర్ణయించిన మేరకు ఈ నెల 26న జరుగుతాయని హైడ్రా స్పష్టం చేసింది.

## వైద్య పద్ధతులకు ఆద్యం ‘ఆయుర్వేద వైద్యం’

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి , సెప్టెంబర్ 23 (జనంసాక్షి) : ప్రపంచంలోని వివిధ వైద్య పద్ధతులకు భారతీయ ఆయుర్వేద వైద్యం ఆద్యం పోసిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం 10వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆర్.ఎం.ఓ. భీష్మ, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రారెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వివిధ రకాల వైద్య పద్ధతులకు భారతీయ ఆయుర్వేద వైద్యం పునాది లాంటిదని అన్నారు. నాచురోపతి, యునాని, యోగ ఇతర అనేక పద్ధతులను వినియోగించి అనేక రకాల వ్యాధులను తగ్గించడం జరుగుతుందని తెలిపారు. ఆయుర్వేద పద్ధతుల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రించవచ్చని, ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా దైనందిన జీవితంలో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. జిల్లాలో ఆయుష్ వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారని, మధుమేహం, రక్త పోటు, వివిధ రకాల వ్యాధులకు వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌లో ఏటా పెరుగుతున్న మరణశిక్షలు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న మానవహక్కుల సంఘాలు

టెహ్రాన్, సెప్టెంబర్23 (జనంసాక్షి) : ఇరాన్‌లో మరణశిక్షలపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్‌లో ఏటా మరణశిక్షలు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నాయి. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల ఈ శిక్షలను ఇరాన్ అమలు చేయడం గమనార్హం.. గతేడాది దాదాపు 975 మందికి మరణశిక్ష అమలు చేసినట్లు అంచనా. ఈ ఏడాది ఇప్పటికే ఆ సంఖ్య దాటిపోయిందని నార్వే కేంద్రంగా పని చేసే ఐహెచ్‌ఆర్ వెల్లడించింది. బాహ్య ప్రపంచానికి తెలిసిన దానికంటే వాస్తవానికి ఈ సంఖ్య మరింత ఎక్కువగానే ఉండవచ్చని ఐహెచ్‌ఆర్ డైరెక్టర్ మహమూద్ అమిరీ మొగద్దాం పేర్కొన్నారు. గడిచిన వారం వ్యవధిలోనే 64 మందికి మరణశిక్ష అమలు చేసిందని, సరాసరి నిత్యం తొమ్మిది మందిని ఉరి తీసినట్లు- ఇరాన్ మానవ హక్కుల బృందం వెల్లడించింది. మొత్తంగా ఏడాది ఇప్పటికే 1000 మందికి మరణదండన అమలు చేసిందని అంచనా వేసింది. గతంలో అనేక విధాలుగా మరణదండన అమలు చేసిన ఇరాన్.. ప్రస్తుతం ఉరిశిక్ష ద్వారానే ఎక్కువగా అమలు చేస్తోందని సమాచారం. అత్యధికం జైళ్లలో చేపడుతున్నప్పటికీ.. బహిరంగ శిక్షలు కూడా చేపడుతోంది. హత్య, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అత్యాచారం, లైంగిక దాడి వంటి నేరాలకు ఈ తీవ్ర శిక్ష విధించి అమలు చేస్తోంది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా పలు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థల ప్రకారం.. చైనా తర్వాత అత్యధిక సంఖ్యలో మరణదండన అమలు చేస్తున్న దేశాల్లో ఇరాన్ రెండో స్థానంలో ఉంది. బీజింగ్ ఏటా వేలాది మందికి మరణశిక్ష అమలు చేస్తుందనే వాదన ఉన్నప్పటికీ.. ఈ విషయంలో పూర్తి వివరాలు అందుబాటులో లేవు.



## దసరా సెలవుల్లోపు వర్క్ అడ్జస్ట్‌మెంట్ సర్దుబాటు చేయండి

- నాగర్‌కర్నూల్ డీఈవోకు టీఆర్టీఎఫ్ వినతి

నాగర్‌కర్నూల్ (జనంసాక్షి) : జిల్లాలోని ప్రతి మండలంలో ప్రమోషన్ ట్రాన్స్ఫర్ ద్వారా ఏర్పడ్డ ఖాళీలను ఈ దసరా సెలవులు లోపు వర్క్ అడ్జస్ట్మెంట్ ద్వారా సర్దుబాటు చేయాలని నాగర్ కర్నూలు జిల్లా టిఆర్టిఎఫ్ జనరల్ సెక్రెటరీ మునగాల సతీష్ కుమార్ జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యంగా నలుగురు పని చేస్తున్న పాఠశాలలో ముగ్గురు ప్రమోషన్ ద్వారా వెళ్లడంతో ఒకే ఉపాధ్యాడి తో పాఠశాల సామూహిక విద్య బోధన ఎంతో ఇబ్బందికరంగా సాగుతున్న తరుణంలో.. ఆన్లైన్ డీఎస్సీ ఎఫ్ఆర్ఎస్ వర్క్‌లతో ఒత్తిడికి గురవుతున్నారని, ఇటువంటి పరిస్థితులలో.. ఉపాధ్యాయుల వర్కర్స్మెంట్ చేసి, బోధనను సులభతరం చేసి ,ప్రాథమిక విద్యను బలోపేతం చేయవలసిందిగా పాఠశాలలో ఉండవలసిన మౌలిక వసతుల గురించి కూడా డీఈఓతో చర్చించారు. దసరా సెలవుల్లోపు కచ్చితంగా వర్కర్మెంట్ చేయవలసిందిగా ఎంఈఓ లకు ఆదేశాలు లిచ్చారని, ఇప్పటికే జిల్లాలో దాదాపు 89 మంది ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్మెంట్మెంట్ ఇచ్చామని. ఇది నిరంతర ప్రక్రియని.. బీఈడీ చేయడానికి వెళ్ళిన ఇన్ సర్వీస్ టీచర్ల వర్కింగ్ ప్లేస్ లో కూడా విద్యార్థుల బోధనకు ఇబ్బంది కాకుండా..వర్కర్స్మెంట్ కోసం ముందుకు వెళ్తున్నామని...,. అవసరమైతే కార్యాచరణలో ముందుకు వెళ్ళడానికి ముఖ్యంగా ప్రాథమిక విద్య బలోపేతం చేయడానికి ఎటువంటి రాజీకి రావాల్సిన అవసరం లేదని చెప్పారు.

# ఒక విజన్‌తో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్న సీఎం

- అంచెలంచెలుగా ప్రజల చెంతకు చేరుతున్న పథకాలు
- ధరణిని తెచ్చి పేదల హక్కులను కాలరాసిన కేసీఆర్
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సీఎం రేవంత్ రెడ్డి ఒక విజన్ తో తెలంగాణ ను ముందుకు తీసుకెళ్తున్నారని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా ప్రజల చెంతకు చేరుతున్నాయని రాష్ట్ర ఎస్సి, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్లబుద్ధారం నుండి రాజునాయక్ కుంట వరకు, దూదేకులపల్లి నుండి రేగడి గుట్ట వరకు రూ.4.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. గొల్లబుద్ధారంలో జరిగిన సమావేశంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత పాలనలో కేసీఆర్ ధరణిని తెచ్చి పేదల హక్కులను కాలరాశాడని, పేదల పొట్ట కొట్టాడని విమర్శించారు. అప్పట్లో పాదయాత్ర చేసినపుడే సీఎం రేవంత్ రెడ్డి ధరణిని బంగాళాఖాతంలోకి తొక్కుతామని చెప్పాడని, ప్రజలకు ఇచ్చిన హామి మేరకు ప్రజలకు ఉపయోగ పడే భూభారతిని తీసుకువచ్చి తగు న్యాయం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి అనేక పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో మహిళా శక్తి కార్యక్రమం ద్వార పెట్రోల్ బంకులు, బస్సులు, ఇతర వ్యాపారాలు చేసే విధంగా వడ్డీ లేని రుణాలు అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కనీసం రేషన్ కార్డులు అందించలేని దుస్థితికి చేరిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు అందించి, దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజలకు సన్న బియ్యం అందిస్తున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి అని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం తెచ్చి పేదప్రజల సొంతింటి కల నిజం చేస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో ఎస్సి, ఎస్టీ నిధుల నుండి ఇప్పటివరకు రూ.740 కోట్లతో గిరిజన తండాలు, ఆదివాసీల గుడాలకు పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ఇప్పటికి ఈ నియోజక వర్గానికి రూ.4.30 కోట్లు ఇచ్చామని తెలిపారు. ఇంకా ఆదివాసీ గిరిజన తండాల అభివృద్ధికి రూ.6 కోట్ల రూపాయలు నిధులు కావాలని ఎమ్మెల్యే కోరిన విధంగా భూపాలపల్లి నియోజక వర్గం అభివృద్ధికి కచ్చితంగా కృషి చేస్తానని హామి ఇచ్చారు. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలల్లో పని చేసే వంట మనుషులకు రెండు మూడు రోజులలో వారికి డబ్బులు జమ అయ్యేలా కృషి చేస్తానని, ఈ ప్రాంతంలో యూరియా కొరత లేకుండా ఉండేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మంత్రి అయిన తర్వాత మొట్ట మొదటి ప్రజా అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే సత్యనారాయణ రావు మాట్లాడుతూ నాలుగు కోట్ల 30 లక్షలతో గ్రామాల లో అంతర్గత రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. 10 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ చేయని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇండ్ల నిర్మాణాలు, ఉచిత విద్యుత్, ఇలా అనేక పథకాలు ప్రజలకు చేరువ చేయడం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గొప్ప విజన్ తో మేడారంను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మేడారం నుండి గొల్లబుద్ధారం వరకు శాశ్వత ప్రాతిపదిక రోడ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించుకోవడం జరిగిందని సాధ్యమైనంత తొందరలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, ఎస్పీ నరేష్ కుమార్, ఆర్టీఏ మెంబర్ సుంకరి రాంచందర్, తోట రంజిత్, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
24 సెప్టెంబర్ 2025

## మైనార్టీల హక్కుల అణచివేతలో కాంగ్రెస్, బీజేపీలు

# ‘దొందూ దొందే’



భారత రాజకీయ చరిత్రలో మైనారిటీల హక్కులు ఎల్లప్పుడూ చర్చనీయాంశంగా ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలనలో ప్రవేశపెట్టిన ప్రత్యేక ఎలక్టరేట్లు మైనారిటీలకు రాజకీయ గుర్తింపును కల్పించినప్పటికీ, స్వాతంత్ర్యం తర్వాత ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మరియు ఆధునిక కాలంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఈ హక్కులను వివిధ రూపాల్లో బలహీనపరిచాయి. ఈ రెండు ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎజెండాలను ముందుకు తీసుకెళ్లడానికి మైనారిటీలను ఉపయోగించుకుని, వారి సామాజిక-రాజకీయ శక్తిని క్షీణింపజేశాయి.

**ఇప్పటి కాంగ్రెస్, బీజేపీ ల కంటే బ్రిటిష్ వాళ్ళే నయం:**
బ్రిటిష్ పాలనలో మైనారిటీలకు ప్రత్యేక రాజకీయ హక్కులు ఏర్పడిన నేపథ్యం గమనార్హం. 1909లో మింటో-మార్లే సంస్కరణలు (ఇండియన్ కౌన్సిల్స్ యాక్ట్) ముస్లింలకు ప్రత్యేక ఎలక్టరేట్లను ప్రవేశపెట్టాయి. దీని ద్వారా ముస్లిం ఓటర్లు తమ సముదాయ అభ్యర్థులను మాత్రమే ఎన్నుకునే అవకాశం పొందారు. ఉదాహరణకు, యునైటెడ్ ప్రావిన్సెస్‌లో ముస్లిం జనాభా 14 శాతం ఉన్నప్పటికీ, వారికి 30 శాతం సీట్లు కేటాయించబడ్డాయి. ఈ సంస్కరణలు బ్రిటిష్ వలసవాదుల ‘విభజించి పాలించు’ విధానంలో భాగంగా విమర్శించబడినప్పటికీ, మైనారిటీలకు రాజకీయ గుర్తింపును అందించాయి. 1919లో మాంటేగ్-చెమ్స్‌ఫోర్డ్ సంస్కరణలు (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్) ఈ విధానాన్ని ముస్లింలతో పాటు, సిక్కులు, క్రైస్తవులు, ఆంగ్లో-ఇండియన్లకు కూడా విస్తరించాయి, కానీ ఓటు హక్కు పరిమితంగా ఉండటం వల్ల సామాన్య మైనారిటీలకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. 1930లో సైమన్ కమిషన్ నివేదిక ఈ ప్రత్యేక ఎలక్టరేట్లను కొనసాగించాలని సిఫార్సు చేసింది. అయితే భారతీయ సభ్యులు లేకపోవడంతో కాంగ్రెస్, ముస్లిం లీగ్ దీన్ని బహిష్కరించాయి. ఈ సంస్కరణలు మైనారిటీల రాజకీయ శక్తిని పెంచినప్పటికీ, వలసవాద లక్ష్యాలకు సేవ చేసే ఉపకరణాలుగా మిగిలాయి.

**జాతీయ కాంగ్రెస్ నిర్వాకం:**
ఆ నాటి జాతీయ కాంగ్రెస్ పార్టీ ఈ సంస్కరణలపై ద్వంద్వ వైఖరిని ప్రదర్శించింది. స్వాతంత్ర్యానికి ముందు, మింటో-మార్లే సంస్కరణలను ‘విభజన విధానం’గా విమర్శించింది. అయితే, 1916లో లక్నో ఒప్పందంలో ముస్లిం లీగ్‌తో ఒక రాజకీయ ఒప్పందం కుదుర్చుకుని, ప్రత్యేక ఎలక్టరేట్లను తాత్కాలికంగా అంగీకరించింది. ఈ చర్య హిందూ-ముస్లిం ఐక్యత కోసం వ్యూహాత్మకంగా చేసినప్పటికీ, రాజకీయ లాభాల కోసం తీసుకున్న నిర్ణయంగా దీనిని చూడవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత, 1950 భారత రాజ్యాంగం ఆర్టికల్ 325, 326 ద్వారా ప్రత్యేక ఎలక్టరేట్లను రద్దు చేసి, సెక్యులరిజం ఆధారంగా ఏకీకృత ఓటింగ్ విధానాన్ని అమలు చేసింది. ఈ చర్య మైనారిటీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని గణనీయంగా బలహీనపరిచింది. ఉదాహరణకు, 1952లో మొదటి లోక్‌సభ ఎన్నికల్లో ముస్లిం ఎంపీల ప్రాతినిధ్యం 4-5 శాతం మాత్రమే ఉంది, జనాభాలో వారి వాటా 10 శాతం ఉన్నప్పటికీ. ఈ నిర్ణయం సెక్యులర్ ఆదర్శాలను ప్రోత్సహించినట్లు కనిపించినప్పటికీ, మైనారిటీల రాజకీయ గొంతుకను కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేసింది.
2004లో ఏర్పాటైన రంగనాథ్ మిశ్రా కమిషన్ మైనారిటీలలో వెనుకబడిన వర్గాలకు (ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు) రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. 2007లో సమర్పించిన నివేదికలో, ముస్లింలకు 10 శాతం, ఇతర మైనారిటీలకు 5 శాతం కోటా, విద్యా సంస్థల్లో 15 శాతం సీట్లు, స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయం పెంచాలని ప్రతిపాదించింది. అలాగే, 50 శాతం రిజర్వేషన్ సీలింగ్‌ను సడలించాలని సూచించింది. 2011 నుండి కొన్ని రాష్ట్రాల్లో ఈ సిఫార్సులు అమలైనప్పటికీ, పూర్తి అమలు నిరోధించబడింది. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో విద్యా అవకాశాలు 20 శాతం పెరిగినప్పటికీ, దేశవ్యాప్తంగా మైనారిటీల ఉద్యోగ ప్రాతినిధ్యం 5-7 శాతం మాత్రమే ఉంది. ఈ పరిమిత అమలు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం రాజకీయ ఒత్తిళ్లకు లోనై సమర్థవంతంగా చర్యలు తీసుకోలేకపోయిందని సూచిస్తుంది.

**మైనారిటీల పట్ల బీజేపీ వివక్షత:**
2014 తర్వాత బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, మైనారిటీల హక్కులపై ఒత్తిడి మరింత తీవ్రమైంది. ‘సబ్ కా సాత్, సబ్ కా వికాస్’ నినాదం ఉన్నప్పటికీ, బీజేపీ హిందుత్వ భావజాలం ఏకరూప జాతీయ గుర్తింపును ప్రోత్సహించి, మైనారిటీలను సమాజం అంచులకు నెట్టివేసింది. 2019లో ఆర్టికల్ 370 రద్దు, జమ్మూ-కాశ్మీర్‌లో ముస్లిం మెజారిటీ ప్రాంతాన్ని రాజకీయంగా బలహీనపరిచింది. సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సీఏఏ) ముస్లింలను మినహాయించి ఇతర మతాల రెఫ్యూజీలకు పౌరసత్వం కల్పించడం వివక్షను స్పష్టం చేసింది. హ్యూమన్ రైట్స్ వాచ్ వంటి సంస్థలు ఈ చర్యలను ముస్లింలను లక్ష్యంగా చేసినవిగా విమర్శించాయి. గణాంకాలు ఈ ప్రభావాన్ని స్పష్టం చేస్తాయి: 2024 లోక్‌సభలో ముస్లిం ఎంపీలు 4.42 శాతం (24 మంది) మాత్రమే, జనాభాలో వారి వాటా 15 శాతం ఉన్నప్పటికీ. సివిల్ సర్వీసెస్‌లో ముస్లిం ప్రాతినిధ్యం 3-4 శాతం మాత్రమే, 1950ల నుండి స్థిరంగా తగ్గుతోంది. ఈ విధానాలు జాతీయవాదం పేరిట సమర్థించనప్పటికీ, మైనారిటీలకు మాత్రం సామాజిక-ఆర్థిక వెనుకబాటును పెంచాయి.ప్రస్తుత పార్లమెంటులో ముస్లింల జనాభాకు తగినట్లుగా ప్రాతినిధ్యమే లేదు.


**మైనారిటీలకు కాంగ్రెస్, బీజేపీలు సమానంగా ద్రోహం చేశాయి:**
కాంగ్రెస్ మరియు బీజేపీలు ప్రత్యేక ఎలక్టరేట్లను వ్యతిరేకించడంలో సమానమైన వైఖరి కలిగి ఉన్నాయి, అయితే వాటి ఉద్దేశాలు భిన్నంగా ఉన్నాయి. కాంగ్రెస్ సెక్యులరిజం పేరిట, బీజేపీ హిందుత్వ జాతీయవాదం ఆధారంగా ఈ చర్యలను తీసుకున్నాయి. రెండూ మైనారిటీల రాజకీయ శక్తిని క్షీణింపజేశాయి. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ దృక్పథం ఇక్కడ కీలకం. 1919లో సౌత్‌బరో కమిటీకి సమర్పించిన విజ్ఞాపనలో ఆయన మైనారిటీలకు ప్రత్యేక ప్రాతినిధ్యం, సార్వత్రిక ఓటు హక్కు కోసం వాదించారు. కానీ, కాంగ్రెస్ మరియు బీజేపీ విధానాలు డాక్టర్ .బీ.ఆర్.అంబేద్కర్ ఆదర్శాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయి, మైనారిటీలను శాశ్వత మైనారిటీలుగా మార్చాయి.
ఈ అణచివేతలు భారత రాజ్యాంగం ఆర్టికల్ 14 సమానత్వ ఆదర్శాలకు విరుద్ధం. మైనారిటీలు స్వయం చైతన్యంతో ఉద్యమించి, తమ రాజకీయ హక్కుల కోసం పోరాడాలి. ఇది కేవలం మతపరమైన అంశం మాత్రమే కాదు, సామాజిక న్యాయం మరియు సమానత్వానికి సంబంధించిన పోరాటం. కాంగ్రెస్ మరియు బీజేపీలు ‘దొందూ దొందే’ అనే సామెతకు అనుగుణంగా మైనారిటీల హక్కులను అణచివేస్తున్నాయి.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# సత్యశోధనతోనే సమానత్వ విప్లవం

**(సత్యశోధక సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సెప్టెంబర్ 24)**



భారతదేశ చరిత్రలో ఆధునిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే. దేశంలో సామాజిక సమానత్వం కొరకు పోరాడుతూ రాజకీయ చైతన్యం రగిలించిన వ్యక్తి. శూద్ర కులాలకు జరుగుతున్న అవమానాన్ని ప్రత్యక్షంగా అనుభవిం చాడు. ఒక బానిసకు అవమానం ఏంటో, ఆత్మగౌరవం ఏంటో తెలియాలనీ బయలుదేరాడు. ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల పక్షాన యుద్ధం ప్రకటించాడు. వారికి పడ్డ బానిస సంకెళ్లను విప్పడానికి విద్యను విముక్తి మార్గంగా ఎంచుకొన్నారు. అంధకారాన్ని తరిమిన జ్ఞాన విప్లవం ఇది. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేకి విద్య నేర్పించి మహిళలు, బాలికలకు చదువుచెప్పించాడు. ఆమె దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయు రాలు. బాలికలకు పాఠశాలలను నెలకొల్పారు. కోట్లాది ప్రజలకు దారి చూపిన గొప్ప ఆది దంపతులు వీరు. జ్యోతిరావు పూలే విప్లవ పోరాటానికి ఆయన నెలకొల్పిన సత్యశోధక్ సమాజ్ మూలస్తంభం లాంటిది. 19వ శతాబ్దం నాటి సాంప్రదాయక, చాందస భావాలతో నిండిన మనువాద సమాజాన్ని సంస్కరించడానికి బ్రహ్మ సమాజ్, ఆర్య సమాజ్ సంస్థలు పుట్టాయి. అవి కేవలం ఉన్నత కులాలకే పరిమితమయ్యాయి. ఈ క్రమంలో వాటికి అభిముఖంగా అట్టడుగు అణగారిన వర్గాల విముక్తికి సత్యశోధన సమాజం యుద్ధ నాదాన్ని మోగించింది. ఇదీ 1873 సెప్టెంబర్ 24న మహారాష్ట్రలోని పూణేలో ఏర్పడింది. ఈ సమాజం ఆధ్వర్యంలో బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, కులవ్యవస్థను ప్రశ్నించింది. మహిళల మరియు అణచివేతకు గురైన వర్గాల విద్య, సామాజిక హక్కులు, రాజకీయ చైతన్యం కోసం పనిచేసింది. ఈ సంస్థ స్థాపించి 150 ఏళ్ల మైలు రాయిని దాటింది. అసమానతలు, కుల పోరాటాలు ఇప్పటికి ధ్వనిస్తున్న కాలంలో పూలే సాగించిన సామాజిక సమరం నేటికి అనుసరణీయం. ఆ మహాత్ముని బాటలో మనం ఏ విధంగా నడుస్తున్నామనేది ఒకసారి ఆలోచించుకోవాల్సిన సందర్భం ఇదే.

**వారసత్వ జ్ఞానంతో సమానత్వ సమరం.**
సత్యశోధక్ సమాజ్ అంటే సత్యాన్వేష’ కుల’ సంఘం. ఇదీ జాతి చారిత్రక వారసత్వ జ్ఞానంతో ఆత్మగౌరవ పోరాటం చేయమంటుంది. ఈ క్రమంలో పూలే దేశంలో వేల సంవత్సరాలగా అణిచివేయబడిన వర్గాల చరిత్రను వెలికితీశారు. వారి సామాజిక స్థితికి కారణాలను బయటపెట్టాడు. కడపటి వాడే ఈ దేశాన్ని పాలించిన మొట్టమొదటి మహారాజ్ అనీ పిలుపునిచ్చాడు. ఊరికి దూరంగా జీవిస్తున్న నేటి మాదిగలే ఒకప్పుడు ఈ దేశాన్ని పాలించారనీ మరుగున పడిన చారిత్రక సత్యాన్ని చెప్పాడు. దీన్ని ఇప్పటికీ ఎంతమంది మాదిగలు ఒంటబ్టించుకున్నారనేది ప్రశ్నార్థకమే?. సత్యశోధక్ సమాజ్ లో బ్రాహ్మణులు, ధనవంతులు, ఉన్నత ఆదాయ వర్గాలకు సభ్యత్వానికి అవకాశం లేదు, కేవలం అణచివేతకు గురైన వర్గాలకు మాత్రమే సభ్యత్వం ఇచ్చారు. మహారాష్ట్రలోని పట్టణ నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఉద్యమం వేగంగా విస్తరించింది. ఆయన సహధర్మిణి సావిత్రిబాయి మహిళల విభాగానికి నాయకత్వం వహించారు. దీన బంధు” అనే వార్తాపత్రిక ద్వారా ఈ ఉద్యమాన్ని విస్తరించాడు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు. పురోహితులు లేకుండా వివాహాలు జరిపాడు. కులం, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారు. వీటన్నిటిపై ప్రశ్నల వర్షంగా తన గులాంగిరి గ్రంథం నిలిచింది. పూలే చైతన్యంతో ఆనాటి కాలంలో నాయి బ్రాహ్మణులు(మంగలి) బ్రాహ్మణ ఆధిపత్య వర్గాలకు క్షౌరాన్ని తీయడం ఆపేశారు. వీరికి సంఘీభావంగా పారిష్ నగరంలో కూడా సెలూన్ షాప్ లు మూసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో వారు ఒకరి గుండు ఒకరు తీసుకున్నారు. దేశం దాటిన ఈ చైతన్యం, ధిక్కార స్వరం చరిత్రలోనే అరుదైన సంఘటన. ఇలా ఒక వ్యక్తిగా, సంస్థగా అణగారిన వర్గాల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం జీవిత కాలం పోరాటం చేశాడు. పూలే మరణానంతరం కూడా ఆయన ఉద్యమాన్ని తన సతీమణి ముందుకు తీసుకెళ్లారు. షాహు మహారాజ్ భావురావు పాటిల్ వంటి నాయకులు కూడా పూలే వారసత్వాన్ని కొంతవరకు కొనసాగించారు. ఆయన మహోన్నత పోరాటం బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయునికి స్ఫూర్తినిచ్చాయి. పూలేను గురువుగా ప్రకటించుకొని వారసత్వ ఉద్యమాన్ని కొనసాగించాడు. ఆయన కోరుకున్న సామాజిక, రాజకీయ మార్పును భారత రాజ్యాంగంలో పొందుపరిచాడు. కోట్ల మందికి విముక్తి ప్రదాత అయ్యాడు.ఆధునిక భారతీయ సమాజ స్థాపనకు పూలే మార్గదర్శకంగా నిలిచాడు. మానవ హక్కుల క్రాంతిగా ఉదయించాడు. కానీ పూలే స్థాపించిన సంస్థకు ఆశించిన స్థాయిలో ప్రచారం లేకపోవడం బాధాకరం. కుట్ర పూరితంగా 1930 కాంగ్రెస్ లో కలిపారు. కనుమరుగుచేశారు. పూలే పోరాటం మరోమారు ధ్వనించాలి.
నేడు రాజ్యాంగం వచ్చి విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగైనప్పటికీ అట్టడుగు వర్గాల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదు. ఇంకా కులం పేరుతో దుర్విచక్షణ ఛాయలు కొనసాగుతున్నాయి. మహిళా సమానత్వంలోనూ వివక్షత ఉంది. అగ్రకుల పాలకుల ప్రోద్బలంతో విద్యా వ్యాపారంగా మారింది. అనేక సామాజిక రుగ్మతలు ఇంకా ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో సమాజంలో జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక సమాజం సిద్ధాంతాలు, పోరాట లక్ష్యాలు అత్యంత ప్రాధాన్యత కలిగిన్నాయి. భారత దేశంలో ఇంకా మెజారిటీ వర్గాలకు వారి జనాభా ప్రకారం అవకాశాలు అందడం లేదు. వీటి కొరకు జరుగుతున్న ఉద్యమాలు విఫల ప్రయత్నం అవుతున్నాయి. దేశంలోని వెనుకబడిన వర్గాలు పూలే, అంబేద్కర్ సిద్ధాంతాల తో రకరకాల సంఘాలను పెడుతున్నారు. ఇవి అగ్రకుల పాలకుల ఓరలోనే బందీ అవుతున్నాయి. మహనీయులను సంఘ సంస్కర్తలుగా కీర్తిస్తూ విగ్రహాల స్థాపన, పుస్తకాలు, పెన్నులు పంపిణీకే పరిమితం చేస్తున్నారు. రాజ్యాంగం ద్వారా లబ్ధి పొందిన ఉద్యోగ వర్గం సైతం ఇదే బాటలో ప్రయాణిస్తున్నారు. వెరసి అంబేద్కర్, పూలే వారసులమని చెప్పుకోవడం బాధాకరం. క్షేత్రస్థాయిలో వారి సైదాంతిక విప్లవ పోరాటాన్ని ఏమేరకు తీసుకుపోతున్నమనేది ఆత్మ విమర్శ చేసుకోవాలి. పూలే 1876 సంవత్సరం లోనే పూణె నగర మున్సిపల్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నికై రాజకీయాల్లోకి ప్రవేశించాడు. ఈ పదవిలో ఉంటూ ప్రజా సంక్షేమం, సామాజిక సమానత్వం, విద్య, నిరక్షరాస్యత వంటి అంశాలను పురోగతి కోసం అలుపెరుగని పోరాటం చేశాడు. నేడు రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా ఎంతోమంది బీసీ, ఎస్సీ ,ఎస్టీలు అధికారంలోకి వస్తున్నప్పటికీ...తన జాతి విముక్తికి పాటుపడకపోవడం గమనార్హం. పూలే చైతన్యాన్ని దారి తప్పిస్తూ ఆత్మగౌరవం లేకుండా అమ్ముడుపోతున్నారు. ఈ క్రమంలో ఆయన విలువలు పోరాట స్ఫూర్తి అణిచివేయబడిన వర్గాల గొంతుకగా కావాలి. ఇందుకై పూలే సత్యశోధన సమాజం పోరాటం మరోమారు ప్రతి ఒక్కరి గుండెల్లో ధ్వనించాలి. అంతిమంగా అణగారిన వర్గాలు రాజకీయ భాగస్వామ్యమే విముక్తి మార్గంగా నిలవాలి.



**సంపతి రమేష్ మహారాజ్**
సామాజిక విశ్లేషకులు
7989579428.

## అక్షరాల్లో

అక్షరాల్లో తడిచిపోయా,
పిల్లవాడినై ఆటలాడా.
అక్షరాల్లో కొట్టుకుపోయా,
పడవనై తేలియాడా.
అక్షరాల్లో మునిగిపోయా,
జలచరమై జీవించా.
అక్షరాల్లో పడిపోయా,
చేపనై ఈతకొట్టా.
అక్షరాల్లో కూరుకుపోయా,
వనజానై వికసించా.
అక్షరాల్లో అందాలుచూచా,
మన్మధబాణాన్ని విసిరా.
అక్షరాల్లో ఇరుక్కుపోయా,
పిపాసకుడనై పీయూషముత్రాగా.
అక్షరాల్లో ఒదిగిపోయా,
ఆయస్కాంతమై
హృదయాలనులాగా.
అక్షరాల్లో పయనించా,
అన్వేషకుడనై
మార్గాలుకనుగొన్నా.




అక్షరాల్లో ఇమిడిపోయా,
సాహిత్యరూపాన్ని
సంతరించుకున్నా.
అక్షరాల్లో ఆసీనుడనయ్యా,
అంతర్భాగమై అలరించా.
అక్షరాల్లో జీవించా,
అనుభూతులను వెల్లడించా.

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**

## నిర్వేదన

ఓ నా యజమాని
నేను
ధనవంతుడను
సుసంపన్నుడను
రాజును
మంత్రిని
కాను కాను
ఈ రాజ్యం లోను
నీ రాజ్యం లోను
కష్టాన్ని నమ్ముకున్న
నేనొక బిచ్చగాడిని

**రేడియమ్**
9291527757

## బోధివృక్షం కాదది

నియమాలు మరిచి
జాతి వనరులనే హరించి
అత్యాశ నీడలో బలశాలులై
ప్రమాణాలు విడిచి
దేశ సంపదలనే కబళించి
దురాశ క్రీడలో మల్లయోధులై
వక్రమార్గంలో నడిచారు
ప్రజావిశ్వాసం కోల్పోయారు
స్వలాభం ఆశగా హవాలా ఆలోచనలు
స్వార్థం శ్వాసగా దివాలా ఆవేశాలు
చెట్టంతా చెదలైనప్పుడు
నరుక్కుంటూ రావాలి
భ్రమలు వీడండి బోధివృక్షం కాదది
కబోధులను సృష్టించిన కాలవృక్షం

**కోటం చంద్రశేఖర్**

## నేటి రాజకీయం..!

రంగు రంగుల ఆశలు
చుక్కల మధ్య చంద్రుడు
చుట్టూ వలయాకారం
ఏ గుడ్డ ఏ రంగును
పులుముకుంటుందో తెలీదు
కుర్చీల పందేలు
ఆర్భాటపు హంగులు
లేనిపోని పొంగులు
మాటల కెరటాల ఎగసిపాట్లు
పార్టీల తుఫాను దారుల్లో
సాగలేక సాగుతున్న ఓడలు
మీసం రాజ్యమేలుతుంది
పౌరుషం శాసనం రాస్తుంది
ఒప్పందం కరెన్సీని మింగుతుంది



వైకల్యపు పథకాలతో
విలక్షణంగా షికారు చేస్తుంది
నేటి రాజకీయం రంగులరాట్నం
అంతా విద్దూరాల సంగమం

**- నరెద్దుల రాజారెడ్డి**
ఫోన్: 9666016636


# అనుభవాల సముద్రంలో ఉద్యమ నౌక “అఖిల భారత పర్యటన-విభిన్న ఉద్యమాలు”

ప్రముఖ రచయిత, తత్వవేత్త బిఎస్ రాములు రచించిన “అఖిల భారత పర్యటన-విభిన్న ఉద్యమాలు” పుస్తకం, ఆకాశమంత విస్తృతమైనది. సముద్ర మంత లోతైన అనుభవాల ఉద్యమ నౌక. హేగెల్ సిద్ధాంతం ప్రకారం, రెండు ఆలోచనల మధ్య సంఘర్షణ నుంచి కొత్త, ఉన్నతమైన ఆలోచన లేదా స్థితి ఉద్భవిస్తుంది. ఈ ఆలోచనలను పంచుకుని, చర్చించుకునే ప్రక్రియలో పాల్గొన్నవారు అపారమైన అనుభవాలను సంపాదిస్తారు. ఇటువంటి అనుభవాలు సిద్ధాంతాలను మెరుగుపరచడానికి, సామాజిక-రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అన్వయించడానికి దోహదపడతాయి. ఈ పుస్తకం బిఎస్ రాములు ఉద్యమ జీవితంలోని సమగ్ర అనుభవాలను, ఆలోచనలను, సిద్ధాంతపరమైన చర్చలను విశ్లేషణాత్మకంగా అందిస్తుంది.
బిఎస్ రాములు పీపుల్స్ వార్ ప్రజాసంఘం, రాడికల్ యూత్ లీగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బహిరంగంగా, రహస్యంగా పనిచేసిన కాలంలో, పీపుల్స్ వార్ కేంద్ర నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావు (ప్రహ్లాద్) పార్టీ అనుబంధ ప్రజాసంఘాల ముఖ్యులను సమావేశపరిచి, ప్రభుత్వ నిర్బంధ పరిస్థితులను వివరించారు. అండర్‌గ్రౌండ్‌లో పనిచేయాలా లేక జైలుకు వెళ్లాలా అని అడిగినప్పుడు, రాములు, “పార్టీ రహస్య జీవితంలోకి రాము, జైలుకు పోము. మన ప్రజాసంఘాల తరపున ఇతర రాష్ట్రాల్లో పర్యటించి, రాష్ట్రంలోని ఉద్యమాల గురించి ప్రచారం చేస్తాం. అక్కడి ప్రజాసంఘాలు, విప్లవ సంఘాలతో సహకారం, మద్దతు కోసం చర్చలు జరుపుదాం” అని ప్రతిపాదించారు. పార్టీ అనుమతితో 1985 జులైలో ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ నేపథ్యాన్ని పుస్తకంలో సవివరంగా వివరించారు.

**పర్యటనలో పాల్గొన్నవారు, రాష్ట్రాలు:**
రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బిఎస్ రాములు, విరసం మరియు ఎ.ఐ.ఎల్.ఆర్.సి ప్రతినిధిగా వరవరరావు, జననాట్య మండలి ప్రతినిధులుగా గద్దర్, సంజీవ్, రాజు లతో కలిసి అఖిల భారత పర్యటనకు బయలుదేరారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, గుజరాత్, కర్నాటక, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో విప్లవ సంస్థలు, ప్రజాసంఘాల ప్రముఖులు, మేధావులతో ఉద్యమ పరమైన, భావజాలపరమైన చర్చలు జరిపారు. పీపుల్స్ వార్ ఉద్యమానికి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేశారు. అనురాధా గాంధీ, బాబా ఆమ్టే, శంకర్ గుహా నియోగి, స్వామి అగ్నివేశ్, సద్గోపాల్, వేణు, శబ్దాస్ ఘోష్, మహాశ్వేతాదేవి, గోరఖ్ పాండే తదితరులతో జరిగిన చర్చల సారాంశం, వ్యక్తి గత అనుభవాలు, వారి ప్రతిస్పందనలు ఈ పుస్తకంలో ఆవిష్కృతమవుతాయి.

**కీలక చర్చలు, అనుభవాలు:**

1. **అనురాధా గాంధీతో చర్చలు:** అనురాధా గాంధీ కుల సమస్యను లేవనెత్తారు. ఇతర సంఘాలతో సంఘర్షణ వైఖరి, విప్లవ పార్టీల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఉమ్మడి లక్ష్యం కోసం కలిసి పనిచేయాలనే ఆమె అభిప్రాయాలు రాములుకి నూతన ఆలోచనలను రేకెత్తించాయి. అయితే, వరవరరావు అనురాధాతో కఠినంగా చర్చించడం తనకు బాధ కలిగించిందని, చర్చలు సౌమ్యంగా జరగాలని రాములు గారు పేర్కొన్నారు. అప్పటి విప్లవ పార్టీలు వర్గ సమస్యకు ప్రాధాన్యమిచ్చి, కుల సమస్యను నిర్లక్ష్యం చేశాయి. ఇది రాములు గారు తరువాత కుల అస్తిత్వ ఉద్యమాల్లో పాల్గొనడానికి కారణమై ఉండవచ్చు.
2. మధ్యప్రదేశ్‌లో SUCI నాయకులతో చర్చలు: శబ్దాస్ ఘోష్ ఆలోచనా విధానంతో నడుస్తున్న SUCI పార్టీ నాయకులు, “పార్టీలు కలిసిపోక పోయినా, ప్రజల కోసమే అందరూ పనిచేస్తున్నాం. పరస్పర సహకారం, నిర్బంధాల ఖండన, సౌహార్ద్ర సంబంధాలు కొనసాగించవచ్చు” అని పేర్కొన్నారు. ఈ ఆలోచన రాములుకి సబబుగా అనిపించింది. అయితే, పీపుల్స్ వార్ అప్పటికి తమ భావజాలానికి వ్యతిరేకులను శత్రువులుగా భావించే ధోరణిలోనే కొనసాగింది.
3. **శంకర్ గుహా నియోగి ఉద్యమం:** చత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా నాయకుడు శంకర్ గుహా నియోగి ఆదివాసీ హక్కుల కోసం, సామాజిక కార్యక్రమాల ద్వారా చేస్తున్న కృషి రాములుని ఆశ్చర్యపరిచింది. “పీపుల్స్ వార్ స్కూళ్లు, హాస్పిటల్స్, మహిళా సంఘాలు ఏర్పాటు చేయలేదు. స్వయం ప్రభుత్వంలా ఉద్యమాలు నడపడం లేదు. ఇటువంటి సాంస్కృతిక, తాత్విక చైతన్యం నుంచి నేర్చుకోవాలి” అని ఆలోచన రేకెత్తించే అనుభవాన్ని వివరించారు.
4. **ఢిల్లీలో కేరళ వేణు ప్రతిపాదనలు:** జేఎన్‌యూలో నిర్వహించిన సెమినార్‌లో కేరళ వేణు, “దేశం అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ నుంచి నయా వలసగా మారుతున్నది. జాతీయ, ప్రాంతీయ బూర్జువాలతో ఐక్యత కట్టి ఉద్యమాలు నిర్వహించాలి” అని ప్రతిపాదించారు. ఈ ఆలోచన గ్లోబలైజే షన్‌ను ముందుగానే గుర్తించినట్లుగా ఉందని రాములు పేర్కొన్నారు.
5. **ఢిల్లీ యూనివర్సిటీలో ఫ్రీ సెక్స్ థియరీ:** ఢిల్లీ యూనివర్సిటీలో నక్సలైట్ల ఉద్యమాలను సమర్థించే కొందరు విద్యార్థులు, మేధావులు ఫ్రీ సెక్స్ థియరీని ప్రచారం చేస్తూ, కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థను తిరస్కరించారు. పెళ్లి లేకుండా తమకు నచ్చిన పద్ధతిలో ఎప్పటికప్పుడు లైంగిక సంబంధాలు పెట్టుకొని,సహజీవనం చేసే విధానాన్ని ఒక ఆదర్శంగా ప్రచారం చేస్తుండేవాళ్లు.రాములు దీనిని “అరాచకం”గా భావించి, “ఉద్యమకారులు సమాజానికి ఆదర్శంగా ఉండాలి.ఇటువంటి ప్రవర్తన వల్ల ఉద్యమానికి చెడ్డపేరు వస్తుంది” అని వరవరరావుతో చర్చించారు. వరవరరావు ఈ వాదనను పూర్తిగా ఏకీభవించలేదని, అలాగని ఖండించలేకపోయారని వివరించారు.




6. **స్వామి అగ్నివేశ్‌తో చర్చలు:** స్వామి అగ్నివేశ్, “పరస్పర సహకారమే సరైంది, ఏకపక్ష సహకారం కాదు” అని పేర్కొన్నారు. ఈ పాఠం రాములు దృక్పథాన్ని మార్చింది. “అంతవరకూ అందరూ మాకే సహకరించాలనే భావనలో ఉన్నాం. ఇది పొరపాటు” అని ఆయన గుర్తించారు.
7. **కుల సమస్య, ఉత్తర భారత అనుభవాలు:** ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్‌లో కుల వివక్షలు స్పష్టంగా కనిపించాయి. బీహార్‌లో విప్లవ గ్రూపులతో చర్చల్లో, “ఆంధ్ర ప్రదేశ్‌లో కుల సమస్య ఉద్యమానికి అడ్డంకి కాలేదు” అని చెప్పినప్పటికీ, కారంచేడు, నీరుకొండ లాంటి సంఘటనలను దాటవేశామని రాములు నిర్మొహమాటంగా పేర్కొన్నారు.
8. **తమిళనాడు, కర్నాటక అనుభవాలు:** తమిళనాడులో సందర్భంగా అక్కడకూడా చర్చల సారాంశం,గుళ్ల సందర్శన సందర్భంగా ,హిందూ సాంప్రదాయం ప్రకారం దోతి కట్టుకోవడం వంటి అనుభవాలను వివరించారు. కర్నాటకలో విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి.

**ఉద్యమంలోని బలహీనతలు, సవాళ్లు :**
పీపుల్స్ వార్ ఉద్యమంలో ఎన్‌కౌంటర్లు, నాయకుల ఆధిపత్య ధోరణులు, కుల వివక్ష, డా. రామనాథం, గోపురాజన్న, కైరి గంగారాం వంటి నాయకుల హత్యలు,ఎన్ కౌంటర్లు,రాములు ఇంద్రవెల్లి అరెస్టు, జైలు జీవితం,తన భార్య శ్యామల పడ్డ కుటుంబ కష్టాలు - ఇవన్నీ హృదయవిదారకంగా వర్ణించారు. “ఉడుకు రక్తంతో ఆయుధం చేతికి వచ్చాక, నాయకుల్లో ఆధిపత్యం, అనుచిత ప్రవర్తన, ఆశ్రిత పక్షపాతం, గ్రూపిజం పెరిగాయి” అని, రెక్టిఫికేషన్ క్యాంపుల ద్వారా ఈ లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేయడం,ఆ తర్వాత నక్సల్బరీ గమ్యము-గమనము అనే పుస్తకంలో కె.బాలగోపాల్,ఎన్ వేణుగోపాల్ తదితరులు పార్టీలో,ప్రజా సంఘాల్లో ఇలాంటి అవాంఛనీయ విషయాలు,పార్టీ ప్రవర్తనను ఎత్తి చూపడం లాంటి విషయాలు ఇందులో వివరించారు.
కారంచేడు మారణకాండలో దళితులపై జరిగిన దాడులు, రాడికల్ సంఘాలు దళితులకు మద్దతుగా నిర్వహించిన ఉద్యమాలు,పీపుల్సు వార్ ఉద్యమానికి ఉదయం దిన పత్రిక జర్నలిస్టుల సహకారం ఈ పుస్తకంలో రికార్డు చేశారు. వరవరరావు సరెండర్ చర్చలు,తాను సరెండర్ ను వ్యతిరేకించడం,గద్దర్-సత్యమూర్తి విషయంలో పార్టీకి రాసిన ఉత్తరం కలకలం,కొండపల్లి-సత్యమూర్తి విభేదాలు వంటి అంతర్గత సమస్యలను కూడా విశ్లేషించారు.

**ఆలోచన రేకెత్తించే సందర్భాలు:**
భోపాల్‌లో విశ్రాంతి సమయంలో, “విప్లవం విజయవంతమైతే గద్దర్ సాంస్కృతిక మంత్రి, నేను విద్యా మంత్రి” అయితే వరవరరావు కరణం బ్రాహ్మణుడు, ఆయనని విద్యా శాఖకు గానీ, సాహిత్య, సాంస్కృతిక శాఖకు గాని మంత్రిగా చేస్తే బ్రాహ్మణ వాదాన్ని, అగ్రకుల తత్వాన్ని విస్తరింప చేస్తాడని, ఆయనకు ఈ శాఖలు రాకుండా చూసుకోవాలి”అని నవ్వుతూ చర్చించిన సందర్భం, 1985 లో విప్లవం గురించి కలలు కన్న ఆశావాద వసంత గీతాన్ని ఈ పుస్తకం చిత్రిస్తుంది.కందిమళ్ల ప్రతాపరెడ్డి రాసిన “వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమాలు” లో,”కమ్యూనిస్టు ఉద్యమం ఎందుకు బలహీనపడింది? ప్రజలు కమ్యూనిస్టులకు దూరమయ్యారా, కమ్యూనిస్టులు ప్రజలకు దూరమయ్యారా?” అనే ప్రశ్నలకు రాములు గారు, “రెండూ నిజం” అని విశ్లేషించారు. అంబేద్కరిజం, ప్రజాస్వామ్య ఉద్యమాలు,వామపక్ష ఉద్యమాలు,మాస్ లీడర్‌షిప్ వంటి అంశాలపై చర్చలు ఆలోచన రేకెత్తిస్తాయి.

**పుస్తకం యొక్క ప్రాముఖ్యత**
ఈ పుస్తకం విభిన్న ఉద్యమాల్లో పనిచేసేవారికి దారిదీపం. సిద్ధాంతం ఉద్యమానికి మార్గదర్శకమైతే, అనుభవం సిద్ధాంతాన్ని మెరుగుపరుస్తుంది. భౌతిక పరిస్థితులు, ప్రజల సంసిద్ధతతోనే ఉద్యమాలు విజయవంత మవుతాయని ఈ పుస్తకం స్పష్టం చేస్తుంది. పీపుల్స్ వార్ ఉద్యమంలోని మలుపులు, బలహీనతలు, కులం,జెండర్ సమస్యలు,పరస్పర సహకారం లోపం వంటివి ఇందులో ధైర్యంగా వివరించడం అభినందనీయం. “మనం సహకరిస్తే ఇతరులు కూడా సహకరిస్తారు” అనే సార్వజనీన సూత్రం అప్పట్లో పీపుల్స్ వార్ స్వీకరించి ఉంటే, ఉద్యమం గతి మరోలా ఉండేదేమో అనే ఆలోచనను ఈ పుస్తకం కలిగిస్తుంది. విభిన్న ఉద్యమాల స్థితి గతులపై మంచి అవగాహన కలిగిస్తుంది. సముద్రమంత లోతైన ఉద్యమ అనుభవాల విజ్ఞాన సర్వస్వమైన ఈ పుస్తకం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఉద్యమకారులకు, సామాజిక మార్పు కోసం పనిచేసేవారికి ఈ పుస్తకం ఒక అమూల్యమైన సంపద.
ఇంత గొప్ప పుస్తకాన్ని వెలువరించినందుకు బిఎస్ రాములుకి అభినందనలు.



-వేల్పుల నారాయణ
యుఎస్ఏ నుండి.

# కొందుర్గులో జోరుగా మట్టి రవాణా

- ప్రభుత్వం ఆదాయానికి భారీ గండి
- అభివృద్ధి మాటున మట్టి దందా
- అన్ని తెలిసి మౌనం వహిస్తున్న రెవెన్యూ శాఖ



**కొందుర్గు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ భూముల నుండి పట్టపగలు మట్టి రవాణా జరుగుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు.రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలకేంద్రంలో అనుమతులు లేకుండా చెరువులు, గుట్టలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని, దీనిపై రెవెన్యూ, ఇరిగేషన్,మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ మాఫియాకు సహకరిస్తున్నారని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం కోల్పోవడమే కాకుండా, పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోంది.

**అక్రమంగా మట్టి తవ్వకాలు**

జేసీబీలు, ప్రొక్లెయిన్ల వంటి యంత్రాలతో చెరువులు, కుంటలు, గుట్టలు, పొలాల నుండి భారీ మొత్తంలో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. టిప్పర్లు, లారీల్లో కొందుర్గు శివారు ప్రాంతాలకు మట్టిని తరలించి, వెంచర్లలో, నిర్మాణాలలో అక్రమంగా అమ్ముతున్నారు.

**పరిశ్రమల అవసరాలకు మట్టి**

బహుళ భవనాలు, కొత్త వెంచర్లలో మట్టి వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, మట్టి మాఫియా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటోంది. ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకోవడం ప్రభుత్వ, అసైన్డ్ భూములను కూడా ఈ మాఫియా టార్గెట్ చేస్తోంది. అధికారుల నిర్లక్ష్యమే టార్గెట్ చేస్తూ మామూళ్ల ఎర వేసి ఇరిగేషన్, రెవెన్యూ,మైనింగ్ అధికారులు మాఫియా నుంచి మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకపోయినా, చట్టాలను ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధుల అండతో కొందరు ప్రజాప్రతినిధులు మట్టి మాఫియాకు అండగా నిలుస్తున్నారని, దీనివల్ల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు అనేకం వస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగడమే కాదు అక్రమ మట్టి తరలింపు వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం భారీగా నష్టపోతోంది. పర్యావరణ విధ్వంసం కూడా అని చెప్పవచ్చు.

## జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




**కాప్రా, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను తన కార్యాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ నగర్, కృష్ణారెడ్డి నగర్ లో 550 మీటర్ల స్టార్మ్ వాటర్ డ్రైన్ నీ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే సానుకూలంగా స్పందించిన జిహెచ్ఎంసి కమిషనర్ 2 కోట్ల 85 లక్షల రూపాయ లు మంజూరు చేశారు. సాయి నగర్ ఆర్చ్ టిఫర్ వరకు కాంపౌండ్ వాల్ కృష్ణారెడ్డి నగర్ రోడ్డు నంబర్ 1 రోడ్ నంబర్ 2. ఎస్టిమేషన్ వేయాల్సిందిగా జోనర్ కమిషనర్ కు ఆదేశించగా నేడు అక్కడికి వెళ్ళడం జరిగింది. చర్లపల్లి డివిజన్ పరిధిలో ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా కాలనీలు ముంపుకు గురికాకుండా తక్షణ చర్యలు చేపట్టుట గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠధామాలను అభివృద్ధి పరుస్తాం..

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** నియోజకవర్గంలోని అన్ని వైకుంఠధామాలను అభివృద్ధిపరిచి మౌలిక వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. మంగళవారం చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ లోని వైకుంఠధామాన్ని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 ఏళ్ల కాలంలో వైకుంఠధామాలకు కోట్లాది రూపాయలను వెచ్చించడం జరిగిందని తెలిపారు. గతంలో భగత్ సింగ్ నగర్ వైకుంఠ దామం లో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. భగత్ సింగ్ నగర్ వైకుంఠధామం లో పెరిగిన చెట్లను తీపించి మౌలిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈఈ క్రిష్టప్ప, డిఈ విశాలాక్షి, అశోక్ కుమార్, నాగరాజు, కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ, సీనియర్ బి.ఆర్.ఎస్ నాయకులు దేగా కృష్ణమూర్తి, సదానంద్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గృహకల్ప అభివృద్ధికి సంక్షేమ సంఘం కృషి చేయాలి

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** సంక్షేమ సంఘం నాయకులు అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప లో నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో మంచినీటి సమస్యతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర మౌలిక సదుపాలను కల్పించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, రాజీవ్ గృహకల్ప సముదాయం నూతన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మారావు అంజయ్య, కార్యదర్శి ఎం భూపతిరెడ్డి, రాజీవ్ గృహకల్ప వాసులు పరశురాం, కరికే నవీన్, వైకుంఠం, పాండు, వెంకట్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులకు మించి కడుతున్న అంతస్తులు



**ఘట్కేసర్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్ పరిధిలోని ఎమ్ నమ్ పేట్ లో అక్రమ కట్టడాలకు కొదవ లేకుండా పోయింది. ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. అధికారుల అవినీతికి నిదర్శనంగా మారింది. పోచారంలో, అక్రమ నిర్మాణాలు చేయాలంటే అతిసులువైపోయింది. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ముడుపులు ఇచ్చామా! అక్రమ నిర్మాణాలు చేసుకున్నామా..! అన్నట్టు మారింది పరిస్థితి. అక్రమ నిర్మాణాల పై ఫిర్యాదులు చేసిన, టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం, నోటీసులు జారీ చేశామంటూ మౌనం వహిస్తున్నారు. ఏమైనా ప్రశ్నిస్తే ప్రజా ప్రతినిధులు పేరు చెబుతున్నారు. అవినీతికి, అక్రమాలకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచి, నియమ నిబంధనలు పాటించి, ప్రజలకు నేర్పించవలసిన ప్రజా ప్రతినిధులు, అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచి, మున్సిపల్ కు రావలసిన ఆదాయాన్ని, అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి గండి కొడుతుంటే, పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. ఇలా అధికారం దుర్వినియోగం చేయడంలో పోచారం అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందున్నారన్న ఆరోపణలు వెల్లువిరుస్తున్నాయి. మొత్తంలో ప్రజా ప్రతినిధుల అండతోనే, ఇంత భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, స్థానికులు మండిపడుతున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపవలసిన ప్రజా ప్రతినిధులు, వా ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి, అవినీతి అక్రమాలను ప్రోత్సహించకుండా ఉండాలని, ప్రజలు కోరుతున్నారు. యంనంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇందిరమ్మ కమిటీ సభ్యులు దొంతులపల్లి చెన్నారెడ్డి పోచారం మున్సిపల్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై వినతి పత్రం అందజేశారు తక్షణమే ఇట్టి అక్రమ ?ఇట్టి అక్రమ అక్రమ కట్టడాల పై తగిన చర్య తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## వైద్య ఆరోగ్య శిబిరాలను స్వదినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** వైద్య ఆరోగ్య శిబిరాలను స్వదినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు పట్టణం మాతా శిశు ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరై ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు, టీబీ, బీపీ, చెవి, ముక్కు, చర్మ, రొమ్ము, సికిల్ పరీక్షలతో పాటు కిశోర బాలికల కోసం ఏర్పాటు చేసిన వైద్య సేవల విభాగాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బలంగా, ధృడంగా ఉంటాయని అన్నారు.ఆరోగ్య సమస్యల విషయంలో మహిళలు నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందని అన్నారు. వచ్చేనెల 2వ తేది వరకు నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ డా.లలితాదేవి, డీసీహెచ్ఎస్ డా. ఆనంద్, డిప్యూటీ డీఎంహెచ్ఎం డా.రవీందర్ యాదవ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, నాయకులు అజయ్ ప్రసాద్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.రాజు, ఎంసీహెచ్ ఆర్ఎంఓ డా.అనిల్ కుమార్, మున్సిపల్ కమీషనర్ యాదగిరి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారాయికి పాల్పడితే కఠిన చర్యలు

- 350 లీటర్లు బెల్లం పానకం ధ్వంసం
- అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు
- ఇన్చార్జి ఎక్సైజ్ సిఐ ఆదిశేషు రెడ్డి



**తాండూరు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిషేదిత నాటు సారాయికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇన్చార్జి ఎక్సైజ్ సిఐ ఆదిశేషు రెడ్డి హెచ్చరించారు. మంగళవారం రంగారెడ్డి డిప్యూటీ కమీషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ సూచనలతో వికారాబాద్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో ఎక్సైజ్ అధికారులు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం కొత్లాపూర్ తాండా, నంద్యానాయక్ తాండా, వాల్యానాయక్ తాండా, జమ్లనాయక్ తాండా లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడులలో నాటు సారాయి తయారీ కోసం ఉపయోగించే (350) లీటర్లు బెల్లం పానకం ధ్వంసం చేసి, (09) లీటర్ల నాటు సారా సీజ్ చేసి, అయిదుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు ఇంచార్జి ఎక్సైజ్ సిఐ ఆదిశేషు రెడ్డి తెలిపారు. నాటు సారా తయారీ, అమ్మడం పై నిషేధం ఉన్నందున ప్రజలు వాటి జోలికి వెళ్లరాదని, బైండోవర్ చేసిన తరువాత కూడా నాటు సారా కేసులలో పట్టుబడితే బ్రీచ్ ఆఫ్ బాన్ కింద రెండు లక్షల జరిమానా ఉంటుందని, అవసరం అయితే పిడి యాక్ట్ కింద కూడా కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీలలో కొడంగల్, మోమిన్పేట్, వికారాబాద్, డిటిఎఫ్ బృందాలు, బషీరాబాద్ పాల్గొన్నారు.

## ఆశించినంత వేగంగా పనులు జరగట్లే..!

- పనితీరు మార్చుకోవాలి.. లేదంటే చర్యలు తప్పవు
- ఇంజనీర్లపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేందుకు చేపట్టిన ఎస్ఆర్ డీపీ,హెచ్ సిటీ పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో మంగళవారం కమిషనర్ ఆర్ వి కర్ణన్ నగరంలోని అన్ని జోన్ లలో చేపడుతున్న ఎస్ఎన్ డీపీ, హెచ్ %-% సిటీ ప్రాజెక్టులు , స్ట్రాటజిక్ రోడ్డు డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, లేక్ ల అభివృధి, స్టార్మ్ వాటర్ డ్రైన్ పనుల పురోగతిపై జోనల్ కమిషనర్లు, ప్రాజెక్ట్స్ ఇంజనీర్లు, ప్లానింగ్, ఇరిగేషన్,భూ సేకరణ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఒక్కో ప్రాజెక్ట్ పురోగతిని కమిషనర్‌కు వివరించారు. క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ప్రతిబంధకాలు, క్షేత్ర స్థాయి సవాళ్లు, పెండింగ్ పనులు, అందుకు గల కారణాలను తెలిపారు. ఎస్ఆర్ డీపీ, ఎస్ఎన్ డీపీ కింద చేపట్టిన పనులు ప్రారంభించి చాలా రోజులైనందున వేగంగా పూర్తి చేసేందుకు మిషన్ మోడ్ లో పనిచేయాలన్నారు. 6 జోనల్ ల పరిధిలో లేక్ ల అభివృద్ధిలో భాగంగా 83 పనులు చేపట్టగా 25 పనులు మాత్రమే ప్రారంభం కావడం, లేక్స్ అభివృద్ధి, పునరుద్ధరణ పనులు స్లోగా జరగడంపై కమిషనర్ మండిపడ్డారు. ఇరిగేషన్ ఇంజనీర్లు సరిగా పనిచేస్తలేరు. వారం రోజుల్లో లేక్స్ అభివృద్ధి పనుల పై జోనల్ కమిషనర్ల ద్వారా క్షేత్రస్థాయి తాజా రిపోర్టు తీసుకుంటామన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాజెక్ట్ ల పూర్తికి నిధుల కొరత లేదన్నారు. యుటిలిటీ షిఫ్టింగ్, పెండింగ్ భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 25లోగా ఫలక్ నామా ఆర్ఓబీని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలనీ ఇంజనీర్లను ఆదేశించారు. జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి , హేమంత్ పాటిల్, అపూర్వ చౌహాన్, శ్రీనివాస్ రెడ్డి, రవి కిరణ్, ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ప్రత్యేక ఉప కలెక్టర్ రాములు నాయక్, ఎస్ఈ, ఈఈలు సమావేశంలో పాల్గొన్నారు.



# డీజీపీ చేతుల మీదుగా "అబ్నార్మల్ సైకాలజీ" పుస్తక ఆవిష్కణ

**హయత్‌నగర్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్ లో పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) డాక్టర్ జితేందర్ ఐపీఎస్, హెూమియోపతి డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ పరికిపండ్ల అశోక్ లు "అబ్నార్మల్ సైకాలజీ: డిజార్డర్స్, డయగ్నోసిస్ అండ్ ట్రీట్మెంట్" అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథ రచయిత డాక్టర్ నౌముల వెంకటేశ్వర్లు అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ సైకాలజిస్టు, తెలంగాణ సైకాలజిస్టుల సంఘం వైస్ ప్రెసిడెంట్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, విద్య, పర్యావరణం, యోగా, సామాజిక సేవల రంగాలలో డాక్టర్ వెంకటేశ్వర్లు విశేష కృషిని వారు అభినందించారు. ఆత్మహత్యల నివారణపై రాబోయే పుస్తకం (తనతో పాటు వెంకటేశ్వర్ల రచన) గురించి డీజీపీకి వివరించారు. ఈ పుస్తకాన్ని త్వరలోనే రాష్ట్రంలోని విద్యాసంస్థలు, పోలీసు విభాగం లో పంపిణీ చేయనున్నారు. ఇద్దరూ అరోగ్య మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు, కార్యదర్శులుగా 25 ఏళ్లుగా మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ రంగంలో సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "అబ్నార్మల్ సైకాలజీ ఒక క్లిష్టమైన అంశం, సమాజంలో దీనిపై ఇంకా అపోహలు, ముద్రలు ఉన్నాయి. విద్యార్థుల్లో ఆత్మహత్యలు అరికట్టడం, మానసిక ఆరోగ్యాన్ని అందరికీ అందించడం నా ప్రధాన ధ్యేయం" అని పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులు, విద్యార్థులలో కొందరు మానసిక ఆరోగ్య సమస్యలను



ఎదుర్కొన్నారని, అది తనను ఈ పుస్తక రచనకు ప్రేరేపించిందని ఆయన హృదయపూర్వకంగా వెల్లడించారు. ఈ గ్రంథం రూపకల్పనలో ఈసీజీ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ రవీందర్, డాక్టర్ మార్కండేయులు, డాక్టర్ ఈరేష్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ సునీత, సాయి ప్రసాద్, స్వీకార్ గ్రూప్ స్థాపకులు పద్మశ్రీ డాక్టర్ పి. హనుమంతరావు ల సలహాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గత 15 ఏళ్లుగా వెంకటేశ్వర్లు తన ఇన్నర్ బ్లూమ్ %-% తెలంగాణ చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా వేలాది మందికి ఉచిత కౌన్సెలింగ్ అందిస్తున్నారు. ఆయన విశేష కృషికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (రెండుసార్లు), టీచర్ ఇన్‌స్పిరేషనల్ అవార్డు (2024), టీచింగ్ ఎక్సలెన్స్ అవార్డు (2024), తెలంగాణ బెస్ట్ సైకాలజిస్టు అవార్డు (2025), ఈసీజీ ఇండో-యూకే గ్రీన్ డ్రైవ్ ఎక్సలెన్స్ అవార్డు (2025), మహాత్మా చరక అవార్డు (2025), వింగ్స్ ఆఫ్ ఫైర్ అవార్డు (2025) వంటి అనేక గౌరవాలు లభించాయి. ఇటీవల వెంకటేశ్వర్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 కు ఎంపికైనట్లు అధికారికంగా ప్రకటించబడింది. ఈ అవార్డును సెప్టెంబర్ 25, 2025న, హైదరాబాద్ బిర్లా ప్లానెటేరియం భాస్కర ఆడిటోరియంలో జరగనున్న కార్యక్రమంలో ఆయనకు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఇన్నర్ బ్లూమ్, సోబర్‌స్టెప్స్ రిహాబ్, ఆద్యా రిహాబ్, శ్రద్ధ రిహాబ్, స్వీకార్, ఉపకార్ మెంటల్ హెల్త్ ఇన్స్టిట్యూషన్స్, శివప్రియ సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్ సిబ్బంది, హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక వర్గం వెంకటేశ్వర్లను అభినందించారు. ఈ పుస్తకాన్ని రెడిషిన్ పబ్లికేషన్స్ ప్రచురించింది, ఇది భారతదేశం, స్వీడన్, యూకే దేశాలలో తన కార్యకలాపాలను విస్తరించింది. ప్రస్తుతం ఈ పుస్తకం అమెజాన్ మరియు ఫ్లిప్ కార్ట్ లో లభిస్తుందని వారు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అశోక్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.సాయిరాం లు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ గ్రంథాన్ని డాక్టర్ వెంకటేశ్వర్లు తన చిన్న కుమారుడు ఎన్. సృజన్ గుప్తకు అంకితం చేసినట్టుగా వారు తెలియజేశారు.

## చిన్నారులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** చిన్నారులకు పరిశుభ్రమైన, రుచికరమైన ఆహారాన్ని అందించి ఆట పాటలతో చదువు నేర్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. పోషన్ భీ పడాయి భీ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శామీర్ పేట మండలంలోని ఆలియాబాదు అంగన్ వాడీ సెంటరును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్నారులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించాలని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారులతో ముచ్చటిస్తూ వారి ఆట పాటలను చూస్తూ సంతోషం వ్యక్తం చేసారు. వంట సామాగ్రిని పరిశీలించి, అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ శారద, అంగన్ వాడీ టీచర్, చిన్నారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
24 సెప్టెంబర్ 2025

# క్రమశిక్షణతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి
- ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడాలి
- జోగులాంబ జోన్ డిఐజి చౌహాన్



**మాగనూర్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** పోలీసులు క్రమశిక్షణతో పని చేస్తూ ప్రజలకు చేరువ కావాలని,ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని గద్వాల జోగులాంబ జోన్ 7 డిఐజిఎల్ఎచ్ చౌహాన్ సూచించారు. మంగళవారం ఆయన నారాయణపేట జిల్లాలోని నర్వ, మాగనూరు, మక్తల్ పోలీస్ స్టేషన్లను వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఐ జి కి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంత రం పోలీస్ స్టేషన్లలో పోలీసు అధికారులు, సిబంధితో కలిసి మొక్కలు నాటారు. పోలీసు స్టేషన్లోని సిబ్బంది యొక్క పనితీరు, రికార్డుల నిర్వహ ణ, పోలీస్ స్టేషన్ పరిశుభ్రత, ప్రజాసేవలపై విపులంగా సమీక్షించారు. కేసులలో దర్యాప్తు, నాణ్యత, పెండింగ్ కేసుల పరిష్కారం, క్రైమ్ ప్రివెన్షన్ చర్యలపై అధికా రులతో సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఐజి పోలీసు సిబ్బంది నిర్వహించే విధుల గురించి అడిగి తెలుసుకు న్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పై అధికారుల కు తెలిపాలని, అవి పరిష్క రించడం జరుగుతుందని తెలిపారు. అలాగే పోలీసులు గ్రామాలలో ప్రజలతో మమేక మవుతూ వారి సమస్యలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి విలేజ్ పోలీస్ ఆఫీసర్ తమకు కేటాయించిన గ్రామంలో విధిగా పర్యటించాలని సూచించారు. పోలీసులు నీట్ టర్న్ అవుట్, వృత్తిపై నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని తెలిపారు. విధులను పారద ర్శకంగా నిర్వహించాలని, ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్య ను క్షుణ్ణంగా తెలుసుకొని తక్షణమే పరిష్కరించే విధంగా చేయాలని, వారికి పోలీసుల పట్ల నమ్మకం, భద్రత, భరోసా కల్పించాలని సూచించారు. డయల్ 100 సేవల పట్ల వేగవంతంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచిం చారు.ప్రజల భద్రత, నేర నియంత్రణ, సైబర్ నేరాల నివారణ కోసం తీసుకుం టున్న చర్యలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ అధికా రులు వేగంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని అలాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రధాన రోడ్డు మార్గంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను హాట్ స్పాట్లను గుర్తించి సంబంధిత అధికారులతో కలిసి భద్రత చర్యలు తీసుకోవాలని తెలిపారు. దొంగతనాల నివారణకు పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అనే విధంగా దొంగతనాలు జరగక ముందే పూర్తిస్థాయిలో నిఘా ఉంచి భద్రత చర్యలు తీసుకోవా లని, కాలనీల్లో గ్రామాల్లో నిరంతరం పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తూ పాత నేరస్తులను తనిఖీ చేయాలని, దొంగత నాలు జరిగినా వెంటనే డిటెక్షన్ చేయాలని తెలిపారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిం చాలని తెలిపారు. ఈ ఇన్స్పెక్షన్ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సిఐరామ్ లాల్, ఎస్సై అశోక్ బాబు, పోలీసు సిబంది తది తరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**మెదక్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నాణ్యత ప్రమాణాలు, మిగిలి ఉన్న పనులపై పూర్తి చేయవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని అన్నారు.. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో అత్యాధునిక సాంకేతిక విద్య అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే దిశగా ముందుకు పోతున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ అనురాధ, డిఈ రాందాస్, ఎలక్ట్రికల్ డిఈ వాణిలత సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంటలు పండే వ్యవసాయ భూములు లాక్కోవడం దారుణం

- బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్



**చేవెళ్ల, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** పంటలు పండే వ్యవసాయ భూములు లాక్కోవడం దారుణమని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. చేవెళ్ల మండలం హస్తేపూర్ గ్రామంలో 400 ఎకరాల వ్యవసాయ భూములను పెత్తందారులకోసం ప్రభుత్వం లాక్కోడాన్ని వ్యతిరేకిస్తూ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ మాట్లాడుతూ...ప్రాజెక్ట్ ల ప్రకటన లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా భూసేకరణ చట్ట వ్యతిరేకమని అన్నారు. గ్రామంలో 99% పైగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలే ఉన్నాయన్నారు. పేదవర్గాల ప్రజలు కనుకనే ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పుడు ప్రభుత్వమే వాటిని లాక్కుంటే ఆ ప్రజలు ఎలా బతుకుతారని అన్నారు. ప్రజలు సుముఖంగా లేకున్నా బెదిరింపిలకు పాల్పడడం కాంగ్రెస్ దౌర్జన్యానికి నిదర్శనం తెలిపారు. బలహీన వర్గాలకిచ్చే ప్రభుత్వ భూములని లాక్కోవడమంటే ఎస్సీ, బీసీల వ్యతిరేఖంగా పోవడమని అని అన్నారు. భూములకు భూములే ఇయ్యాలి తప్ప వేరే రకంగా మభ్యపెడతామంటే మరో లగచర్ల తరహా ఉద్యమం చూడక తప్పదన్నారు. దేనికోసం భూములు తీసుకుంటున్నారో చెప్పకుండా తీసుకోవడమంటే కచ్చితంగా ఇది ప్రయివేటు పరం చేయడమే సరైన పద్దతి కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య చొరవ తీసుకుని భూసేకరణను విరమింపచేయాలి. లేనిపక్షంలో గ్రామ రైతులతో కలిసి మరో లగచర్ల తరహా ఉద్యమం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# సంక్షేమ ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేసుకోవాలి



**మొయినాబాద్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** ఫోటో, వీడియో కుటుంబ సభ్యులు ఆర్థిక, అభివృద్ధి కోసం అందరం కలిసి పని చేసుకుందామని ఫోటోవీడియోగ్రాఫి జిల్లా అధ్యక్షులు శివ లింగంగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ సమీపంలోని మండల ఫోటో వీడియోగ్రాఫి అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు శివలింగంగౌడ్, రాష్ట్ర పీఆర్వో శేఖర్ గౌడ్న్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షునిగా ఎం.శశిధర్, ఉపాధ్యక్షులుగా అజీబనగర్ రాజేందర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మ, కోశాధికారిగా మధుసాగర్, కుటుంబ భరోసా సభ్యులుగా చిలుకూరి నాగరాజు, జాయింట్ సెక్రటరీగా శ్రావణ్, ముఖ్య సలహాదారులుగా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోని సభ్యులను సన్మానించారు. వారు మాట్లాడుతూ ఫోటో వీడియోగ్రాఫీ సభ్యులందరూ సంక్షేమ, ఆర్థిక, అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఫోటోవీడియోగ్రాఫి అసోసియేషన్ సభ్యులుగా సభ్యత్వం తీసుకున్న అందరికి ఇన్స్యూరెన్స్ భీమా ఉంటుందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటో వీడియోగ్రాఫిలో ఎంతో టెక్నాలజీ పెరిగిపోయిందన్నారు. దానిని అనుసంధానం చేసుకునేందుకు తరగతి శిక్షణలు ఏర్పాటు చేసుకుందామన్నారు. ఎంత తెలిసిన మరింత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒకప్పుడు మండలానికి ఒకరిద్దరు ఫోటోగ్రాఫర్ లు ఉండేవారని ప్రస్తుతం ప్రతి గ్రామంలో 2–3 ఫోటోగ్రాఫర్లు ఉన్నారని దీంతో వారి సంఖ్య పెరిగిపోతున్న సమయంలో పోటీతత్వానికి త గ్గట్లు ఉండాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో విష్ణుగౌడ్, బండ్లగూడ శ్రీధర్, వడ్ల రమేష్చరి, మాజీ అధ్యక్షులు మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణీ



**అల్లాదుర్గం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** గ్రామంలో పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్టలేనివని హెడ్ కానిస్టేబుల్ బోయిని జనార్ధన్ అన్నారు. మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామ పంచాయతి కార్మికులకు విజయ దశమి పండగ సందర్భంగా జగదేవపూర్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన బోయిని జనార్ధన్ తండ్రి విఠల్ దసరా పండుగ కానుక గా పంచాయతీ కార్మికులకు వారి సొంత ఖర్చుతో బట్టలను పంపిణి చేశారు. కార్యక్రమంలో పాంపాటి వీరప్ప , కోర్మని ప్రభు, బస్వరాజ్, శ్రీకాంత్, మహేష్, .శ్రీకాంత్,సంగమేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పేదల ప్రభుత్వం

- నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవిడ రాజిరెడ్డి



**మెదక్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం... సీఎం రేవంత్ రెడ్డి పేదల విద్య, వైద్యానికి పెద్దపీట వేసి ప్రజా పాలన అందిస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లాలోని మండల కేంద్రమైన కొల్చారంతో పాటు రంగంపేటలో గ్రామాలలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులకు సుమారు మూడు లక్షల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన సొంత నిధులతో మాతృదేవోభతకం కింద గర్భిణీ స్త్రీలకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా గెలవకున్నా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నానన్నారు. ఎన్నికల హామీలో ఊరు ఊరు తిరిగి ప్రజల సమస్యలు, కష్టాలు తెలుసుకున్నానని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పథకం, ఎల్వోసిలు ఇప్పించడంలో పారదర్శకంగా, సులభతరంగా వ్యవహరిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వంలో సులభతరంగా ఆరోగ్య సేవలు అందుతున్నాయి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సావిత్రి రెడ్డి, తాజా మాజా వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, రంగంపేట సొసైటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహేశ్వర్ రెడ్డి, గజిని వెంకట్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ మన్నె శీను, బండి సుజాత రమేష్, శేఖర్, గోవర్ధన్, విట్టల్ గౌడ్ అక్రమ్, శ్రీశైలం, గజినీ వెంకట్ గౌడ్, పోతిరెడ్డిపల్లి శేఖర్ రెడ్డి, లంబాడి రూపుల, బండి మల్లేశా, పైతర భూమయ్య, కొమ్ముల రవీందర్ గౌడ్, వైద్య సిబ్బంది మజీదా బేగం, ఆశ వర్కర్లు కవిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

# బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు.. ఉద్యమం



**మొయినాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు ఉద్యమం అంటూ చాటుదామని విమలక్క పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విమలక్క ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుజన బతుకమ్మ ఉత్సవాన్ని కాదు ఉద్యమం అంటూ చాటుదామని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పామేన జ్యోతి బీమ్ భరత్, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు ముత్యాల పుష్పమ్మ, మొయినాబాద్ మండల మాజీ ఎంపీపీ గునుగుర్తి నక్షత్ర, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు కూకుంట్ల శ్రీలత, మహిళలు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడు కృషి



**నిజాంపేట్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజుని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, పలు సమస్యలతో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు మాట్లాడుతూ సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. అనంతరం దుర్గాదేవి ఉత్సవాల భాగంగా నవరాత్రి వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆగం రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు,బాల కార్మిక నిర్మూలన వ్యవస్థపై కళాజాతం



**గట్టు, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చాగదాన గ్రామంలో జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆదేశాల మేరకు జిల్లా పోరా సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో మరియు గట్టు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, బాల కార్మిక నిర్మూలన వ్యవస్థపై మరియు బాల్యవివాహాల నిర్మూలన వ్యవస్థపై తమ ఆటపాట మాటలతో ప్రజలకు రైతులకు ,గ్రామ పెద్దలకు, గ్రామ యువతకు, విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించారు. ఎవరైనా రైతులు విద్యార్థులను బడికి పంపకుండా పత్తి చేనులో పనికి తీసుకపోయినా వారిపై క్రిమినల్ కేసులు చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా లేబర్ అధికారి వేణుగోపాల్ బాలలను పనిలో పెట్టుకుంటే వారిపై బాల కార్మిక చట్టం కింద కేసులు నమోదు చేస్తామని వారు రైతులకుతల్లిదండ్రులకుతెలియజేశారు. తెలంగాణ సాంస్కృతిక సారధి ఉద్యోగులు హజరత్, కేశవులు, స్వామి, భూపతి, కృష్ణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# నిలకడగా అస్వస్థతకు గురైన పిల్లల ఆరోగ్యం

- కలెక్టర్ రాహుల్ రాజు



**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** నాణ్యమైన వైద్య చికిత్సలు అందడంతో విద్యార్థులందరూ సేఫ్ జోన్‌లోకి వెళ్లడం జరిగిందని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో పరిశు భ్రమైన వంట ప్రాధాన్యతనిస్తూ ఆహారం కలుషితం కాకుండా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ యాజమాన్యాలను ఆదేశించారు. మంగళవారం రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను పరిశీలించి కలుషిత ఆహారం వల్ల విద్యార్థుల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేగుంట మండలం ఇబ్రహీంపూర్ మదర్ శాల ముస్లిం ప్రైవేట్ వసతి గృహంలో బీహార్ రాష్ట్రానికి సంబంధించి పిల్లలు 25 మంది వసతి పొందుతున్నారని 23-09-2025 సోమవారం రాత్రి వారు తీసుకున్న భోజనంలో నాణ్యత లోపించి 10 మంది వాంతులు, విరోచనాలతో అస్వస్థత గురి కావడం జరిగిందని పదిమంది తీవ్ర అస్వస్థతను దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్ లో రామాయణం పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు తరలించడం జరిగింది అన్నారు తక్షణ సహాయ చర్యలపై వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడే వరకు వైద్య సేవలు అందించాలని రామాయంపేట వైద్యాధికారులకు అధికారులకు సూచించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అన్నారు. కలుషిత ఆహారం సంఘటనపై పూర్వోపరాలు తెలుసుకోవడానికి మెడికల్ బృందాన్ని కమిటీగా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థలు, హెూటల్స్ రెస్టారెంట్లను ఆహారం పరిశుభ్రతలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆరోగ్యంగా ఉండటానికి వంటగదిని, ఆహారాన్ని శుభ్రంగా ఉంచుకోవడం. ఆహారాన్ని వండే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పాత్రలు, కట్టింగ్ బోర్డులను శుభ్రంగా ఉంచడం, తాజా పదార్థాలను వాడటం, వండిన ఆహారాన్ని సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం వంటివి పరిశుభ్రమైన వంటలో ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట తాసిల్దార్ రజని, డాక్టర్ శివ దయాల్, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

- అమృత్ పథకం ద్వారా మందమర్రి ప్రజలకు శాశ్వత మంచినీటి సౌకర్యం
- రాష్ట్ర కార్మిక శాఖమంత్రి గడ్డం వివేక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి పట్టణంలో కళ్యాణలక్ష్మి/షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ .... ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని, అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలను అందించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేద ప్రజలకు గూడు కల్పించే ఉద్దేశంతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు చొప్పున కేటాయించి అర్హత గల లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అర్హత కలిగి ఉండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కానీ వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. గత 10 సంవత్సరాలలో అందని రేషన్ కార్డులను అర్హత గల ప్రతి ఒక్కరికి అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కొరకు 9 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. నూతన గనుల ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. మందమర్రి ప్రాంతంలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించడం జరిగిందని, 50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమృత్ పథకం ద్వారా మందమర్రి ప్రజలకు శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యావ్యవస్థను పటిష్టపరిచే చర్యలలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించి, దాదాపు 10 వేల మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, ఈ విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల రూపాయల పరిమితితో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండలంలోని 82 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

### మెప్మా కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి

అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో 6 లక్షల రూపాయల మున్సిపల్ నిధులతో నూతనంగా పునరుద్ధరించబడిన మెప్మా కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... ఈ కార్యాలయం 567 స్వయం సహాయక సంఘాలలోని 5 వేల 948 మంది మహిళా సభ్యులు సమావేశాలు, బ్యాంకు సంబంధిత కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థిక స్వావలంబన పొందాలని, తమ కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. మహిళ సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం క్యాతనపల్లి పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు 2 కోట్ల రూపాయల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా యూరియా తరలించారు!

- ఆందోళన చేపట్టిన రైతులు
- గంగారానికి తరలివచ్చిన వ్యవసాయాధికారులు



**కాటారం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** మండలం పరిధిలోని గంగారం గ్రామంలో డిసిఎంఎస్-2 గోదాం నుంచి సోమవారం రాత్రి అక్రమంగా యూరియా తరలించారు. అక్రమంగా యూరియా తరలించినందుకు రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం డీసీఎంఎస్ 2 సెంటర్ కు 220 యూరియా బస్తాల వచ్చాయి. వాటిని మంగళవారం రైతులకు స్థానిక ఏఈఓ సమక్షంలో పంపిణీ చేయాల్సి ఉంది. నిబంధన ప్రకారం యూరియాను రైతుల ఆధార్, పట్టాదార్ పాస్ పుస్తకం ఆధారంగా, ప్రత్యేక యాప్ లో వారి పేర్లు నమోదు చేసి ఓటిపి వచ్చిన తర్వాత పంపిణీ చేయాలి. కానీ అట్టి నిబంధనాలకు విరుద్ధంగా సోమవారం రాత్రి సమయంలో దుకాణం అనుబంధంగా ఉన్న గోదాం నుంచి దుకాణం యజమాని సుమారు 140 బస్తాలను విక్రయించారు. ఈ విషయంపై మంగళవారం డీసీఎంఎస్ సెంటర్ ముందు రైతులు ఆందోళన చేపట్టారు. ఒక రైతుకు ఒక బస్తా యూరియా ఇస్తుండగా పెద్ద మొత్తంలో యూరియా బస్తాలను ఎలా విక్రయిస్తారని రైతులు ప్రశ్నించారు. ఈ విషయం వ్యవసాయ అధికారులకు తెలపడంతో మహాదేవపూర్ ఏడిఏ శ్రీపాల్, మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ పరిశీలించారు. డీసీఎంఎస్ నిర్వాహకుడు ఈపాస్ లో నమోదు చేయకుండా, సరైన బిల్లులు రసీదులు రైతులకు ఇవ్వకుండా, వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వకుండా అధిక ధరలకు అర్ధరాత్రి అమ్మకాలు చేపట్టినట్లు తెలిపారు. సుమారు రు. 4 లక్షల 67 వేల ఎనిమిది వందల రూపాయలు సీజ్ చేసి అమ్మకాలం నిలిపివేసి, స్టాఫ్ సెల్ ఆర్డర్ తో పాటు షోకాస్ నోటీసులు జారీ చేసి లైసెన్స్ సస్పెన్షన్ చేస్తున్నట్లు వెల్లడించారు. అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ అస్మా, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐ. బి. ప్రాంతంలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... 300 కోట్ల రూపాయల వ్యయంతో 650 పడకలతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసే దిశగా జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రావు తో కలిసి ఆకస్మికంగా సందర్శించి జాతీయ రహదారి 63 నిర్మాణంలో భాగంగా కొనసాగుతున్న పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోయిన అర్హులైన బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో మాట్లాడి వారు వచ్చిన పనుల వివరాలను తెలుసుకున్నారు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్రాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తులను నిబంధనలకు లోబడి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ప్రశ్నించే గొంతుకలను అరెస్టు చేయడం దురదృష్టకరం

- పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తే మాజీ సర్పంచులను అరెస్టు చేస్తారా?
- బిఆర్ఎస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనం చేసుకోవడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేడారం వస్తున్న సందర్భంగా గ్రామ పంచాయతీల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నామని ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి ఆరోపించారు. గత రెండు సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు చెల్లించడం లేదని, కాంగ్రెస్ మంత్రులను కలిసినా కూడా ప్రయోజనం లేకుండా పోయిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి కి నిధులు చెల్లించాలని వినతి పత్రం ఇచ్చిన కూడా ఇప్పటివరకు గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించ లేదని, మాజీ సర్పంచులు మనోవేదనకు గురవుతున్నారని, అప్పులు పెరిగిపోతున్నాయని వారు నిరసన తెలియజేస్తే వాళ్లని అరెస్టులు చేయడం బాధాకరమైన విషయమని తెలిపారు. సమ్మక్క సారలమ్మ తల్లులు పాలించిన జిల్లా ములుగు అని అలాంటి జిల్లాకు ఉద్యమాలు కొత్తవి కావని, తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని తరిమి కొట్టిన రాయిని గూడెం సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టే రోజులు వస్తాయని ఆయన హెచ్చరించారు. అరెస్ట్ అయిన టిఆర్ఎస్ పార్టీ నాయకులను, మాజీ సర్పంచుల మద్దతుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి నిరసన తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్ భూక్య పవన్ కుమార్, దాసరి రమేష్, జిల్లా యూత్ అధ్యక్షులు కోగిల మహేష్, మాజీ సర్పంచ్ మోరే రాజన్న, మాజీ ఎంపిటిసి గొర్రె సమ్మయ్య, కవ్వంపల్లి బాబు, మేకల సంజీవ్ లు ఉన్నారు. ఈ కార్యక్రమం లో ములుగు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, దొడ్డ వెంకటరెడ్డి, వాంకుడోత్ రాందాస్, బాలు, గొర్రె రఘుపతి, సునావత్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నేటికీ పదిలంగా బొడ్డెమ్మ పేరు

- బొడ్డెమ్మ ఎత్తుకున్న కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఇదేంది బొడ్డెమ్మను ఎత్తుకున్న కలెక్టర్ అని ఆశ్చర్యపోతున్నారా! కానీ ఇది నిజం మీరు చదివింది చూసింది ముమ్మాటికీ కరక్టే. ఎందుకంటారా పూర్వ కాలం నుంచి ఆదిలాబాద్ జిల్లాలో దసరా పండుగ వచ్చిందంటే అన్ని పల్లెల్లో మహిళలు బొడ్డెమ్మ గుండం తవ్వి చుట్టూ గద్దెలు తయారు చేసి ఆ గద్దెలపై రంగు రంగు పూలతో బొడ్డెమ్మలను అందంగా అలంకరించి పూజలు నిర్వహించి రాత్రి వేళల్లో బొడ్డెమ్మ పాటలు పాడుతూ ఆనందం వ్యక్తం చేస్తుంటారు. ఆ దృశ్యాలు ఎంతో కోలాహలంగా ఉంటాయి. ఇది జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం. అది నేటికీ అది పదిలంగా ఉంది. బొడ్డెమ్మల పేరుతోనే పల్లెల్లో మహిలామణులు ఈ బొడ్డెమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తుంటారు. ఇది ఆదిలాబాద్ జిల్లా బొడ్డెమ్మల ప్రత్యేకత. ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాల్లో బాగంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఈ బొడ్డెమ్మను చేతిలో ఎత్తుకుని సందడి చేశారు. కలెక్టర్ తో పాటు వివిధ శాఖల అధికారులు సంబరాల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఆదిలాబాద్ బతుకమ్మను అన్ని పల్లెల్లో ముద్దుగా పిలిచే బొడ్డెమ్మను ఎత్తుకుని సందడి చేశారు.

# సెప్టెంబర్ 28న చలో మానుకోట

- లంబాడీల ఆత్మగౌరవ సభ ర్యాలీని జయప్రదం చేయండి
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్..



**మహబూబాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ లంబాడీల మీద కొంతమంది కుట్రపన్ని రాజకీయ స్వలాభం కోసం గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసనసభ్యులు మాజీ పార్లమెంట్ సభ్యులతో రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని లంబాడీల కుట్రపన్ని కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడీలను మంత్రి పదవి ఇవ్వని లంబాడి ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి అని వారు ఏద్దేవా చేశారు. ఈనెల 28న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన లంబాడీల ఆత్మగౌరవ సభకు లంబాడీ బిడ్డలు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి తండా నుండి జిల్లా రాష్ట్ర నలుమూలల లంబాడీ యువకులు విద్యార్థులు మేధావులు మహిళలు రైతులు మాజీ ప్రజా ప్రతినిధులు విధిగా జాతి కోసం జరిగే పోరాటంలో పాల్గొని విజయవంతం చేయలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానుకోట లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ నాయకులు కిషన్ నాయక్ పృధ్వి నాయక్ కర్నావత్ వెంకన్న నాయక్ గుగులోత్ భీమా నాయక్ సేవాలాల్ వెంకన్న నాయక్ బోడ లక్ష్మణ్ నాయక్ బోడ రమేష్ నాయక్ డాక్టర్ రాజకుమార్ జాదవ్ గుగులోత్ హరి నాయక్ బానోతు మంగీలాల్ బోడ హరిలాల్ మాలోత్ శ్రీను నాయక్ బానోతు రాందాస్ నాయక్ బానోతు దాము నాయక్ ధారావత్ మోతిలాల్ నాయక్ మంగీలాల్ నాయక్ మాలోత్ సురేష్ నాయక్ గుగులోత్ నందులాల్ నాయక్ కెలోత్ మల్సూర్ నాయక్ ధారావత్ శ్రీను నాయక్ బాలాజీ నాయక్ బానోతు మంగీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

- బిల్లుల చెల్లింపు కోసం క్షేత్రస్థాయిలో పరిశీలనలు



**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 23(జనంసాక్షి):** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గ్రేటర్ నగర పరిధిలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులు పూర్తయిన నేపథ్యంలో వాటికి బిల్లుల చెల్లింపుల కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భం గా కమిషనర్ గ్రేటర్ వరంగల్ పరిధిలోని 31 వ డివిజన్లోని దీన్ దయాల్ కాలనీ, 50 వ డివిజన్లోని ఇందిరా కాలనీ, రాంపూర్ జవహర్ కాలనీ గోపాల్పూర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి డ్రైన్ లు, రోడ్ల నిర్మిత సంబంధ పనుల ప్రమాణాలను ఎం బి బుక్ ల ప్రామాణికం గా కొలతలు వేయించి ధ్రువీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంపూర్ ప్రాంతంలో బల్దియా ఉద్యనవనాల విభాగం ద్వారా సెంట్రల్ మీడియన్ లో ఏర్పాటు చేస్తున్న మొక్కలను కమిషనర్ పరిశీలించి సమర్ధ నిర్వహణకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవి కుమార్, డీఈ రాగి శ్రీకాంత్, రాజ్ కుమార్, సారంగం, ఏఈ మేనక, హార్టికల్చర్ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతతో పనులు త్వరితంగా పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, సెప్టెంబరు 23(జనంసాక్షి) :** నియోజక వర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల. మండలాల్లో జరుగుతున్న ఎంఆర్ఆర్, సీఆర్ఆర్ విధుల నుంచి రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాసరావు, డీ.ఈ రామలింగాచారి, ఏఈలు రాహుల్, మహేశ్. వివిధ శాఖల అధికారులు ఉన్నారు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం సోన్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్,సంబంధిత అధికారులతో మార్క్ అవుట్,బేస్ మెంట్, తదనంతర నిర్మాణ దశలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నెల 30లోపు అనుమతులు పొందిన అన్ని ఇళ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తి చేసి,వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నిరంతరం ఇళ్ల నిర్మాణంపై పర్యవేక్షణ చేయాలని,ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన కలెక్టర్,నిబంధనల ప్రకారం ప్రతి దశకు సంబంధించిన ఫొటోలు సంబంధిత వెబ్ సైట్లో సమయానికి అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి వివరాలను కలెక్టర్ వెల్లడిస్తూ,తెలంగాణ ప్రభుత్వం పేదలకు గృహాలు కల్పించేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 9,161 ఇళు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. (ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున,పీవీటీజీలకు ప్రత్యేకంగా)ఇందులో 60 శాంతం మార్క్ అవుట్లు పూర్తవగా,50 శాతం పైగా ఇళ్లు బేస్మెంట్ స్థాయి వరకు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 24 కోట్ల 68 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. అదనపు ఆర్థిక సహాయం కావలసిన వారికి స్వయం సహాయక సంఘాలు(ఎస్ హెచ్ జి ఎస్)దాదాపు రూ. 3 కోట్లు రుణాలు అందిస్తున్నాయని తెలిపారు. గత 45 రోజుల్లో 20 రోజులు భారీ వర్షాలు కురిసినప్పటికీ,ప్రస్తుతం లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఇండ్ల నిర్మాణాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా సమీప ఎంపీడీవో,తహసీల్దార్ కార్యాలయాలను సంప్రదించాలని తెలిపారు. వేగవంతంగా నిర్మాణాలను పూర్తి చేస్తే, చెల్లింపులు క్రమంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,హౌసింగ్ పీడీ రాజేశ్వర్,ఎంపీడీవో సురేష్,సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి

**టేకుమట్ల సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాదా ఓదెలు విద్యుత్ స్థంబానికి ఉన్న డిష్ వైర్లను సరిచేస్తు ప్రమాదవశాత్తు విద్యుత్ షాకికి గురై కిందపడి తల పగిలి డిష్ కేబుల్ ఆపరేటర్ సాదా ఓదెలు (50) మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై దాసరి సుధాకర్ తెలిపిన కథనం ప్రకారం, టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాదా ఓదెలు మంగళవారం ఉదయం విద్యుత్ స్థంబానికి ఉన్న డిష్ వైర్లను నిచ్చెన సహాయంతో ఎక్కి సరిచేస్తున్నాడు. ఈక్రమంలో తన చేయి ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలి షాక్ కి గురై కింద ఉన్న సీసీ రోడ్డుపై పడిపోయాడు దీంతో తల పగిలి తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న టేకుమట్ల ఎస్సై సుదాకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పంచానామా నిర్వహించి మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం చిట్యాల సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య రజిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహా



**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు, రోగులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యాధికారులకు రక్షణ కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.ప్రభుత్వ కార్యాలయాల భద్రత తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి భద్రతను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు పోలీస్ శాఖతో సమన్వయంగా పని చేయాలని,ఎలాంటి మెడికో లీగల్ కేసులు నమోదైతే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రి నందు అన్ని రకాల సదుపాయాలతో ప్రజలకు ఉచిత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని, ఇలాంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఏదైనా సమస్య వస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కానీ వైద్యాధికారులపై ఆసుపత్రి నిర్మాణాలపై, వైద్య పరికరాలపై ఎలాంటి దాడులకు పూనుకోవద్దని, పరికరాలను ధ్వంసం చేయవద్దని అన్నారు.ఇలాంటి చర్యలు చట్టపరంగా నేరమని హెచ్చరించారు.వైద్య సహాయం కోసం వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యాధికారులను ఆదేశించారు.ఆసుపత్రి నందు పని చేసే ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా సంబంధిత అధికారుల వద్ద పరిష్కరించుకోవాలని ఏలాంటి విభేదాలకు, వివాదాలకు వెళ్ళవద్దని అన్నారు.అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో గల పోలీస్ అవుట్ పోస్టును పరిశీలించారు.సిబ్బంది ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ఎలాంటి కేసులు నమోదైన వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు తెలియపరచాలని, రికార్డ్ నందు ప్రతి విషయాన్ని నమోదు చేయాలని సూచించారు.అంబులెన్స్ లకు, ప్రజల వాహనాలకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ చేయించాలని సూచించారు. మెడికో లీగల్ కేసు నమోదు అయితే వెంటనే పోలీసు వారికి సమాచారం వచ్చేలా వైద్యాధికారులతో సమన్వయంగా పనిచేయాలని, దీనిని ఇంప్లిమెంట్ చేయడానికి ప్రణాళిక తయారు చేయాలని టౌన్ సీఐకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ వైద్యాధికారులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్లు వినయానంద్,లక్ష్మణ్,మనీషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

- తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహా రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** భారత ప్రధాన న్యాయమూర్తిని కించపరిచిన న్యాయవాదుల లైసెన్స్ రద్దు చేయాలి.తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహా రెడ్డికి సిద్ధిపేట బార్ అసోసియేషన్ అడ్వకేట్స్ మరియు ఎస్సి, ఎస్టీ అడ్వకేట్స్ అసోసియేషన్ న్యాయవాదులు మరియు హైకోర్టు అడ్వకేట్స్ కలిసి భారత ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన సిద్ధిపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు పొద్దుటూరి శ్రీకాంత్ వైశ్య, ఎం. మురళి మోహన్ రావు బ్రాహ్మణ న్యాయవాదులపై పిర్యాదు చేశారు. సదరు న్యాయవాదులు కనకము సింహాసనమున, వెనుకటి ఊరి శూనకాలు మలము తినేవి, వెనకటి శూనకాలు మళ్ళీ వస్తాయి అనుకోలేదు, ప్రస్తుతానికి ఢిల్లీలో ఒకటి లభ్యమైనదని, రెండేళ్ళకోసం మొన్ననే ఓ శూనకాన్ని కుర్చీలో కూర్చుండబెట్టారు, అతి తెలివి మాటలు మాట్లాడం దాని అలవాటు అని అసభ్య పదజాలంతో భారత ప్రధాన న్యాయమూర్తిని కించపరుస్తూ దూషించారని, కుల మతోన్మాదముతో అడిగిన న్యాయవాదులపై అహంకారపూరీత దొరనితో అనుసరించారని తెలిపారు. సిద్ధిపేట పోలీస్ స్టేషన్ నందు వారిపై కేసు నమోదయ్యిందని, వారి యొక్క ఎన్రోల్మెంట్ సర్టిఫికెట్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. హైకోర్టు నందు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు ను, అడిషినల్ అడ్వకేట్ జనరల్ తెరా రజినీకాంత్ ను కలిసి విజప్తి చేశారు. ఇట్టి పిర్యాదుపై బార్ కౌన్సిల్ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్ట్ అడ్వకేట్స్ కొమ్ము ప్రవీణ్ కుమార్, పోలె విష్ణు, చందులాపురం భూపతి, సిద్ధిపేట న్యాయవాదులు ఎ. బాపురావు, కర్రోళ్ల రవిబాబు,యాదగిరి, పల్లెటూరి ప్రసాద్, బత్తుల రాజు, పత్రి ప్రకాశ్, పర్వతం రాములు, జేరిపోతుల యాదగిరి, బైరి ప్రవీణ్, రాగుల బాబు, ఎర్ర సాగర్,బాల్ రాజ్, అశోక్, శంకర్, ఎల్లం, ప్రవీణ్, పుణేందర్, యెలా బాలరాజు, శ్రీనివాస్, దుబ్బ రాజశేఖర్, శ్రీనివాస్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# 444 బస్తాలు..క్యూలైన్‌లో 4వేల మంది రైతులు

- రాత్రి నుండి క్యూ లైన్‌లో ఉన్న వారికి కాకుండా ఇతరులకు టోకెన్‌లు ఇచ్చారంటూ రాస్తారోకో...
- పోలీస్ వ్యవసాయ అధికారుల పహారాలో యూరియా పంపిణీ...
- గ్రోమోర్ పని తీరుపై రైతుల ఆగ్రహం



**ఆత్మకూర్ (ఎస్), సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** యూరియా కోసం రైతులకు కష్టాలు తప్పడం లేదు. సొసైటీలు వ్యవసాయ శాఖ సమన్వయంతో పోలీసులు సహకారంతో శాంతియుతంగా వచ్చిన యూరియా బస్తాలను అన్నదాతలకు పంపిణీ చేస్తుండగా నెమ్మికల్ మన గ్రోమోర్ యూరియా పంపిణీలో నిర్లక్ష్యం కారణంగా రైతులు అధికారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత 15 రోజులు క్రితం యూరియా తెప్పించిన మన రైతులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం కారణంగా వివాదాలు తెలుత్తాయి. సోమవారం సాయంత్రం రెండు లారీల యూరియా తెచ్చిన మన గ్రోమోర్ రైతులకు ముందస్తు సమాచారం కానీ టోకెన్లు గాని ఇవ్వకపోవడంతో 444 బస్తాలకు సోమవారం రాత్రి నుండి రైతులు షాపుల ముందు వర్షాలకు తడుస్తూ పడి గాపులు కాయల్సి వచ్చింది. మంగళవారం ఉదయం వేలాదిమంది రైతులు నేమికల్లు మన గ్రోమోర్ ముందు బారులు తీరారు. వ్యవసాయ అధికారులు పోలీసులు రైతు స్థానిక పిఎసిఎస్ కార్యాలయం ముందు టోకెన్లు ఇచ్చి అనంతరం ఒకో రైతు కు ఒక బస్తా యూరియా పంపిణీ చేశారు. టోకెన్లు ఇవ్వడంలో రాత్రి నుండి వేచి ఉన్న రైతులను కాదని తర్వాత వచ్చిన వారికి ఇవ్వడంతో కొద్దిసేపు గ్రోమోర్ కార్యాలయం ముందు నిమ్మికలు దంతాలపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు కలగజేసుకొని అదనంగా టోకెన్లు ఇచ్చి తర్వాత వచ్చే లోడ్ కు యూరిన్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

# కోదాడలో గంజాయి కలకలం

- ప్లాస్టిక్ బస్తాలలో నిల్వ ఉంచిన గంజాయి
- పోలీసులకు సమాచారం ఇచ్చిన రైతులు
- క్వింటన్నర గంజాయి లభ్యం
- విచారణ చేస్తున్న పోలీసులు



**కోదాడ, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** కోదాడలో గంజాయి కలకలం రేపింది. సుమారు. క్వింటన్నర గంజాయిని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ పురపాలక సంఘం పరిధి జాతీయ రహదారి 65 హైదరాబాదు విజయవాడ బైపాస్‌లో గల మామిడికాయల యార్డ్ పాత షెడ్డులో ప్లాస్టిక్ బస్తాలను అటుగా వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకుని ప్లాస్టిక్ బస్తాలను తనిఖీ చేయగా తనిఖీలలో అవి గంజాయిగా తేలింది. సుమారు 5 బస్తాలలో గంజాయి నిల్వ చేశారు.ఐదు గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 110 కేజీలకు పైగా గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో రహస్య ప్రదేశంలో గంజాయిని డంపు చేసి ఉండవచ్చని పోలీసుల అంచనా వేస్తున్నారు. సిసి కెమెరాలను పర్యవేక్షించి నిందితులను పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# పెన్షన్‌దారులకు న్యాయం చేయలేని అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ



**మునుగోడు, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** పెన్షన్‌దారులకు న్యాయం చేయలేని అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ ని నిలదీసిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ.మునుగోడు నియోజకవర్గ చేయూత పెన్షన్ దారుల సన్నహాక సభ మునుగోడు లోని పి ఆర్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, విహెచ్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరై మాట్లాడుతూ చేయుత పెన్షన్లు పెంచకుండా రేవంత్ రెడ్డి మోసం చేశాడు.2023 ఎన్నికల సమయం నవంబర్ లో నాకు ఓటు వేయండి డిసెంబర్ లో పెరిగే పెన్షన్లు తీసుకోమని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓట్లు దండుకున్నాక దారుణంగా మోసం చేశాడని అన్నారు. చేతగాని స్థితిలో ఉన్న పెన్షన్ దారులకు న్యాయం చేయాలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థుడిగా మిగిలిపోతున్నారని అన్నారు.పెన్షన్లు పెంచడమా లేదా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం మీద నుండి దిగిపోవడమో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే పెన్షన్ల గురించి మాట్లాడకుండా కేసీఆర్ మౌనం వహించడం దుర్మార్గమని అన్నారు.ప్రతిపక్ష పార్టీగా బిఆర్ఎస్ పార్టీ పెన్షన్ దారుల పక్షాన నిలవడంలో విఫలమైందని అన్నారు. రేవంత్,కేసీఆర్ పేద వర్గాలకు చెందిన వాళ్లు కాదు కనుక పేద వర్గాలకు చెందిన పెన్షన్ దారుల గోడు పట్టడం లేదని అన్నారు.అందువల్ల పేద వర్గాలకు చెందిన బిడ్డగా పెన్షన్ దారులకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ పోరాటాన్ని ముందుకు నడిపిస్తామని అన్నారు.వికలాంగులకు 6000 ,వృద్ధులు, వితంతువులు,ఒంటరి మహిళలతో పాటు మిగతా పెన్షన్ దారులకు 4000 ఇవ్వాలని అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి నూతన పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ డిమాండ్లను సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అక్టోబర్ 6 నుండి నవంబర్ 6 వరకు నెల రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో దీక్షలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుండి అన్ని మండలాల నుండి పెన్షన్ దారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# చెస్ క్రీడలో అభినవ్ పేరు చిరస్మరణీయం



**కోదాడ, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** చెస్ క్రీడలో ఆసియన్ ఛాంపియన్ మేకల అభినవ్ పేరు చిరస్మరణీయమని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం కోదాడలో చెస్ చిచ్చర పిడుగు ఆసియన్ ఛాంపియన్ మేకల అభినవ్ 24 వ వర్ధంతి సందర్భంగా కోదాడ బాలుర పాఠశాల ఎదురుగా ఉన్న అభినవ్ విగ్రహానికి తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు,అరుణ పట్టణ ప్రముఖులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాల్యంలోనే అంతర్జాతీయ క్రీడాకారుడిగా ఎదిగి ఎన్నో ఛాంపియన్ షిప్ లు సాధించి కోదాడ పట్టణానికి రాష్ట్రానికి భారతదేశానికి ప్రపంచంలో గుర్తింపు తెచ్చిన గొప్ప క్రీడాకారుడు అభినవ్ అన్నారు. గ్రాండ్ మాస్టర్ గా ఎదిగే దిశలో దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెంది క్రీడా రంగానికి తీరని లోటు మిగిల్చారన్నారు. నేటి యువ క్రీడాకారులు అభినవ్ ఆశయాలను సాధించాలన్నారు. అభినవ్ తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు అరుణ దంపతులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ సర్పంచ్ పారా సీతయ్య, పైడిమర్రి సత్తిబాబు, రావెళ్ల సీతారామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, దేవరపల్లి నాగమల్లేశ్వరి, రామినేని శ్రీనివాసరావు, హెచ్ఆర్ రాజేష్, వీరబాబు, వేనేపల్లి శ్రీనివాసరావు, గంధం యాదగిరి, సంగిశెట్టి గోపాల్, పిట్టల భాగ్యమ్మ పంది తిరపయ్య, విద్యాసాగర్ రావు, జగన్మోహన్ రావు, రాము, కీతా వెంకటేశ్వర్లు సుందర వెంకటేశ్వర్లు, సదే లక్ష్మీనారాయణ, గుండెల సూరి,వీరారెడ్డి,దొంగరి శ్రీనివాస్, కర్ల సుందర్ బాబు, పాయిలు జయరామయ్య, షేక్ బాగ్దాద్, కళ్యాణ్, షేక్ అలీ, చింతలపాటి శేఖర్,పత్తిపాక జనార్ధన్, రాజారావు, మేకల సుధాకర్,మేకల శేఖర్,వెంకటేశ్వర్లు, వెంకటరావు, దొంగరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలి




**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** హాస్పిటల్స్, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పిసిపి ఎన్డిటి యాక్ట్ ల నియమ నిబంధనలు పాటించే వారికి మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు.దరఖాస్తు చేసుకున్న వారం లోపల తాత్కాలిక అనుమతి ఇచ్చి తదుపరి క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేసి హాస్పటల్ లో, రోగ నిర్ధారణ కేంద్రాలలో అన్ని నియమ నిబంధనలు పాటిస్తే శాశ్వతంగా అనుమతి ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డిఎంహెచ్ఓ పి.చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు జి.చంద్రశేఖర్, నాజియా, కోటిరత్నం, డిప్యూటీ డిఎంహెచ్ఓ జయ మనోహరి,మీడియా అధికారి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతో అమలవుతున్న పథకాల వివరాలు పక్కాగా అందించాలి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు చొరవ చూపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి, మాధవనగర్ ఆర్.ఓ.బీ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎఫ్ఓ వికాస్ మీనా, ట్రైనీ కలెక్టర్ కరోలినా చింగ్తియాన్ మావి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, దిశా కమిటీ సభ్యులు హన్మంత్ రావు, ఆశన్న, లింగం, విజయ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- నిందితుల నుండి రూ. 66.50 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** మిర్యాలగూడ పట్టణంలోని వైష్ణవి హోటల్లో ఈ నెల 5న జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తెలిపారు. మంగళవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ డి.ఎస్.పి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన డిఎస్పి రాజశేఖర్ రాజుతో కలిసి నేరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ రహీంఖాన్ మిర్యాలగూడలోని వైష్ణవి హోటల్ టీ స్టాల్ లో పనిచేస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో వైష్ణవి హోటల్ కుణ సంబంధించిన నగదు లావాదేవీల గదిని గత కొన్ని రోజులుగా పరిశీలించి అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. అందుకు గాను రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇక్బాల్ ఖాన్, లాలుకాన్ అను వారులతో కలిసి రెక్కీ నిర్వహించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 5న హోటల్ కు సంబంధించిన నగదును దొంగిలించాలని పథకం రచించిన వారు అర్ధరాత్రి పూట హోటల్లో ఉంచిన డబ్బులను దొంగిలించి ముందుగానే ఏర్పాటు చేసుకున్న ఒక బైకుపై ఆంధ్ర రాష్ట్రం జగ్గయ్యపేటకు పారిపోయారన్నారు. హోటల్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో దొంగలను పట్టుకోవడం కోసం పోలీసులను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి రాజస్థాన్, మహారాష్ట్ర తో పాటు ఆంధ్ర ప్రాంతంలోని పలు ప్రాంతాలను విచారణ చేపట్టామన్నారు. నేర పరిశోధనలో అత్యంత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వారిపై నిఘాను ఉంచామన్నారు. ఈ క్రమంలో దొంగిలించిన సొమ్ములో కొంత భాగాన్ని జల్సాలకు ఖర్చు చేసి మిగిలిన భాగాన్ని జగ్గయ్యపేటలో ఒక గదిలో దాచి ఉంచారు అనే సమాచారం అందడంతో. ఆ ప్రాంతంలో నిఘా పెట్టామన్నారు. ఈ క్రమంలో జల్సాల కోసం ఉంచిన డబ్బు అయిపోయిన తర్వాత తిరిగి డబ్బు కోసం జగ్గయ్యపేటకు వస్తున్నారని తెలుసుకొని పక్కా ప్లాన్ తో వారిని పట్టుకున్నామన్నారు. అనంతరం విచారించగా నిందితులు తమ యొక్క నేరాన్ని అంగీకరించారన్నారు. వారి నుండి రూ. 66 లక్షల 50 వేలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఒక బైకు, దొంగతనానికి ఉపయోగించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం వారిని రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కేసులో ఇన్వెస్టిగేషన్లో ప్రతిభ చూపెట్టిన డి.ఎస్.పి రాజశేఖర్ రాజు తో పాటుగా సిసిఎస్ సీఐ జితేందర్ రెడ్డి, మిర్యాలగూడ వన్ టౌన్ సిఐ నాగభూషణరావు, హాలియా సీఐ సతీష్ రెడ్డి, తోపాటుగా ఎస్సై విజయ్ కుమార్ కానిస్టేబుళ్లు విష్ణు, రాంప్రసాద్, వహీద్, పాషా, వెంకట్, సాయి, విజయ్, పుష్పగిరి, తదితరులు ఈ కేసు చేదనలో ప్రతిభ చూపినందుకు గాను వారిని అభినందిస్తూ ప్రశంసా పత్రాలను ఎస్పీ శరత్చంద్ర పవర్ అందించారు.


# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు

- ఎస్‌పి రోహిత్ రాజ్



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** కోడి పందాలు, పేకాట, బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజ్ ఎస్ఐ మేడ ప్రసాద్‌కు సూచించారు. బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కోడిపందాలు, పేకాట, బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచి దొంగతనాల కట్టడికి కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాద నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతీ ప్రదేశంలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను అక్రమంగా రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించే ప్రదేశాలను గుర్తించి, నిత్యం అట్టి ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మేడా ప్రసాద్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## విప్రో క్యాంపస్ నుంచి వాహనాలు

# అనుమతించండి

**బెంగళూరు:**బెంగళూరులోని ఔటర్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ని తగ్గించే ప్రయత్నంలో భాగంగా స్థానికంగా ఉన్న విప్రో క్యాంపస్ ద్వారా పరిమిత వాహనాల రాకపోకలను అనుమతించాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీని కోరారు. ఈ చర్య వల్ల రహదారి ప్రక్కనే ఉన్న ప్రాంతాల్లో రద్దీ దాదాపు 30 శాతం తగ్గుతుందని అధికారులు తెలిపారు.ముఖ్యంగా కార్యాలయాల ప్రారంభ, ముగింపు సమయాల్లో దేశవ్యాప్తంగా నగరాల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. బెంగళూరులో అయితే ట్రాఫిక్ సమస్య మరీ ఎక్కువ. దీన్ని తగ్గించేందుకు అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు స్థానికంగా ఉన్న విప్రో క్యాంపస్ నుంచి వాహనాలను అనుమతించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కంపెనీ వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీకి లేఖ రాశారు. ప్రజా వాహనాలను విప్రో క్యాంపస్ నుంచి అనుమతిస్తే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలకు గణనీయమైన ఉపశమనం కలుగుతుందని అందులో పేర్కొన్నారు.ఇటీవల లాజిస్టిక్స్ టెక్నాలజీ సంస్థ బ్లాక్ బక్ సహ వ్యవస్థాపకుడు తమ బెల్లందూర్ కార్యాలయాన్ని ఖాళీ చేస్తున్నట్లు ప్రకటించారు. బ్లాక్ బక్ సీఈఓ రాజేష్ యాబాజీ సోషల్ మీడియాలో తెలిపిన వివరాల ప్రకారం..'రోడ్లపై ట్రాఫిక్, గుంతలు, దుమ్ముతో చాలా ఇబ్బంది కలుగుతుంది. దాంతో బెల్లందూర్‌లోని కార్యాలయాన్ని ఖాళీ చేస్తున్నాం' అంటూ రాసుకొచ్చారు. ఈ వ్యాఖ్యల తరువాత నగరంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ అడ్డంకుల గురించి ఆందోళనలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది.


## 25,150 పాయింట్ల వద్ద నిఫ్టీ

**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే మంగళవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:36 సమయానికి నిఫ్టీ 37 పాయింట్లు తగ్గి 25,165కు చేరింది. సెన్సెక్స్ 105 పాయింట్లు నష్టపోయి 82,051 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్97.29 బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 66.15 డాలర్లు యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.14 శాతానికి చేరాయి.గడిచిన సెషన్‌లో యూఎస్ ఎస్ అండ్ పీ 0.44 శాతం పెరిగింది. నాస్‌డాక్ 0.7 శాతం పుంజుకుంది.

## 3 బిలియన్ డాలర్ల ఏయూఎం లక్ష్యం


**భారతీయ ఇన్వెస్ట్మెంట్ రంగంలో కొత్త దిశగా, ఆర్థ భారత్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ ఎల్‌ఎల్‌పీ, తన స్పెషల్ సిట్యుయేషన్స్ ఫండ్‌ను మారిషస్ నుంచి విజయవంతంగా గిఫ్ట్ సిటీకి మార్చిన తొలి క్యాటగిరీ 3 ఏఎఫ్ఐ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్‌గా నిలిచింది. సంస్థ ఇప్పుడు తన విస్తృత ప్రణాళికలో భాగంగా 2030 నాటికి 3 బిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహణలోకి (ఏయూఎం) చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుని, ప్రపంచ విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గిఫ్ట్ సిటీ నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఫండ్ మేనేజ్మెంట్ సంస్థలలో ఒకటైన అర్థ భారత్, ఇప్పుడు మధ్యప్రాచ్యంలో తన ఉనికిని మరింతగా విస్తరిస్తోంది.**

# ప్రపంచ విస్తరణ ప్రణాళికను ప్రకటించిన అర్థ భారత్





**గిఫ్ట్ సిటీ, ఇండియా/అబుదాబి(జనంసాక్షి)**

సంస్థ ప్రస్తుతం అబుదాబి గ్లోబల్ మార్కెట్స్ (ఏజీడీఎం)లో తన ఉనికిని పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతోంది. ఈ విస్తరణ ద్వారా భారతీయ ప్రవాసులు మాత్రమే కాకుండా, సార్వభౌమ, పాక్షిక-సార్వభౌమ నిధుల నుండి పెరుగుతున్న సంస్థాగత ఆసక్తిని ఆకర్షించే విశేష అవకాశాలను అర్థ భారత్ గుర్తిస్తోంది. మధ్యప్రాచ్యం భారతీయ ప్రవాసుల అత్యధికంగా స్థిరపడి ఉన్న ప్రాంతాలలో ఒకటిగా ఉంది. చాలాకాలంగా భారతదేశానికి విదేశీ మారక ద్రవ్య ప్రవాహానికి ప్రధానంగా ఉంది. ముబాడాలా, ఖతార్ ఇన్వెస్ట్మెంట్ అథారిటీ, అబుదాబి ఇన్వెస్ట్మెంట్ అథారిటీ వంటి సార్వభౌమ నిధుల ద్వారా భారతదేశంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. జీసీసీ మార్కెట్లలో హెచ్ఎన్ఐలు, కుటుంబ కార్యాలయాలు, సార్వభౌమ నిధుల పెరుగుతున్న సామర్థ్యాన్ని వినియోగించుకో వడానికి మేము అబుదాబి గ్లోబల్ మార్కెట్స్‌లో కార్యకలాపాలను ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉన్నాము" అని మిస్టర్. సచిన్ సావ్రికర్, మేనేజింగ్ పార్టనర్, అర్థ భారత్ ఇన్వెస్ట్మెంట్ మేనేజర్స్ ఐఎఫ్ఎస్‌సీ ఎల్‌ఎల్‌పీ తెలిపారు. ఇటీవల 2,300 చదరపు అడుగుల లీజు కార్యాలయాన్ని గిఫ్ట్ సిటీలో ప్రారంభిం చిన ఈ సంస్థ, దుబాయ్‌లో 1,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 సీట్ల కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసింది. అదే పరిమాణంలో మరో కార్యాలయాన్ని అబుదాబి గ్లోబల్ మార్కెట్స్‌లో ఏర్పాటుచేసే ప్రణాళికలో ఉంది. నాన్-యూఎస్ పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక ఫీడర్ ఫండ్లను ప్రవేశపెట్టి, తమ వ్యూహాలలోకి మూలధనాన్ని మళ్లించే ప్రణాళికను అర్థ భారత్ సిద్ధం చేస్తోంది. వీటిలో ముఖ్యంగా :అర్థ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్-భారతదేశంలోని అతిపెద్ద విదేశీ డిస్ట్రెస్డ్ డెట్ ఫండ్లలో ఒకటైన ఈ ఫండ్, దాని 7 సంవత్సరాల కాలవ్యవధి ఉన్నప్పటికీ కేవలం 2 సంవత్సరాల్లోనే 6 రెట్ల రాబడి అందించడం ద్వారా విశేష విజయాన్ని సాధించింది. అర్థ గ్లోబల్ మల్టిప్లయర్ ఫండ్-యూఎస్ మార్కెట్లను లక్ష్యంగా చేసుకున్న లాంగ్-షార్ట్ హెడ్జ్ ఫండ్, ఇది ఇప్పటికే 2.5 నెలల్లోపు 13.4% సంపూర్ణ రాబడిని అందించింది. అర్థ భారత్ అబ్సొల్యూట్ రిటర్న్ ఫండ్-ఈక్విటీలు, కమోడిటీలు, వడ్డీ రేటు ఫ్యూచర్లలో పెట్టుబడి పెట్టే యూఎస్‌డీ-డినామినేటెడ్ ఆర్బిట్రేజ్ ఫండ్‌ను అర్థ భారత్ రూపొందిస్తోంది. ఈ ఫండ్ లక్ష్యం స్వల్పకాలిక మిగులు మూలధనాన్ని వినియోగించుకునే పెట్టుబడిదారులకు, సాంప్రదాయ స్థిర ఆదాయ మార్గాలతో పోలిస్తే మరింత స్థిర రాబడులను అందించడం. "మా వివేకవంతమైన పెట్టుబడిదారుల స్థావరానికి ఆకర్షణీయమైన రిస్క్-అడ్జస్టెడ్ రాబడులను, అత్యున్నత నైతిక ప్రమాణాలు మరియు సమగ్రతతో అందించడం ద్వారా, గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ రంగంలో ముద్ర వేయడానికి, మా ఆకాంక్షిత లక్ష్యాన్ని సాధించడానికి ఇది తోడ్పడుతుందని మేము నమ్ముతున్నాము" అని మిస్టర్ సావ్రికర్ తెలిపారు. దాదాపు 2 దశాబ్దాలుగా ఒమన్‌లో స్థిరపడి, బ్యాంక్ మస్కట్‌లో దీర్ఘకాలం పనిచేసిన సావ్రికర్, జీసీసీ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడం, కార్యకలాపాలు నిర్వహించడంలో గొప్ప అనుభవాన్ని కలిగి ఉన్నారు. మధ్యప్రాచ్య విస్తరణతో పాటు, అర్థ భారత్ ఇప్పుడు మారిషస్‌లో కూడా తన స్వంత కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ కేంద్రం ద్వారా యూఎస్ పెట్టుబడిదారుల కోసం ప్రత్యేక ఫీడర్ ఫండ్లు నిర్వహించబడతాయి. ఇవి సంస్థ గిఫ్ట్ సిటీలో నిర్వహించబడుతున్న ఫండ్లలో పెట్టుబడులు చేస్తాయి. భవిష్యత్ వృద్ధికి తోడ్పడటానికి, అర్థ భారత్ 7,500 చదరపు అడుగుల విస్తీర్ణం గల భూమిని కొనుగోలు చేయడానికి 7.5 కోట్ల ఒప్పందంపై సంతకం చేసింది. భారతదేశంలోని గిఫ్ట్ సిటీలోని షిల్ప్ ట్విన్ టవర్స్‌లో ఉన్న కొత్త కార్యాలయం, సంస్థ ప్రస్తుత స్థలాన్ని మూడింతలు పెంచడంతో పాటు, మరింత పెద్ద పెట్టుబడి బృందాన్ని ఏర్పాటు చేయడానికి దోహదపడుతుంది. భౌగోళిక విస్తరణను సాధించడం, బహుళ లిక్విడిటీ పూల్‌లను వినియోగించడం ద్వారా, 2030 నాటికి 3 బిలియన్ డాలర్ల ఏయూఎం మైలురాయిని చేరుకోవడంలో ప్రపంచ విస్తరణ ముఖ్య పాత్ర పోషిస్తుందని అర్థ భారత్ ఆశిస్తోంది.




# జీఎస్టీ 2.0 ఎఫెక్ట్..

### మొదటి రోజే భారీగా అమ్ముడైన కార్లు



**న్యూఢిల్లీ:**జీఎస్టీ 2.0 ఎప్పుడెప్పుడు అమలవుతుందా.. కొత్త కార్లు ఎప్పుడు కొనుగోలు చేద్దామా అని చాలామంది ఎదురు చూశారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయి.దీంతో కార్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. జీఎస్టీ సంస్కరణలు అమలులోకి రావడంతో చిన్నకార్ల ధరలు చాలా వరకు తగ్గాయి. దీంతో కార్లను కొనుగోలు చేయడానికి వాహనప్రియులు ఎగబడ్డారు. కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన మొదటిరోజే.. మారుతి సుజుకి 30,000 యూనిట్ల కార్లను విక్రయించి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ సుమారు 11,000 కార్లను విక్రయించింది. టాటా మోటార్స్ కూడా 10,000 కార్లను విక్రయించింది. దేశంలో చిన్న కార్ల విక్రయాలు భారీగా పెరిగాయి. ఆటోమొబైల్ కంపెనీలు జీఎస్టీ ప్రయోజనాలను పూర్తిగా కస్టమర్లకు అందిస్తున్నాయి. రాబోయి రోజుల్లో కూడా ఈ సేల్స్ ఇలాగే కొనసాగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా.. సోమవారం కార్లను కొనుగోలు చేయడానికి కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో డీలర్‌షిప్‌లకు తరలిరావడంతో, ఆటోమోటివ్ డీలర్ల రద్దీ పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ తెలిపింది.



## ట్రంప్‌నకు హమాస్ రహస్య లేఖ?

**వాషింగ్టన్:**మధ్యప్రాచ్యంలో మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొల్పేందుకు కొత్త దారులు తెరుచుకుంటున్నాయి. 24 మంది బందీల విడుదలతో పాటు 60 రోజుల కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు హమాస్ రహస్య లేఖ పంపినట్లు సమాచారం.మరోవైపు, గాజా యుద్ధం ముగింపునకు శాంతి ప్రణాళికను ట్రంప్ సిద్ధం చేసినట్లు పలు వార్త కథనాలు వెల్లడిస్తున్నాయి. దోహాలో ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసిన తర్వాత గాజా శాంతి చర్చలు నిలిచిపోగా.. ఈ పరిస్థితుల్లో ట్రంప్‌తో హమాస్ సంప్రదింపులకు ప్రయత్నం చేస్తోంది. అయితే, ట్రంప్ బృందం ఈ విషయంపై స్పందించలేదు.కాగా, గాజా నగరంపై గట్టి పట్టున్న హమాస్‌తో అమీతుమీ తేల్చుకుంటామంటూ భారీగా సైనికులను రంగంలోకి దించిన ఇజ్రాయెల్ ఆర్మీ.. దాడుల తీవ్రతను కొనసాగిస్తోంది. శుక్రవారం( సెప్టెంబర్ 19) రాత్రి నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ గాజా వ్యాప్తంగా చేపట్టిన దాడుల్లో సుమారుగా 43 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో గాజా నగరంలోని షావా స్క్వేర్ సమీపంలో జరిగిన దాడిలో ఐదుగురు, మరో దాడిలో ఒకే కుటుంబంలోని ఆరుగురు చనిపోయారు..

### ప్రతిభావంతులకు చైనా ఆహ్వానం

**బీజింగ్(జనంసాక్షి):**'అమెరికా ఫస్ట్' నినాదంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ప్రతిభకి తలుపులు మూసేస్తుంటే.. చైనా మాత్రం స్వాగతిస్తోంది. సాంకేతిక, ఆర్థిక పురోగతిని ముందుకు తీసుకెళ్లడానికి ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ ఉన్నవారికి చైనా తన దేశ ద్వారాలు తెరిచింది. నేటి ప్రపంచీకరణ ప్రపంచంలో సరిహద్దుల మధ్య ప్రతిభ మార్పిడి ఎంతో కీలకమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి గువో జియాకున్ నొక్కి చెప్పారు. అంతర్జాతీయ నిపుణుల ఆవిష్కరణలకు, కెరీర్ అవకాశాలను పెంపొందించడంలో చైనా తన నిబద్ధతను చాటుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో గువో జియాకున్ మాట్లాడుతూ.. 'ప్రపంచీకరణ ప్రపంచంలో సరిహద్దుల మధ్య ప్రతిభ ప్రవాహం ప్రపంచ సాంకేతిక, ఆర్థిక పురోగతికి కీలకం. మానవాళి పురోగతి.. కెరీర్ విజయం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలకు చెందిన ప్రతిభా వంతులు వచ్చి తమ వృత్తి నైపుణ్యాలను కొనసాగించడానికి చైనా స్వాగతిస్తుంది' అని గువో జియాకున్ అన్నారు. ఇప్పటికే యువతను ఆకర్షించడానికి చైనా కె. వీసాను ప్రవేశపెట్టింది. కాగా, ఇటీ-వల ట్రంప్ హెచ్ -1బి వీసా దరఖాస్తు వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచడంతో యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. విదేశీయులు అమెరికాకు వెళ్లి ఉద్యోగం చేయాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది.

## దీపావళికి గిఫ్ట్‌లంటూ ప్రజాధనం

# వృథా చేయొద్దు



### కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, అనుబంధ సంస్థలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశాలు

**న్యూఢిల్లీ:**దీపావళిలేదా మరే ఇతర పండుగల సందర్భంగా బహుమతుల కోసం ప్రజాధనాన్ని వృథా చేయవద్దని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, అనుబంధ సంస్థలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశించింది. సెప్టెంబర్ 19, 2025న ప్రకటించిన ఈ మెమోరాండం సంస్థల్లో ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడానికి, అనవసరమైన ఖర్చులను పరిమితం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఉంది.డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్(వ్యయ శాఖ) జారీ చేసిన మెమోరాండం ప్రకారం.. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇదే తరహాలో గతంలో ఆదేశాలు జారీ చేశామని, ప్రభుత్వ నిధులను జాగ్రత్తగా వినియోగించుకునేలా ప్రభుత్వ విధానానికి కొనసాగింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్క్యులర్ పేర్కొంది. 'ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సంస్థల్లో ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహించడం, అనవసరమైన వ్యయాలను అరికట్టడం లక్ష్యంగా ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తోంది. ఈ ప్రదీపావళి లేదా మరే ఇతర పండుగల సందర్భంగా బహుమతుల కోసం ప్రజాధనాన్ని వృథా చేయవద్దని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, అనుబంధ సంస్థలను ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదేశించింది. సెప్టెంబర్ 19, 2025న ప్రకటించిన ఈ మెమోరాండం సంస్థల్లో ఆర్థిక క్రమశిక్షణను అమలు చేయడానికి, అనవసరమైన ఖర్చులను పరిమితం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఉంది.డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండిచర్(వ్యయ శాఖ) జారీ చేసిన మెమోరాండం ప్రకారం.. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయి. ఇదే తరహాలో గతంలో ఆదేశాలు జారీ చేశామని, ప్రభుత్వ నిధులను జాగ్రత్తగా వినియోగించుకునేలా ప్రభుత్వ విధానానికి కొనసాగింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్క్యులర్ పేర్కొంది. 'ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సంస్థల్లో ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహించడం, అనవసరమైన వ్యయాలను అరికట్టడం లక్ష్యంగా ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తోంది. ఈ ప్రయత్నాలకు కొనసాగింపుగా ప్రజా వనరులను వివేకవంతంగా, న్యాయబద్ధంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో దీపావళి, ఇతర పండుగల బహుమతుల కోసం మంత్రిత్వ శాఖలు / విభాగాలు, ఇతర అనుబంధ సంస్థలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదు' అని నిర్ణయించారు. ఈ మెమోరాండంను వ్యయ కార్యదర్శి ఆమోదించగా, భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి పి.కె.సింగ్ సంతకం చేశారు. ఇది అన్ని మంత్రిత్వ శాఖలు, సంబంధిత విభాగాల ఆర్థిక సలహాదారులు, పబ్లిక్ ఎంటర్ప్రైజెస్, ఆర్థిక సేవల విభాగానికి పంపినట్లు తెలిపారు. యత్నాలకు కొనసాగింపుగా ప్రజా వనరులను వివేకవంతంగా, న్యాయబద్ధంగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో దీపావళి, ఇతర పండుగల బహుమతుల కోసం మంత్రిత్వ శాఖలు / విభాగాలు, ఇతర అనుబంధ సంస్థలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదు' అని నిర్ణయించారు. ఈ మెమోరాండంను వ్యయ కార్యదర్శి ఆమోదించగా, ఈ మెమోరాండంను వ్యయ కార్యదర్శి ఆమోదించగాభారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి పి.కె.సింగ్ సంతకం చేశారు. ఇది అన్ని మంత్రిత్వ శాఖలు, సంబంధిత విభాగాల ఆర్థిక సలహాదారులు, పబ్లిక్ ఎంటర్ప్రైజెస్, ఆర్థిక సేవల విభాగానికి పంపినట్లు తెలిపారు.

## పెరుగుతోన్న యూపీఐ లావాదేవీలు



**ముంబై:**దేశంలో యూపీఐ వినియోగం రోజురోజుకి పెరుగుతోంది. నేడు ఏ చిన్న వస్తువు కొనాలన్నా.. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ చేస్తున్నారు. దీంతో యూపీఐ లావాదేవీల సంఖ్య గణనీయంగా పెరిగింది.కేవలం భారత్‌లోనే కాకుండా ?బ్రెజిల్, సింగపూర?లోనూ వీటి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల గణాంకాల ప్రకారం ఇండియాలో ఆగస్టులో గరిష్టంగా 20 బిలియన్ లావాదేవీలు దాటినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. ఆగస్టులో జరిగిన మొత్తం లావాదేవీలు 20.01 బిలియన్స్.. జులైలో 19.47 బిలియన్స్ కంటే 2.8 శాతం ఎక్కువ.అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది ఏకంగా 34 శాతం పెరుగుదలను నమోదు చేసినట్లు తెలుస్తోంది. విలువ పరంగా ఆగస్టులో యూపీఐ లావాదేవీలు రూ. 24.85 లక్షల కోట్లు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 24 శాతం ఎక్కువ అని డేటా చెబుతోంది. సగటున రోజువారీ లావాదేవీల సంఖ్య 645 మిలియన్లకు పెరిగింది. %చీూజ×% డేటా ప్రకారం రోజువారీ లావాదేవీ విలువ రూ. 80,177 కోట్లు కావడం గమనార్హం. ఆగస్టు 2న ఒకే రోజులో 700 మిలియన్ లావాదేవీలను దాటి సరికొత్త రికార్డును సృష్టించింది. రియల్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం ఉన్నప్పటికీ ఆగస్టులో ఈ పెరుగుదల నమోదైంది.

వివిధ దేశాల్లో యూపీఐ నెలవారీ లావాదేవీలు ఇలా..

యూపీఐ ఇండియాలో ప్రారంభం: 2016,నెలవారీ లావాదేవీలు: 19 బిలియన్ం

బ్రెజిల్‌లో ప్రారంభం: 2020,నెలవారీ లావాదేవీలు: సుమారు 5 బిలియన్ం

సింగపూర్‌లో ప్రారంభం: 2017,నెలవారీ లావేదేవీలు: సుమారు: 0.5 బిలియన్

## రెండు అమెరికా కంపెనీల నిర్ణయం

### సీఈఓలుగా ఇండియన్స్





**వాషింగ్టన్:**డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని.. అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా నిబంధనలను కఠినతరం చేస్తూ, ఫీజును లక్ష డాలర్లకు పెంచింది. ఈ తరుణం లోనే రెండు ప్రధాన అమెరికన్ కంపెనీలు తమ సీఈఓలుగా భారతీయుల పేర్లను ప్రకటించాయి. అమెరికా టెలికాం దిగ్గజం టీ-మొబైల్ సీఈఓగా 'శ్రీని గోపాలన్' పేరును ప్రకటించింది. ప్రస్తుతం టీ-మొబైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న శ్రీని.. నవంబర్ 1న సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి.గోపాలన్.. హిందూస్తాన్ యూనిలీవర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా జీవితాన్ని ప్రారంభించి, ఆ తరువాత భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, క్యాపిటల్ వన్, డ్యూష్ టెలికామ్‌లలో సీనియర్ పదవులను నిర్వహించారు. ప్రస్తుతం ఈయన పనిచేస్తున్న కంపెనీకే (టీ-మొబైల్) సీఈఓగా ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు.చికాగోకు చెందిన పానీయాల దిగ్గజం.. మోల్సన్ కూర్స్ కూడా తన సీఈఓగా రాహుల్ గోయల్‌ను నియమించింది. అక్టోబర్ 1నుంచి ఈయన కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. కంపెనీ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ సవాళ్లను ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని గోయల్ అన్నారు. ఈయన మైసూర్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేశారు. భారతదేశంలోని కూర్స్, మోల్సన్ బ్రాండ్‌లలో మాత్రమే కాకుండా ఈయన కొన్నాళు యూకేలో కూడా పనిచేశారు.



## మరో ఐదేళ్లలో బంగారం

# రూ.2 లక్షలకు!

### కారణాలు ఇవే..

**న్యూఢిల్లీ:**భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితులు, ట్రంప్ సుంకాలు వంటి అంశాలు బంగారం ధరలు భారీగా పెరగడానికి కారణమయ్యాయి. దీంతో ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ.1,13,070 వద్దకు చేరింది. అయితే ఈ ధర ఐదేళ్లకు ముందు.. 2020లో రూ. 51,000 మాత్రమే అని తెలుస్తోంది. దీన్ని బట్టి చూస్తే పసిడి ధరలు ఎంతలా పెరిగాయో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.బంగారం ధర ఐదేళ్లలో (2020 - 2025 మధ్య) డబుల్ అయింది. గోల్డ్ డిమాండ్ తగ్గే సూచనలు కనిపించకపోవడంతో.. రాబోయే ఐదు సంవత్సరాలలో ఇది రూ. 2 లక్షలకు చేరుకుంటుందా?, దీనిపై నిపుణులు ఏం చెబుతున్నారంటే..బంగారంపై పెట్టుబడులు ఎక్కువ కావడం.. గోల్డ్ రేటు పెరుగుదలకు కారణమవుతోంది. రాబోయే రోజుల్లో గోల్డ్ రేటు మరింత పెరిగే అవకాశం ఉందని.. బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## ఆఫ్ఘన్ బాలుడి సాహసం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**'విపత్కర పరిస్థితులనుంచి ఎలాగైనా ప్రాణాలను కాపాడుకోవాలి. బతికి బట్ట కట్టాలి" ఈ ఆరాటానికి నియమాలు, కట్టుబాట్లు ఇవేవీ గుర్తు రావు.ఈ ధిక్కారమే ఒక ఆఫ్ఘన్ బాలుడి సాహసోపేత చర్యకు దారి తీసింది. ఏకంగా విమానం ల్యాండింగ్ గేర్‌కు వేలాడుతూ ఢిల్లీ దాకా వచ్చేశాడు. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ప్రమాదమని తెలిసినాసాహసానికి పూనుకున్న 13 ఏళ్ల తెగువ ఇపుడు నెట్టింట చర్చనీయాంశంగా నిలిచింది. కాబూల్ నుండి ఢిల్లీకి కామ్ ఎయిర్‌లైన్స్ విమానంలో లో ఆదివారం(సెప్టెంబర్ 22) ఉదయం 11.10 గంటలకు 1.5 గంటల ప్రయాణం తర్వాత ఢిల్లీలో దిగిపోయాడు. విమానం కాబూల్ నుండి ఢిల్లీకి గంటన్నర ప్రయాణం పూర్తిచేసుకుని ల్యాండ్ అయిన తరువాత అధికారులు ఈవిషయాన్ని గ్రహించారు. టాక్సీవేపై నడుస్తున్న బాలుడిని గుర్తించి ఎయిర్‌లైన్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో అధికారులు విస్తుపోయారు. బాలుడ్ని అదుపులోకి తీసుకుని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సహా భద్రతా సంస్థలకు అప్పగించారు.కుందూజ్ ప్రాంతానికి చెందిన ఈ బాలుడు సెక్యూరిటీ కళ్లు గప్పి ఎయిర్‌పోర్ట్‌లోకి చొరబడి విమానం బయలుదేరే ముందు రియర్ సెంట్రల్ ల్యాండింగ్ గేర్‌లోకి ఎక్కి దాక్కున్నట్టు అంగీకరించాడు. అంతేకాదు విమానం అటు ఇటు కుదుపులకు గురైనప్పటికీ వేలాడుతూ అలాగే ధైర్యంగా ఉండిపోయినట్లు చెప్పాడు. అయితే అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా చేరాడు. అయితే మైనర్‌బాలుడు కావడంతో ఎలాంటి చర్యలు లేకుండానే మరో విమానంలో తిరిగి కాబూల్‌కు పంపించివేశారు అధికారులు. గడ్డ కట్టే చలి, తీవ్రమైన గాలులు లాంటి వాతావరణం మధ్య ఆ బాలుడు ఎలా తట్టుకున్నాడు? అల్పోష్ణస్థితి , హైపోక్సియా , అధిక ఎత్తులో తక్కువ వాతావరణ పీడనంతో ఎవరైనా చనిపోవాల్సిందే అని కొందరు, ఇది స్టోరీ మాత్రమే కాదు, ప్రాణాలకు తెగించి పారిపోవాల్సి భయానక పరిస్థితులకు అద్దం అని కొందరు వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే అసత్యపు ఆరోపణలు

- కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే రోడ్లు, గ్యారెంటీలు అమలు
- ఏ గ్రామం అయిన డబుల్ బెడ్ కట్టినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా



**ముత్తారం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** గత 10 సంవత్సరాలు అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు కాంగ్రెస్ చేతిలో అధికారాన్ని అప్పగించారని, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి అనేక అసత్య ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్ర మల్లయ్య ఎక్కువగా అన్నారు. మంగళవారం ముత్తారం మండలం పోతారం గ్రామం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, బీఆర్ఎస్‌పై తీవ్రంగా ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే మచ్చుపేట గ్రామ శివారులోని పుణ్యక్షేత్రానికి రూ.2 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం చేసిన వాస్తవాన్ని ప్రస్తావించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు రూ.8 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని చెప్పుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులను మోసం చేసి ఒక్కో క్వింటాల్ ధాన్యానికి 5 నుంచి 10 కిలోలు కోత పెట్టిన ఘటనలు ఎవరికి తెలియకపోవు అని, ఆ సొమ్ములు ఎక్కడికి పోయాయో అనాటి ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకుల ఇళ్లకు చేరిన విషయం అందరికీ తెలిసిందని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాత ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల గురించి మాట్లాడే అర్హత మీకు లేదని బీఆర్ఎస్ నేతలకు స్పష్టం చేశారు. గత పది సంవత్సరాల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతమంది నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారో, అవి ఎక్కడ కట్టారో చూపించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇసుక మాఫియా ధనదాహానికి చింద్రవతి నది ఒడిపడి, గంగపురి–ఓడేడ్ రోడ్డు ఏనాడైనా పట్టించుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారం రాగానే మంథని–ముత్తారం పడుతున్న దృష్టిలో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు రూ.60 కోట్లతో దాన్ని పునర్నిర్మిస్తున్నారని ప్రస్తావించారు. గత వేసవి పంట కాలంలో ఎండిపోతున్న పంటలను చూడలేక 42 రోజుల పాటు నిరవధికంగా రైతుల పంటలకు నీరు నిరంతరం సరఫరా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే అని, ప్రభుత్వం ఏర్పడి ఇంకా రెండు సంవత్సరాలు పూర్తి కాకుండానే మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీల్లో గృహ జ్యోతి కింద వంటగ్యాస్ రూ.500కి, ప్రతి ఇంటికి విద్యుత్ బిల్లులు 200 యూనిట్ల వరకు ఉచితం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ఓడేడ్ బ్రిడ్జిని 10 సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కనీసం పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే పట్టించుకుని, మరో నెల రోజుల్లో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విషయానికి వస్తే మండలంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించకపోతే మేము రాజకీయ సన్యాసానికి సిద్ధమని, మీరు సిద్ధమా అని బీఆర్ఎస్ నేతలకు హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు 22 నెలలే అయినప్పటికీ మూడు ఇళ్లు ఇచ్చామని, ఇంకా మూడు మూడేళ్లు సమయం ఉందని, సంవత్సరానికి 40 చొప్పున మూడు సంవత్సరాల్లో శ్రీధర్ బాబు అండతో 100కి పైగా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. యూరియా విషయానికి వస్తే అది రాష్ట్ర ఆధీనంలో లేని విషయమని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ యూరియా ఉత్పత్తి తగ్గిందన్న విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు బండ సమ్మయ్య, కాంగ్రెస్ యూత్ నాయకుడు చెల్కల జితేందర్, నెత్తెట్ల భారత లక్ష్మి కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో సిరిగిరి సుపారీ హత్య

## భూమి తగాదాలే కారణం

- సిరిసిల్ల హత్య చేసి వేములవాడలో వదిలేసిన తీరు

**హంతకులు రియల్ బాధితులు : అడిషనల్ ఎస్పీ శేషాద్రిన్ రెడ్డి**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగి వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన సిరిగిరి రమేష్ అదే రియల్ వ్యాపారంలో సుపారి హత్యకు గురైనట్లు వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిన్ రెడ్డి తెలిపారు. ఈనెల 19న సిరిగిరి రమేష్ హత్య చేయబడి మృతదేహం కారులో వేములవాడ నంది కమాన్ వద్ద పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. హంతకుల కోసం దర్యాప్తు చేసిన పోలీసులు హత్య చేసిన చిర్రం రవి,అలా వంశీలను పట్టుకొని రిమాండ్ కు తరలించారు. పోలీసుల వివరాలు ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ కింద సిరిగిరి రమేష్‌కు చందుర్తి మండలంలో పెట్రోల్ బంకు వచ్చింది. దీనిని అదే ప్రాంతానికి చెందిన చిర్రం రవికి ఇవ్వడానికి భూమి బదులుగా ఇవ్వాలని ఒప్పందం చేసుకొని సిరిగిరి రమేష్ భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. కానీ ముందుగా అనుకున్న విధంగా పెట్రోల్ బంకును అప్పగించకపోవడంతో పాటు భూమిని తిరిగి రిజిస్ట్రేషన్ చేయకుండా సదరు భూమిని వేరే వారికి అమ్మకం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగించాడు. ఇక తన భూమి తనకు రావాలంటే సిరిగిరి రమేష్‌ను అంతమొందించాలని నిర్ణయించుకున్న రవి, వంశీతో కలిసి పథకం పన్నాడు. దీనిలో భాగంగానే ఎద్దండి వెంకటేష్, అలా వంశీలకు సూపరి ఇచ్చి పథకం ఈనెల 19న సిరిసిల్లలో పెద్దూరు సబ్ స్టేషన్ సమీపంలో కారు ఆపి, కారులో నిద్రిస్తున్న సిరిగిరి రమేష్‌ను, అలా వంశీ కదలకుండా గట్టిగా కాళ్లు పట్టుకొని ఉండగా, చిర్రం రవి కారు వెనక సీట్లో కూర్చొని సిరిగిరి రమేష్ ను కదలకుండా గట్టిగా పట్టుకోగా, డ్రైవర్ సీట్‌లో కూర్చున్న ఏద్దండి వెంకటేశు వారితో తెచ్చుకున్న కత్తితో సిరిగిరి రమేష్ గొంతులో, చాతిపై పలు మార్లు పొడిచి హత్య చేసినారు. సిరిగిరి రమేష్ చనిపోయడని నిర్ధారించుకొని ఎద్దండి వెంకటేష్ శవాన్ని కారులో తీసుకువచ్చి వేములవాడలోని నంది కమాన్ సమీపంలో గల రమేష్ నిర్వహిస్తున్న నందీశ్వర టౌన్ షిప్ వెంచర్‌లో కారు వదిలిపెట్టి పారిపోయారు. నిదితులు పారిపోతుండగా వేములవాడలోని సాయి రక్షా దాబా సమీపంలో ఏద్దండి వెంకటేష్, అలా వంశీలను కారుతో యుక్తంగా పట్టుకొని వారి వద్ద నుండి ఒక ఇన్నోవా కారును, ఒక మొబైల్ ఫోన్, చంపడానికి ఉపయోగించిన కత్తిని సీజ్ చేసి రిమాండ్ కు తరలించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## గంభీరావుపేటలో జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన నేతలు

**గంభీరావుపేట సెప్టెంబర్ 23 (జనం సాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలో కేజీ టు పీజీ విద్యాలయంలో గంభీరావుపేట క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంభీరావుపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ వేదికకు నాస్కాబ్. కేడిసిసి చైర్మన్ కొండూరి రవీందర్ రావు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం. సెస్ డైరెక్టర్ నారాయణరావు. బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు. ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కొక్కు దేవేందర్ యాదవ్.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హమీద్ బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేష్. టిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాపగారి వెంకటస్వామి గౌడ్. ముఖ్య అతిథులుగా హాజరై జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రికెట్ టోర్న మెంట్‌కు ఆరు జట్లు పాల్గొని క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువతకు క్రీడలు శరీరక మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని దసరా సెలవులలో యువతకు చెడుదారున పడకుండా క్రికెట్ క్రీడను నిర్వహిస్తున్న నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. యువత క్రీడలతో పాటు అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ పార్టీల నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

# ఆయుర్వేదం ఆరోగ్యానికి మేలు చేస్తుంది

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ**



**పెద్దపల్లి,సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** ఆయుర్వేదం ఆరోగ్యానికి మేలు చేస్తుందని లిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ అన్నారు. మంగళవారం ఆయుర్వేద దినోత్సవం అని పురస్కరించుకొని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎం.బి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుర్వేద వైద్య శిబిరంలో లిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ, ఆయుష్ జిల్లా ఇంచార్జి డాక్టర్ జి.ఎన్. అరుణ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ,లి ఆయుర్వేద మెగా వైద్య శిబిరం ద్వారా దాదాపు 470 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. వైద్య శిబిరం నందు కీళ్ల నొప్పులు దగ్గు జలుబు మలబద్ధకం ఆసిడిటీ, బిపి కిడ్నీ లో రాళ్లు వాత రోగులు జ్వరాలు ఆస్తమా దీర్ఘకాలిక వ్యాధులను చూడడం జరిగిందని అన్నారు. ఆయుర్వేద ప్రాముఖ్యత ,వివిధ రకాల మొక్కలు మూలికల గురించి వివరిస్తూ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, శరీరం పైన ఎలాంటి దుష్ప్రభావం చూపదని,ఆయుర్వేదం వైద్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ ప్రోగ్రాం మేనేజర్ ఎస్ విద్యాసాగర్, వైద్యులు మహేష్, అమర్నాథ్, ప్రభాకర్,దివ్య, నిహారిక,మారుతి, శిరీష ఫార్మాసిస్టు లు ఇతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు పటిష్ట కార్యాచరణ

- దశల వారీగా వరి కోతలు జరిగేలా చర్యలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు ట్యాగ్ చేయాలి
- ధాన్యం కొనుగోలు అంశంలో వ్యవసాయ శాఖ పోషించాల్సిన పాత్ర పై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్ డి.వేణు



**పెద్దపల్లి,సెప్టెంబర్ 23(జనంసాక్షి) :** వానాకాలం 2025 సీజన్ ధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు వ్యవసాయ శాఖ పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు అంశంలో వ్యవసాయ శాఖ పోషించాల్సిన పాత్ర పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిఅదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వానాకాలం 2025 సీజన్ పంట కొనుగోలు సమయంలో సన్న రకం ధాన్యానికి కనీసం మద్దతు ధరకు అదనంగా 500 రూపాయల బోనస్ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత కు సంబంధించి ఏమైనా వివాదాలు తలెత్తితే వ్యవసాయ విస్తరణ అధికారులు పరిష్కరించాలని,అదే సమయంలో సన్న రకం ధాన్యం నాణ్యత ను మండల వ్యవసాయ అధికారులు పరిష్కరించాల్సి ఉంటుందని అదనప కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీని తగ్గించుటకు గాని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచనలు ఇస్తూ ఒకే సమయంలో కాకుండా దశలవారీగా వరి కోతలు చేపట్టే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ వరి కోతలు క్రమ పద్ధతిన జరిగేలా చూడాలని, కోతల సమయంలో హార్వెస్టర్లు 18 కంటే ఎక్కువ ఆర్.పి.ఎం నడిచేలా చూడాలని తద్వారా కోతల సమయంలోనే తాలూ చేత వంటి పదార్థాలు ధాన్యం నుండి వేరే చేయవచ్చని అన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ విస్తరణ అధికారికి ట్యాగ్ చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రద్దీ తగ్గించేందుకు రైతుకు టోకెన్లు ఇచ్చి క్రమ పద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా చూడాలని, రైతులు పండించిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఎండబెట్టి టోకెన్ల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని అన్నారు.

కౌలు రైతులు పేద రైతులు చిన్నచిన్న కమతాలను సాగు చేస్తున్న రైతులు, ప్రభుత్వ భూములలో అటవీ భూములలో పంటలు పండించే చిన్న కారు రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వ లేరని, వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ అంశాన్ని పరిశీలించి తగు ధ్రువీకరణ పత్రంతో 50 క్వింటాళ్ల వరకు ధాన్యం కొనుగోలు చేపట్టవచ్చని, 50 క్వింటాళ్ళకు మించి నట్లయితే సంబంధిత మండల వ్యవసాయ అధికారి ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులుపాల్గొన్నారు.

# హౌస్ నెంబర్లు లేని గృహాలను గుర్తించి తొలగించండి

- అధికారులను ఆదేశించిన మున్సిపల్ కమిషనర్ ప్రఫూల్ దేశాయ్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**

నివాస గృహాలు లేకుండా హౌజ్ నెంబర్లు ఉంటే వాటిని గుర్తించి తొలగించాలని కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం రోజు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సెక్షన్ల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశం లో ఆస్తిపన్నుల వసూళ్లు, అండర్ అసెస్మెంట్, అన్ అసెస్మెంట్లు, రెసిడెన్షియల్ ప్రాపర్టీ కన్వర్ట్ కమర్షియల్, యూజర్ చార్జీల వసూళ్లు, రెసిడెన్షియల్ ప్రాపర్టీ విత్ ట్రేడ్ లైసెన్స్, విత్అౌట్ స్ట్రక్చర్ హౌజ్ నెంబర్లు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి సలహాలు సూచనలు చేశారు. వార్డు ఆఫీసర్లు, ఆర్వెల్, ఆర్ ఐలు, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ మాట్లాడుతూ... నగరంలో రెసిడెన్షియల్ ప్రాపర్టిల్లో వ్యాపారం చేస్తుంటే అలాంటి ప్రాపర్టీలను గుర్తించి రెసిడెన్షియల్ నుండి కమర్షియల్‌కు మార్చేలా అధికారులు చర్యలు తీస్కోవాలన్నారు. ఎలాంటి గృహ సముదాయం లేకున్న హౌజ్ నెంబర్లు ఉంటే త్వరగా గుర్తించి వాటి హౌజ్ నెంబర్లను తొలగించాలన్నారు. అలాంటి వాటి పై ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారుల పై చర్యలు తీస్కుంటామని హెచ్చరించారు. డివిజన్లలో వార్డు ఆఫీసర్లు నిర్వహించే విధుల పై ప్రత్యేక దృష్టి సమర్థవంతంగా మీ విధి నిర్వాహణ చేపట్టాలని అన్నారు. 66 డివిజన్లలో వార్డు కార్యాలయాలు అన్ని వినియోగంలోకి రావాలని, వార్డు కార్యాలయాల నుండే ఆఫీసర్లు విధినిర్వహణ చేయాలన్నారు. డివిజన్ వారిగా ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నాయో గుర్తించి వాటి వివరాలను రిజిస్టర్ లో పొందు పరచాలని అన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇల్లీగల్ కన్ స్ట్రక్షన్ చేసి హౌజ్ నెంబర్లు ఉంటే అలాంటి హౌజ్ నెంబర్లను తొలగించాలన్నారు. వాటికి సంబంధించిన వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రాపర్టీ టాక్స్ తో పాటు యూజర్ చార్జీలను కూడ వసూలు చేయాలని, స్వచ్ఛ ఆటోలు చెత్త కలెక్షన్ కొసం సరిగా రావడం లేదని ప్రజల నుండి ఫిర్యాదు వస్తున్నాయని, వార్డు ఆఫీసర్లు స్వచ్ఛ్ ఆటోల పై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నుల టార్గెట్‌ను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. మొండి బకాయి ధారులపై కఠినంగా వ్యవహారించాలని అన్నారు. బాకాయిలు చెల్లించని వారికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి పన్నులు చెల్లించని వారి నల్లా కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాపర్టీల పన్నులు కూడ వసూలు చేయాలన్నారు. డెమాలుషన్ చేసిన ప్రభుత్వ భవనాల హౌజ్ నెంబర్లు ఏమున్నా వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమీషనర్ సందీప్ కుమార్, డీసిపి బషిరొద్దిన్, ఏసిపి వేణు, ఆర్వోలు, ఆర్ఐ లు వార్డు ఆఫీసర్లు, సెక్షన్ క్లర్లులు పాల్గొన్నారు.

# సారధి పోర్టల్ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- తిమ్మాపూర్ ఆర్టిఏ కార్యాలయంలో సారధి పోర్టల్ సేవలు ప్రారంభం
- సారధి పోర్టల్ ద్వారా పొందిన మొట్టమొదటి లర్నింగ్ లైసెన్స్ అందజేసిన ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సారథి పోర్టల్ సేవలను కరీంనగర్ జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ పేర్కొన్నారు. సారథి పోర్టల్ ద్వారా అత్యుత్తమైన సేవలు అందుతాయని, ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం తిమ్మాపూర్‌లోని ఆర్టిఏ కార్యాలయంలో సారథి పోర్టల్ ద్వారా మొట్టమొదటి సారి పొందిన లర్నింగ్ లైసెన్స్ ను ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పడాల రాహుల్ మాట్లాడుతూ... ఇప్పటివరకు లర్నింగ్ లైసెన్సులు, పర్మినెంట్ లైసెన్సులు, ఇతర లైసెన్స్ లో స్లాట్ బుకింగ్ లు టీజీ ట్రాన్స్పోర్టు వెబ్సైట్ ద్వారా జరిగేవని పేర్కొన్నారు. ప్రస్తుతం సారధి పోర్టల్ ద్వారా లర్నింగ్ లైసెన్సులు, పర్మినెంట్ లైసెన్సులు, ఇతర లైసెన్సులకు సంబంధించి సారథి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. http://sarathi.parivahan.gov.in/sarathi services లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని సూచించారు.

లైసెన్సుదారుడు ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉండి ఉద్యోగరీత్యా, ఇతర కారణాల దృష్ట్యా తెలంగాణ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆ వ్యక్తి డైరెక్ట్ గా సారధి పోర్టల్ ద్వారా చిరునామా మార్పు గురించి ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకొని సేవలను పొందవచ్చని పడాల రాహుల్ పేర్కొన్నారు. గతంలో ఆ లైసెన్స్ దారుడు సంబంధిత ఆర్టీవో ఆఫీస్ నుంచి లైసెన్సులకు సంబంధించిన ఎన్వోసీ తీసుకురావాల్సిన అవసరం ఉండేదన్నారు. సారధి పోర్టల్ సేవల వల్ల ఎటువంటి ఎన్ఓసి తీసుకురావాల్సిన అవసరం లేకుండానే సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇందులో భాగంగా కొత్తగా లర్నింగ్ లైసెన్సు తీసుకునేవారు స్లాట్ బుక్ చేసుకునే సమయంలో సంబంధిత డాక్యుమెంట్స్ అప్లోడ్ చేసిన తర్వాత విధిగా ఐదు నిమిషాల నిడివిగల రోడ్డు భద్రతకు సంబంధించిన నియమ నిబంధనల వీడియోను చూడాలని, ట్రాఫిక్ నిబంధన పై అవగాహన పెంపొందించుకోవాలని రాహుల్ సూచించారు. లర్నింగ్ లైసెన్సులు తీసుకునే వారు తప్పకుండా రోడ్డు భద్రత సంబంధించిన నిబంధనలపై కచ్చితంగా అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. తిమ్మాపూర్ ఆర్టిఏ కార్యాలయంలో మంగళవారం రోజు సారథి పోర్టల్ సేవలు ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ రవికుమార్, ఆర్టిఏ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఊపందుకున్న ఆలయ అభివృద్ధి పనులు

**ఈవో కార్యాలయం కూల్చివేత**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులు ఊపందుకుంటున్నాయి. దీనిలో భాగంగా ఆలయ ఈవో కార్యాలయాన్ని మంగళవారం కూల్చివేసారు. రూ 150 కోట్ల నిధులతో రాజన్న ఆలయం, పట్టణ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈవో కార్యాలయంతో పాటు, ప్రసాదాల తయారీ విభాగం, ఓపెన్ స్లాబ్, గోదాం, నివేదన శాలతో పాటు ప్రసాదాల విక్రయ కేంద్రాలను సైతం కూల్చివేస్తారు. 1991 సంవత్సరంలో ఈవో కార్యాలయాన్ని నిర్మించారు. 1994 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, లక్ష్మీ పార్వతి రాజన్న ఆలయానికి వచ్చిన సందర్భంలో ఈవో కార్యాలయంలో గెస్ట్ హౌస్‌ను ఏర్పాటుచేశారు. అప్పటినుండి ఆ గెస్ట్ హౌస్‌ను ఎన్టీఆర్ గెస్ట్ హౌస్ అని పిలుస్తున్నారు. ప్రస్తుత కూల్చివేత పనుల్లో ఎన్టీఆర్ గెస్ట్ హౌస్ నేల మట్టమైనది.

### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్

# సందీప్ కుమార్ ఝాపై చర్యలు తీసుకోవాలి


**కలెక్టరేటును ముట్టడించిన బీసీ సంఘాల నాయకులు**




**రుద్రంగి సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను అవమానించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రుద్రంగి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలనికి బీసీ సంఘాల నాయకులు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో బీసీ సంఘాల ప్రతినిధులు కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తూం జలపతి మాట్లాడుతూ... ఈ నెల 17న సిరిసిల్లలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమానికి సకాలంలో హాజరు కాకపోవడమే కాకుండా, జాతీయ గీతాలాపన జరుగుతున్న సమయంలో పెద్దగా సైరన్ వేసుకుని వచ్చి కలెక్టర్ ప్రొటోకాల్ ఉల్లంఘించారని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీసీ బిడ్డ అయినందునే ఆయనకు ప్రొటోకాల్ ప్రకారం స్వాగతం పలకలేదని మండిపడ్డారు. కలెక్టర్ ఉద్దేశపూర్వకంగా బీసీ బిడ్డను అవమానించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పై చర్యలు తీసుకోవాలని కోరారు.

# చెత్తను రోడ్లపై వేసినచో జరిమానా విధిస్తాం

**మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**



**జమ్మికుంట, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎఫ్.సి.ఐ ప్రాంతంలో చెత్తను వేస్తున్నారని అటువంటి వారికి భారీ జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రతి వార్డుకు నిత్యం సూపర్ క్యారీ వ్యాన్లు, ట్రాక్టర్లు, ప్రతి రోజు వార్డులకు వస్తాయని కానీ ప్రజలు గమనించక రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తూ దోమలు ప్రబలడానికి కారకులు అవుతున్నారని పర్యావరణాన్ని పాడుచేస్తున్న వారిపై మున్సిపల్ సిబ్బంది కటినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. మున్సిపాలిటీలో ప్రజలు అందరూ చెత్తను ఆరుబయట పారవేయకుండా మున్సిపల్ వాహనానికి అందిస్తున్నారని కొంతమంది మాత్రమే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఎఫ్.సి.ఐ. ప్రాంతంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించి జరిమానా బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రతి రోజు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సిపాయిలుగా పని చేస్తున్న చెత్తను రోడ్లపై వేయడం వల్ల పర్యావరణం కాలుష్యం అయి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు గమనించి చెత్తను మున్సిపల్ వాహనానికి అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్, ఈఈ శ్రీకాంత్, పారిశుధ్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

# శాస్త్రీయంగా ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంటు ఉండాలి

- భూనిర్వాసితులకు అండగా సీపీఐ(ఎం) : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ



**హైదరాబాద్, సెప్టెంబరు 23 (జనంసాక్షి) :**
రాష్ట్రంలో ఆయా ప్రాజెక్టుల మూలంగా భూమిని నష్టపోయే నిర్వాసితులకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. రాష్ట్ర, జాతీయ రోడ్ల ప్రాజెక్టుల తోపాటు ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణం సందర్భంగా భూములను కోల్పోయే బాధితులను ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని ప్రకటించారు. మంగళ వారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్లో ఆర్‌ఆర్‌ఆర్ ప్రభావిత జిల్లాలు, మండలాల సీపీఐ(ఎం) నాయకులతో సమావేశం నిర్వహించారు. దీనికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, తెలంగాణ రైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి టీ సాగర్ అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఈసందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆయా ప్రాజెక్టులు, పథకాలను అమలుచేస్తున్న సందర్భంగా అత్యధికంగా భూసేకరణ చేస్తున్నాయన్నారు. దీనిమూలంగా పేద ప్రజలు, రైతులు తమకున్న కొద్దిపాటి భూములను కోల్పోవాల్సి వస్తున్నదని చెప్పారు. రైతులు బలవంతంగా భూములు తీసుకుంటే సహించబోమన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్మెంటు శాస్త్రీయంగా జరగాలని చెప్పారు. నిర్వాసితులు సమస్యలు తెలుసుకుని ఉద్యమించనున్నట్టు తెలిపారు. రైతులు, స్థానిక పేదలకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ సమావేశానికి ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ బాధిత 8 జిల్లాల నుంచి సీపీఐ(ఎం) నాయకులు హాజరయ్యారు. యాదాద్రి భువనగిరి, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్నగర్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ తదితర జిల్లాల్లోని 22 మండలాల నుంచి నాయకులు సమావేశానికి వచ్చారు. ఈసందర్భంగా స్థానిక భూసేకరణ వ్యవహారంపై చర్చించారు.

**భూనిర్వాసితుల కోసం పోరాటం : మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి**
ఆర్‌ఆర్‌ఆర్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనం కోసం చూస్తున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలి. భూసేకరణ సందర్భంగా వేలాది ఎకరాలు నష్టపోతున్న రైతులు, పేదల ప్రజల తరపున సీపీఐ(ఎం) పోరాటం చేస్తుంది, ఈ ప్రాజెక్టు కోసం 45 వేల ఎకరాల భూమితోపాటు రూ.22 వేల కోట్లు అవసరవముతాయని అధికారులు చెబుతున్నారు. భారీస్థాయిలో రైతుల భూములను తీసుకోవడం ఎంతమాత్రం సరికాదు. రైతుల ప్రయోజనాల కోసం సీపీఐ(ఎం) పోరాడుతుంది,

**చట్ట ప్రకారమే భూసేకరణ చేయాలి : టి సాగర్**
ఆర్‌ఆర్‌ఆర్తోపాటు ఇతర ప్రాజెక్టుల కోసం చట్ట ప్రకారమే భూసేకరణ చేయాలి. పర్యావరణం గురించి పట్టించుకోవాలి. ప్రభుత్వం కోసం చేస్తే 70 శాతం రైతులు, ప్రజలు ఒప్పుకోవాలి. ప్రయివేటు కోసం చేస్తే 80 శాతం అంగీకరించాలి. ప్రభుత్వ భూమిని అయినా పట్టా భూమితో సమానంగా ఖాస్తులో ఉండే రైతులకు పరిహారమివ్వాలి. భూసేకరణను అడ్డుకుంటే కేసులు పెట్టడం ఎంతమాత్రం సరికాదు.

**ప్రభుత్వ భూములే తీసుకోవాలి : సారంపల్లి మల్లారెడ్డి**
ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వ భూములే తీసుకోవాలి. రైతులు, పేదలని ముట్టుకోవద్దు. 2013 భూసేకరణచట్టాన్ని అమలుచేయాలి. పరిహారం విషయంలో రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు. రాష్ట్రంలో 25 లక్షల ఎకరాల భూమి ఉంది. వాటిని అభివృద్ధి కోసం వాడుకోవాలి.





## ఖమ్మం అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా బి రామానుజం

**ఖమ్మం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** ఖమ్మం అడిషనల్ డీసీపీ అడ్మిన్‌గా బి. రామానుజం భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్క అందజేశారు.

అదేవిధంగా ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

# పోలీసుల చాకచక్యం.. హత్య కుట్ర భగ్నం





**రాజేంద్రనగర్, సెప్టెంబర్23(జనం సాక్షి) :**
ఒక వ్యక్తిని హత్య చేస్తే రూ.9 లక్షలు సుపారీగా పథకం వేసి, హత్య చేయడానికి కుట్రను మైలార్ దేవ్ పల్లి పోలీసులు భగ్నం చేశారు. మైలార్ దేవ్ పల్లి ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపిన ప్రకారం వట్టిపల్లికి చెందిన ఇమ్రాన్ ఖాన్(43) పాత వాహనాలను కొని అమ్మే వ్యాపారం చేసేవాడు.కానీ వారి వ్యాపారంలో వివాదం కారణంగా వారు విడిపోయారు. ఒక సంవత్సరం క్రితం, షేక్ అమెర్, మహమ్మద్ సోహైల్ మరికొందరు ఇమ్రాన్ ఖాన్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో అతని ఇంటిపై దాడి చేశారు. మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు షేక్ అమెర్, మొహమ్మద్ సోహైల్, ఇతరులను అరెస్టు చేసి జైలుకు పంపారు. అయితే, పాత గొడవల ను దృష్టిలో ఉంచుకుని వట్టిపల్లికి చెందిన వ్యక్తి తనను చంపడానికి ప్రయత్నించాడని ఇమ్రాన్ ఖాన్ అనుమానించినప్పుడు గత కొన్ని రోజులుగా తనను మళ్ళీ మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ఇమ్రాన్ ఖాన్ ఇబ్రహీం అనే వ్యక్తికి ఎలాగైనా చెప్పాలని చెప్పాడు. ఇబ్రహీం, తనకు తెలిసిన సైఫ్, శ్రీరామ్, షాబాజ్, షాయాబ్ , బవాజీర్‌లతో కలిసి 21-09-2025న బార్కాస్‌లోని పొలాలకు వెళ్లాడు. వారిని స్మశానవాటికకు పిలిపించి జరిగిన విషయం చెప్పి, కుట్ర పన్ని ఆ వ్యక్తిని చంపితే, మాకు రూ. 9 లక్షలు సుపారీ గా ఇస్తానని చెప్పాడు. మొదట, అతను 5 మంది సభ్యులకు అడ్వాన్స్‌గా 60 వేల రూపాయలు, అతనిని గుర్తించడానికి నాలుగు కత్తులు, ఆ వ్యక్తి ఫోటో ఇచ్చి, పని పూర్తయిన తర్వాత మిగిలిన డబ్బు ఇస్తానని చెప్పాడు. తరువాత, ఇమ్రాన్ ఖాన్ ఇచ్చిన డబ్బు నుండి, బ్రహీం తలపై 10 వేల రూపాయలు అందరికీ పంచాడు. అప్పుడు శ్రీరామ్ ఫలక్‌నామాలోని పోలీసు విభాగంలో తాను హోమ్ గార్డ్‌గా పనిచేస్తున్నానని చెప్పాడు. పోలీసులు తనను కొట్టకుండా చూసుకుంటానని, ఏదైనా కేసు తలెత్తితే, కేసు నుండి బయటపడే మార్గం చూపిస్తానని చెప్పాడు. తరువాత, వారి పథకం ప్రకారం, 22.09.2025న, వారు అది వట్టిపల్లిలోని నైస్ హోటల్‌కు వస్తుందని తెలిసి, కత్తులతో అతనిపై దాడి చేసి చంపాలని ప్లాన్ చేశారు. వారు మంగళవారం రాత్రి 07.30 గంటల ప్రాంతంలో మోటార్ సైకిళ్లపై వట్టిపల్లిలోని నైస్ హోటల్ వద్దకు వచ్చి ఆ వ్యక్తి కోసం వేచి ఉన్నారు. పోలీసులు వారిని పట్టుకున్నప్పుడు, వారు వారిని వెంబడించి ఇద్దరిని అరెస్టు చేశారు మొహమ్మద్ సైఫ్(21) నేనావత్ శ్రీరామ్(35) ఫలక్‌నుమా, నేరస్తుల నుంచి 2 పదునైన కత్తులు,3 మొబైల్ ఫోన్లు, 2బైక్ లుగా, యాక్టివా, ప్యాషన్ ప్రో బైక్ యాసీన్ ఖాన్ కలర్‌ఫోటో, నికర నగదు రూ.10వేలు నగదును స్వాధీనం చేసుకుని, వారి ద్వారా ఈ సుపారీకి ప్రధాన సూత్రధారి అయిన ఇమ్రాన్ ఖాన్‌ను అతని ఇంట్లో పట్టుకుని, అతని నుండి ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో యాసీన్‌ఖాన్ ఫోటోలను ఇబ్రహీం వాట్సాప్‌కు పంపారు.ఈ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మక్సూద్, ఎస్ఐ పైడి నాయుడు, ఎస్ఐపి విశ్వనాథ్ రెడ్డి, పిసిలు వేణుగోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వంశీ కృష్ణ, ముక్తార్ తీర్పు ప్రకారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## బతుకమ్మ కుంటలో హైడ్రా కమిషనర్ బోటు షికారు

26 నాటికి సర్వాంగసుందరంగా మారాలంటూ ఆదేశం



**హైదరాబాద్, సెప్టెంబరు 23 (జనంసాక్షి) :** బతుకమ్మకుంటను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం రాత్రి సందర్శించారు. ఈ నెల 26న జరగనున్న బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ కుంటను నగర ప్రజలకు అంకితం ఇవ్వనున్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. 26 నాటికి బతుకమ్మ కుంటతో పాటు పరిసరాలు సర్వాంగ సుందరంగా మారాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు కూడా బతుకమ్మకుంటను సందర్శించి.. హైడ్రా పని తీరును ప్రసంశించారు. బతుకమ్మ కుంటను చూస్తుంటే.. ఇది కలా నిజమా అనేది అర్థం కావడంలేదని స్థానికులు ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుని.. ఈ బాధ్యతను హైడ్రాకు అప్పజెబితే.. ఆ పనిని విజయవంతంగా పూర్తి చేసిందని కొనియాడారు. తర్వాత బతుకమ్మ కుంటలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బోటులో విహరించారు. హైడ్రా అడ్మిన్ ఎస్.పి ఆర్. సుదర్శన్, వి. హనుమంతరావు కూడా కమిషనర్‌తో పాటు విహరించినవారిలో ఉన్నారు.

**తప్పిన పెను ప్రమాదం**

“ రంగారెడ్డి : మైలార్‌దేవ్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఘోర ప్రమాదం తప్పింది. ఓల్డ్ టైర్స్ స్క్రాప్ లోడ్‌తో నిండి ఉన్న డీసీఎంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు స్క్రాప్ యజమాని పేర్కొన్నారు. స్థానికుల అప్రమత్తతతోనే పెను ప్రమాదం తప్పిందన్నారు. ”

# ఆగి ఉన్న కారులో దాడి, దోపిడీ

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 23(జనం సాక్షి) :** ఆగి ఉన్న కారులోని వ్యక్తులపై దాడి, దోపిడీ జరిగిన సంఘటన నర్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నార్సింగ్ పోలీసులు తెలిపిన ప్రకారం 23.09.2025న, బోరబండ కు చెందిన సునీల్ భాస్కర్, ఫోటోగ్రఫీ ఎడిటింగ్ చేస్తూ జీవనం గడుపుతున్నాడు. కింగ్ టేబుల్ రెస్టారెంట్ దగ్గర, బోరబండ, మాదాపూర్, ఈనెల 22రాత్రి 11 గంటలకు గౌలిదొడ్డి నుండి కోకాపేటలోని మూవీ టవర్స్ వైపు తన స్విఫ్ట్ డిజైర్ కారు (ఎపి39సిఎల్3355)లో వెళుతున్నానని పేర్కొన్నాడు. అతను సత్వ భవనం సమీపంలోకి రాత్రి 11:30 గంటలకు చేరుకోగానే, కారు అకస్మాత్తుగా పాడైందనీ, వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, తన సోదరుడు శేఖర్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అతను కారులో కూర్చుని ఉండగా, దాదాపు 11:55 గంటలకు, రెండు వాహనాలపై ఆరుగురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, ఫిర్యాదుదారుడి కారును చుట్టుముట్టి, వారిని బెదిరించి, వాహనాన్ని ఢీకొట్టి, అతని నుండి 10 గ్రాముల బంగారు గొలుసు, ఐఫోన్ 13 ను బలవంతంగా లాక్కొని, అతనిని కొట్టారు. ఆ తర్వాత నిందితులు సత్వ భవనం వైపు పారిపోయారని ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపడుతున్నారు.

## కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రూ. 5 లక్షల విలువ చేసే గంజాయి పట్టివేత

**హైదరాబాద్ :** కాచిగూడ రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరి నుంచి రూ. 5.42 లక్షల విలువ చేసే 10.8 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న వారిని ఎం అర్జున్(18), వీ శ్రీనివాస్(20)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరు రంగారెడ్డి జిల్లాకు చెందిన వారని తెలిపారు. ఒడిశాలోని బెర్హాంపూర్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు రైల్లో గంజాయి తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడకు ఎంఎంటీఎస్ రైల్లో ప్రయాణించగా, వారిద్దరిని ఇక్కడే అరెస్టు చేశారు. పట్టుబడ్డ ఇద్దరు యువకులు కూడా మత్తు పదార్థాలకు బానిసలుగా మారినట్లు తేలింది.

# తాగునీటి సరఫరాలో అంతరాయం



**హైదరాబాద్, సెప్టెంబరు 23 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2లో కలబ్ గూర్ నుంచి హైదర్ నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం దయా పీఎస్సీ పంపింగ్ మెయిన్ కు వివిధ ప్రాంతాల్లో భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు నేడు ఉదయం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్ తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు :** 1. ఓ అండ్ ఎం డివిజన్ 17: ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, 2. ఓ అండ్ ఎం డివిజన్ 22: బీరంగూడ, అమీన్ పూర్, 3. ట్రాన్స్ మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు, 4. ఓ అండ్ ఎం డివిజన్ 6: ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్, 5. ఓ అండ్ ఎం డివిజన్ 9: కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ ప్రగతి నగర్. కాబట్టి పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోగలరని కోరారు.



## సెయింట్ జార్జ్ పాఠశాలలోబతుకమ్మ మహోత్సవం

**సెయింట్ జార్జ్ పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి, ఝాన్సీరెడ్డి**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
విద్యానగర్‌లోని స్థానిక సెయింట్ జార్జ్ పాఠశాలలో (నినోస్ బ్లాక్) మంగళవారం బతుకమ్మ మహోత్సవమును పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ డాక్టర్ పి. ఫాతిమా రెడ్డి, ఆయన సతీమణి ఝాన్సీ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణ ఆడపడుచుల పూల పండుగ బతుకమ్మ పండుగ అని పూలతో తయారు చేసిన బతుకమ్మను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడవచ్చని అన్నారు. ఇట్టి కార్యక్రమాన్నికి ముఖ్య అతిధులుగా శ్రీలత సిఐ మహిళా పోలీస్ స్టేషన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీదేవి, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ కోడూరి శ్రీవాణి, అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ రజిత, ప్రముఖ రచయిత్రి తోట నిర్మలరాణి, సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నం రజితరెడ్డి, విద్యార్థి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ముంపు సమస్యను పరిష్కరించండి

- నాలాలను విస్తరించాలంటూ విజ్ఞప్తులు
- హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 (జనంసాక్షి) :** భారీ వర్షాలు కురుస్తున్న వేళ హైడ్రా ప్రజావాణికి నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నాలాలు ఆక్రమణలకు గురై వరద నీరు సాఫీగా సాగక తమ నివాస ప్రాంతాలు నీట మునుగుతున్నాయని పలువురు మంగళవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. చెరువులను అనుసంధానం చేస్తూ సాగే నాలాలు కబ్జాలకు గురి అవ్వడంతో పైనుంచి వచ్చిన వరద నేరుగా చెరువుకు వెళ్లకుండా.. కాలనీలను ముంచెత్తుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. ఇలా మంగళవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులు వస్తే.. ఇందులో 30కిపైగా నాలా ఆక్రమణలు, వరద ముంపునకు సంబంధించినవి ఉన్నాయి.

చెరువుల తూములు మూసేయడంతో పైన ఉన్న కాలనీలు నీట మునుగుతున్నాయని పలువురు ఫిర్యాదులు చేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ విలేజ్‌లో బందంకొమ్ము చెరువు నాలాను డైవర్ట్ చేయడం వల్ల వరద సాఫీగా సాగక దాదాపు 8 కాలనీలు వరదతో ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు పెద్దమొత్తంలో వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ పరిశీలించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికా రులకు అప్పగించారు. కొన్ని చోట్లకు తాను వచ్చి పరిశీలిస్తామని ఫిర్యాదుదారులకు హామీ ఇచ్చారు.

# దుద్దిళ్ల శ్రీధర్‌కు ఎదురులేకుండా చేయడమే ప్రజాస్వామ్యమా..?

- ఏం తప్పు చేశానని ఎన్ టీవీ తనపై అసత్య ప్రచారం చేస్తోంది
- ప్రభుత్వం...పాలకుల మెడలు వంచేలా మీడియా పనిచేయాలి
- 22నెలలైనా సొంతూరిలో రెండు ఇళ్లు కట్టించని ఎమ్మెల్యేపై స్టోరీలు చేయండి
- మీట్ ద ప్రెస్‌లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, సెప్టెంబరు 23 (జనంసాక్షి) :**
నియోజకవర్గంలో కొన్ని మీడియా సంస్థలు ప్రత్యేక పరిస్థితులు సృష్టిస్తు మంథని ఎమ్మెల్యేకు ఎదురులేకుండా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నాయని, ఇదేనా ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా పాత్ర అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథనిలో మీడియా సంస్థలు తనతో ఎన్నికల్లో పోటీ పడాలనుకుంటున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతుందన్నారు. .దుద్దిళ్ల శ్రీధర్ ప్రోద్భలంతో కొన్ని మీడియా సంస్థలు తనకు వ్యతిరేకంగా కథనాలు ప్రచారం చేస్తున్నాయని, తాను కనబడటం లేదని ప్రజలకు మోహం చాటేస్తున్నానని కొన్ని మీడియా సంస్థలు తప్పుడు కథనాలు ప్రసారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఏం తప్పు చేశానని తనపై ఎన్‌టీవి అసత్య ప్రచారం చేస్తుందని ప్రశ్నించారు. మీడియా సంస్థలు ప్రభుత్వం, పాలకుల మెడలు వంచేలా పని చేయాలే తప్ప ఒక గరీబు బిడ్డ పైకి వస్తే ఎలా అణిచివేయాలని చూడటం కాదన్నారు. స్టోరీలు రాయాల్సి వస్తే మూడు సార్లు మంత్రిగా అయిన శ్రీధర్‌పై తయారు చేయాలని ఆయన సూచించారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా మంథనికి ఏమీ చేయని దద్దమ్మ శ్రీధర్ అని ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలు 40ఏండ్లుగా ఓట్లు వేసి అధికారం ఇస్తే ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి ఒక పరిశ్రమ, ప్యాక్టరీ, ఇండస్ట్రీ తీసుకురాలేదని, ఓ పదిమందికి ఉద్యోగాలు పెట్టించలేదని ఆయన విమర్శించారు. మంథనిలో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడాన్ని సైతం తప్పు పడుతున్నారని, తమ సొంత ఖర్చులతో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకుని ఆవిష్కరణకు ఏర్పాట్లు చేసుకుంటే రాత్రికి రాత్రే దొంగల్లా వచ్చి ముసుగు తొలగించారని, అది తప్పు కాదా దానిపై ఎందుకు స్టోరీ చేయలేదని ప్రశ్నించారు. ఆనాడు శ్రీధర్ తండ్రి నక్సలైట్ల పేరిట జనాలను చంపిస్తే ఈనాడు శ్రీధర్ పోలీసులతో చంపిస్తున్నాడని అన్నారు. ఎమ్మెల్యే సొంతూరు ధన్వాడ ప్రజల ఆశీర్వాదంతో 40ఏండ్లుగా అమెరికాలో ఉంటున్న దుద్దిళ్ల కుటుంబం సొంతూరిలో స్కూల్‌కు ఒక్క బేంచీ ఇవ్వలేదని, ఇందిరమ్మ పథకంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రెండు ఇండ్లు కూడా పూర్తి చేయలేదన్నారు.

ఇలాంటి దానిపై కథనాలు రాయాలే తప్ప తాను ఏం చేశానని దాడి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఒక్కసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తికి రెండోసారి టికెట్ రాకుండా దుద్దిళ్ల శ్రీధర్, ఆయన తండ్రి చేసేవారని, కానీ తమ అధినేత కేసీఆర్ తనకు మూడుసార్లు అవకాశం ఇచ్చాడని అన్నారు. మంథని నియోజకవర్గంలో శ్రీధర్ ఒక్కడే రాజకీయాల్లో ఉండాలని కొన్ని మీడియా సంస్థలు పని చేస్తుండటం భాదాకరమని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు.

## మిడ్ మానేరు నిర్వాసితుల
# సమస్యలపై వీడని నిర్లక్ష్యం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- మొన్న చీర్లవంచ నేడు అనుపురం నిర్వాసితుల కేసు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :**
మిడ్ మానేరు ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వాసితులు తమకు రావాల్సిన పరిహారం కోసం అధికారులు,ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులను లెక్కచేయని అధికారులపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మొన్న చీరలవంచ గ్రామానికి చెందిన నిర్వాసితుని కేసు విషయంలో, తాజాగా వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన నిర్వాసితుల స్థలాలు కేసు విషయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.కలెక్టర్‌కు డ్రెస్సింగ్ సెన్స్ లేదు. ఆయనను చూస్తే మాకే భయంగా ఉంది. ప్రజలకు ఎలా సేవ చేస్తారని హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి వనపట్ల కవితకు సంబంధించిన పరిహారం అందలేదు.ఈ విషయంలో అధికారుల చుట్టూ తిరిగిన న్యాయం జరగకపోవడంతో గతంలో హైకోర్టును ఆశ్రయించింది. కవితకు రావలసిన పరిహారం చెల్లించాలంటూ హైకోర్టు గతంలో తీర్పు వెల్లడించింది. ఈ క్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు కవితపై కేసు నమోదు చేసిన సంఘటన ఉంది. కాగా తనకు రావాల్సిన పరిహారం చెల్లించాలని అధికారులు పరిహారం అందించలేదని కవిత మరో హైకోర్టును ఆశ్రయించడంతో కలెక్టర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హోమ్ సెక్రటరీకి ఆదేశం జారీ చేసింది. గతంలో బాధితురాలికి ఇచ్చిన నష్టపరిహారం తీర్పు యధావిధిగా అమలు చేయాలని ప్రభుత్వానికి, సీఎస్‌ను ఆదేశించింది. కాగా మరో కేసును చీరలవంచ గ్రామానికి చెందిన నిర్వాసితునికి కోర్టు, ప్రయాణం ఖర్చులు చెల్లించాలని ఆదేశించిన కలెక్టర్ చెల్లించడం లేదని మరోసారి కోర్టును ఆశ్రయించగా కలెక్టర్కు వారెంట్ జారీ చేసింది. హైకోర్టు ఆదేశించినా నష్టపరిహారం చెల్లించకపోవడంతో పాటు ఆర్డీవో, ఎమ్మార్వోలకు చెప్పి కవితపై కలెక్టర్ అక్రమ కేసులు నమోదు చేయించాడు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
24 సెప్టెంబర్ 2025

# కామారెడ్డి వరద నష్టంపై రీ-సర్వే చేయాలి

- సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన
- కేంద్రం ఇచ్చిన నిధులనే వాడుకుంటున్న రాష్ట్రం
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎంపి అర్వింద్




**నిజామాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** కామారెడ్డిలో వరద నష్టం అంచనాపై రీ సర్వే చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. కామారెడ్డిలో వరద నష్టానికి ఒక్క పైసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటోందని గుర్తుచేశారు. మాధవనగర్, మామిడిపల్లి, అర్సపల్లి రైల్వే బ్రిడ్జిల కోసం బీజేపీ ఉద్యమాలు చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మూడు ప్రాంతాల్లో ఆందోళనలు చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరద నష్టం నిధులను ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర వేషాలు వేస్తోందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. మంగళవారం నిజామాబాద్‌లో అర్వింద్ మీడియాతో మాట్లాడారు. కామారెడ్డిలో వరద నష్టం ఇవ్వకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే చిల్లర వేషాలనూ కాంగ్రెస్ కూడా వేస్తోందని ధ్వజమెత్తారు. నిజామాబాద్‌లో టీ-పీసీసీ అధ్యక్షులు, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా పెండింగ్ పనులకు నిధులు ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని.. ఆల్మట్టి పెంపుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తేల్చుకోవాలని ఎంపీ ధర్మపూరి అర్వింద్ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. ప్రత్యామ్నాయంగా తెలంగాణలోని ప్రజలు నమ్మకంతో బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. రైతు బంధు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్షలాది మంది రైతులకు ఏ ఒక్కసారి ఆపకుండా పీఎం కిసాన్ యోజన నిధులు జమ చేస్తున్నారని స్పష్టం చేశారు. రిటైర్‌మెంట్ డబ్బులు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు, ఉద్యోగులు నేడు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పాలన వైపు చూస్తున్నారని వెల్లడించారు. కార్యకర్తలు కలిసి కట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని దిశానిర్దేశం చేశారు.

# లాభాల వాటాతో కార్మికులకు నష్టం

- జాగృతి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత



**శ్రీరాంపూర్ (జనంసాక్షి) :** సింగరేణి కార్మికులకు ప్రభుత్వం ప్రకటించని 34శాతం లాభాల వాటా వలన కార్మికులకు నష్టం జరగిందని శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియం హెచ్ఎంఎస్,జాగృతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత అన్నారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ తల్లి చేతులనుంచి బతుకమ్మను కాంగ్రెస్ ప్రభుత్వం తీసేసిందని,లాభాల వాటాలో ఒక్కో సింగరేణి కార్మికుడికి లక్ష రూపాయల వరకు నష్టం కలిగిందని,కార్మికులను కాపాడుకుంటే సింగరేణి సంస్థకు భవిష్యత్తు ఉంటుందని, సింగరేణి సంస్థ లాభాల్లో అభివృద్ధి పనుల వాటా తీసేసి మిగిలిన దానిలో వాటా ఇవ్వటమేమిటని,మొత్తం గ్రాస్ లాభాల మీద కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలని అన్నారు.సింగరేణి సంస్థకు ప్రభుత్వం బకాయి పెట్టిన 43 వేల కోట్లు ప్రభుత్వం నుంచి సంస్థ రాబట్టుకోకుండా, సింగరేణిలో కొత్త బొగ్గ గనులు ఏర్పాటు చేయక కర్ణాటక లో బంగారు గని,మరోచోట రాగి గని అని వాటిని తవ్వేందుకు డబ్బులు లేవంటూ సింగరేణి సంస్థ ఎల్ఐసీ ని రూ.3వేల కోట్లు అప్పు అడుగుడు అంటే పద్దతి ప్రకారం సంస్థను దివాళా తీయించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణికి ప్రభుత్వం బకాయి పడ్డ 43 వేల కోట్లను వెంటనే చెలించాలని అన్నారు.తెలంగాణ రాకముందు నుంచి సింగరేణి కార్మికుల కోసం పోరాడుతున్నాని,రాష్ట్రం కరువులో ఉన్నపుడు అన్నం పెట్టింది సింగరేణి అని అన్నారు.తెలంగాణ వచ్చాక డిపెండెంట్ ఉద్యోగాలను మళ్లీ సాధించుకున్నామని, ఏటా ఐదు నూతన బొగ్గ గనులు ప్రభుత్వం తెరవాలని, సింగరేణి విషయంలో రాజకీయం జోక్యం ఉండొద్దని,సింగరేణి బెల్ట్ మొత్తం కాంగ్రెస్ నాయకులే గెలిచి కార్మికులకు మంచి చేయకపోగా రౌడీయిజం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఇలాగే చేస్తే వచ్చేసారి కాంగ్రెస్ ప్రతిపక్షంలో కూర్చుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రీయాజ్ అహ్మద్, యూనియన్ నాయకులు తిప్పారపు సారయ్య,అనిల్ రెడ్డి,జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ చారి,మహిళలు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే బీర్కూర్ అభివృద్ధి

- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



**నిజామాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** గత ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే బీర్కూర్‌ను అభివృద్ధి చేశానని ప్రస్తుత ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గతంలో ఎన్నో విధాలుగా నియోజకవర్గానికి నిధులు తీసుకుని వచ్చానని అన్నారు. బీర్కూర్ ఎస్సీ వాడలో రూ.65 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. సొంత స్థలాలు ఉన్నవారు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు బోనస్ ఇచ్చే ఆలోచనలో ఉందని చెప్పారు. ఆగ్రో ఛైర్మన్ కాసుల బాల్ రాజ్, సొసైటీ- ఇన్‌ఛార్జి ఛైర్మన్ రాములు, శంకర్, శశికాంత్, రాములు, కాంతు రెడ్డి, బస్వరాజ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

# గోడకూలి తండ్రీకూతుళ్ల మృతి



**నిజామాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గోడ కూలి తండ్రి, కుమార్తె మృతి చెందారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు-చేసుకుంది. ఇంటి పక్కనే ఉన్న రైస్‌మిల్ గోడ కూలి వీరు నివాసం ఉంటున్నన రేకుల షెడ్డుపై పడింది. దీంతో షెడ్డులో నిద్రిస్తున్న ఇందూరు మహేష్ కుమార్, నెలల వయసు ఉన్న చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. చిన్నారి తల్లి మహేశ్వరికి తీవ్ర గాయాలు కాగా.. స్థానిక ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రైస్‌మిల్ గోడ పూర్తిగా తడిసిపోయి కూలినట్లు స్థానికులు చెబుతున్నారు.

# నల్గొండ ఎప్పటికీ కాంగ్రెస్ అడ్డానే

- కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలం: కోమటిరెడ్డి



**నల్లగొండ, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలయ్యిందని అది మునిగిపోయే నావ అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్గొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన.. నల్గొండ జిల్లాలో ఓ నాయకుడు ఉన్నాడు.. ఎప్పుడూ గెలిచిన రెండు వేల లోపు మెజార్టీనే ఇక మళ్ళీ గెలవడని జగదీష్ రెడ్డిని ఉద్దేశించి సెటైర్ వేశారు. నల్గొండ గడ్డ కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.. కాంగ్రెస్ కండువా మోసే నిఖార్సైన కార్యకర్తలే పార్టీకి బలం అని చెప్పారు. 30 ఏళ్లుగా తనను అక్కున చేరుకున్న కార్యకర్తలకు ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేనన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేర్చే బాధ్యత కార్యకర్తలదేనని చెప్పారు. గ్రామీణ రోడ్లు అన్ని డబుల్ రోడ్లుగా మారుస్తా .. విద్యా,వైద్యంలో ఇంకా మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా వంద శాతం కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు.

# చార్మినార్ వద్ద బీజేపీ బతుకమ్మ

- పాల్గొన్న బిజెపి నేతలు, నటి ఖుష్బూ



**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో పార్టీ శ్రేణులు, ప్రజలు, సాంస్కృతిక ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వేడుకలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, తమిళ్‌నాడు బీజేపీ నేత, సినీ నటి కుష్బూ, మాజీ మంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి పాల్గొన్నారు. చార్మినార్ ప్రాంగణంలో పూలతో అలంకరించిన బతుకమ్మ ఆడిపాడారు. బతుకమ్మ పాటల కార్యక్రమాలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, పిల్లలు సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ నృత్యం చేసి, పండుగ జరుపుకున్నారు. ఈ వేడుకల్లో కుష్బూ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలను వినియోగించుకోవాలి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- రాజేంద్రనగర్లో ని కేంద్ర పరిశోధన సంస్థలను సందర్శించిన రైతు కమిషన్ బృందం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాజేంద్రనగర్ లోని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకోవడం లేదన్నారు రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి. రైతులకు, వ్యవసాయ అధికారులకు అనేక రకాల శిక్షణ కార్యక్రమాలు జాతీయ పరిశోధన కేంద్రాల్లో ఇస్తున్నట్లు తెలిపారు. మాజీ ప్రధాని మన్ మోహన్ సింగ్ హాయాంలో వీటిని ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. రైతు కమిషన్ సభ్యులు, అధికారులతో కలిసి చైర్మన్ కొదండరెడ్డి ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్ తోపాటు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ పరిశోధన సంస్థలను విజిట్ చేశారు. ఈ రెండు పరిశోధన కేంద్రాల్లో కలియతిరిగి అక్కడి అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధనలు, శిక్షణలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు పరిశోధన కేంద్రాల్లో వేరువేరుగా సమావేశాల్లో పాల్గొని ఆయా పరిశోధన సంస్థల అధికారుల, శాస్త్రవేత్తల నుండి అభిప్రాయాలను సేకరించారు. ప్రతి ఏటా రాష్ట్రంలో వరి సాగు పెరుగుతోందని, ఉద్యాన వన పంటల సాగు తగ్గుతోందని రైస్ రీసెర్చ్ సెంటర్లో అభిప్రాయానికి వచ్చారు. రైతులు యూరియా వాడకం తగ్గించాలని కోరారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల వలన రైతులు తీవ్ర నష్టపోతున్న విషయాలపై చర్చించారు. ఐఐఆర్ఆర్ తయారు భూసార పరీక్ష పరికరం, చీడ, పీడల నివారణ, కొత్త వరి వంగడాలపై సమావేశంలో కమిషన్‌కు ఐఐఆర్ఆర్ అధికారులు వివరించారు. అయితే కేంద్ర పరిశోధన సంస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు తెలంగాణ రైతులకు అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి కోరారు. ఇక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నేషనల్ ఇన్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థలో చేస్తున్న పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలను రైతు కమిషన్ పరిశీలించింది. నీటి యాజమాన్య పద్దతులు, రైతులకు డ్రోన్ శిక్షణ తోపాటు మొక్క బలంగా పెరిగి, ఆశించిన స్థాయిలో దిగుబడి రావడానికి ఏం చేయ్యాలి అనే విషయాలపై శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు కమిషన్‌కు వివరించారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల నుండి ఎన్ఐపీహెచ్ఎం వచ్చే పరుగు మందులు, ఎరువులను పరీక్షించి నకిలీల భరతం పడ్తున్న విషయాలను కమిషన్ తెలుసుకుంది. తెలంగాణ రైతాంగానికి రాజేంద్ర నగర్ లోని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థలు ఉపయోగకంగా ఉండాలన్నారు రైతు కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి. సీజన్ కు మందు టీవీ, పేపర్ లో వచ్చే యాడ్స్ చూసి రైతులు నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, పురుగు మందులు కొని నష్టపోతున్నారని గుర్తుచేశారు. ఈ రెండు జాతీయ పరిశోధన సంస్థల్లో పనిచేసే అధికారులు, శాస్త్రవేత్తలు తెలంగాణ రైతులను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తోపాటు సభ్యులు గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, చెవిటి వెంకన్న యాదవ్, మెంబర్ సెక్రెటరీ గోపాల్, భారతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆర్ఎం సుందరం కుమార్‌లున్నారు.

# కేటీఆర్ న్యూయార్క్ ప్రయాణం రద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు ప్రతిష్ఠాత్మక 'గ్రీన్ లీడర్‌షిప్ అవార్డు 2025' లభించినప్పటికీ, తెలంగాణలో ముఖ్యమైన రాజకీయ, ఎన్నికల సంబంధిత సమావేశాల కారణంగా ఈ అవార్డు ప్రదానోత్సవానికి హాజరు కాలేరు. సెప్టెంబర్ 24న న్యూయార్క్ నగరంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంతో పాటు జరిగే '9వ ఎన్‌వైసీ గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్'లో ఈ అవార్డుకు ఎంపిక కావడం తనకు చాలా గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. "ఈ గుర్తింపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, బీఆర్ఎస్ ప్రభుత్వం పచ్చదనం పెంపునకు చేపట్టిన అద్భుతమైన కార్యక్రమాలకు అంకితం" అని ఆయన అన్నారు. పార్టీ కార్యకలాపాల కారణంగా ఈ అవార్డు ప్రదానోత్సవానికి హాజరు కాలేకపోతున్నందుకు విచారం వ్యక్తం చేశారు. హరిత, వాతావరణ అనుకూల తెలంగాణను నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సమష్టి కృషికి ఈ పురస్కారం నిదర్శనమని కేటీఆర్ తెలిపారు. ఈ అవార్డును అందించిన 'గ్రీన్ మెంటర్స్' సంస్థకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సస్టైనబిలిటీ రంగంలో నాయకులను ప్రోత్సహించాలన్న వారి లక్ష్యాన్ని తాను ఎంతగానో గౌరవిస్తానని, భవిష్యత్తులో ఈ సంస్థతో, ఇతర అంతర్జాతీయ వాతావరణ భాగస్వాములతో కలిసి పని చేయడానికి ఎదురు చూస్తున్నానని అన్నారు.

# కేటీఆర్‌కు అరుదైన గౌరవం

- తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025కు ఆహ్వానం



**హైదరాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగనున్న ప్రతిష్ఠాత్మక 'తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానాన్ని తాల్ హాస్పిటల్స్ సీఈఓ శ్రీ సాయి గుండవెల్లి హైదరాబాద్‌లో కేటీఆర్‌కు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ- మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ కూడా గుండవెల్లి వెంట ఉన్నారు. అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ- ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో లో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కేటీ-ఆర్ కీలకోపన్యాసం ఇవ్వనున్నారు. తెలంగాణలో టెక్నాలజీ ఆధారిత పాలన, ఆవిష్కరణలతో కూడిన అభివృద్ధి, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన విధానాలు ప్రపంచ ప్రజలకు ఎంతో విలువైనవిగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఆహ్వానాన్ని కేటీఆర్ అంగీకరించినందుకు టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది. హెల్త్‌ఫెస్ట్ 2025లో ఆయన భాగస్వామ్యం ఈ వేదికపై అర్థవంతమైన చర్చలకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వరంగల్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్

**ఎక్స్ వేదికగా కిషన్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ వెల్‌నెస్ సెంటర్ ని ఆమోదించింది. ఈ సౌకర్యం ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్‌లకు ఉపయోగపడనుంది. అయితే, సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో ప్రాథమిక క్షఉ చికిత్సలు సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయి. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతను మళ్ళీ ప్రస్తావిస్తుంది. ఇది 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' దార్శనికతకు సాక్షయంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వరంగల్‌లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్ లో పోస్ట్ చేశారు కిషన్ రెడ్డి. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుంది.

# బీజేపీలో చేరిన నటుడు వరుణ్ సందేశ్ తల్లి



**హైదరాబాద్, సెప్టెంబర్23 (జనంసాక్షి) :** సినీనటుడు వరుణ్ సందేశ్ తల్లి డాక్టర్ రమణి భాజపాలో చేరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆమెకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణి మాట్లాడుతూ సమాజసేవ చేయడం అంటే తనకు చాలా ఇష్టమన్నారు. హిందుత్వం అంటే తమ కుటు-ంబానికి ఇష్టమని.. అందుకే భాజపాలో చేరినట్లు- చెప్పారు. పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# లగ్జరీ కార్ల స్మగ్లింగ్ కేసులో కస్టమ్స్ దాడులు

- నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ నివాసాల్లో సోదాలు

**కొచ్చి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** మలయాళం స్టార్ హీరోస్ దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసాలపై కస్టమ్స్ అధికారులు మెరుపు దాడులు చేశారు. ఈ దాడులు మంగళవారం కొచ్చిలో పృథ్వీరాజ్ థేవరాలోని ఇంట్లో, అలాగే దుల్కర్ సల్మాన్ పనమ్పిల్లి నగర్‌లోని ఇంట్లో జరిగాయి. పృథ్వీరాజ్ తిరువనంతపురంలోని ఇంటిని కూడా అధికారులు తనిఖీ నిర్వహించారు. భూటాన్ నుంచి భారత్‌లోకి అక్రమంగా లగ్జరీ కార్లను స్మగ్లింగ్ చేస్తున్న ఒక పెద్ద నెట్‌వర్క్‌పై కస్టమ్స్ అధికారులు దేశవ్యాప్తంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖుల ఇళ్లపై దాడులు చేపట్టారు. కేరళలోని కొచ్చి, కోజికోడ్, మలప్పురంతో సహా దాదాపు 30 ప్రాంతాల్లో ఈ దాడులను ఏకకాలంలో కస్టమ్స్ అధికారులు చేపట్టారు. ఈ ఆపరేషన్‌కు 'నమ్‌కూర్' అని పేరు పెట్టారు. భూటాన్ సైన్యం ఉపయోగించిన లగ్జరీ కార్లను వేలంలో తక్కువ ధరలకు విక్రయించారు. అయితే ఈ పాత వాహనాలను కస్టమ్స్ సుంకాలు చెల్లించకుండా భారత్‌లోకి అక్రమంగా తరలిస్తున్నట్లు- కస్టమ్స్ అధికారులకు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో దేశ వ్యాప్తంగా పలువురు, సినీ , రాజకీయ, వ్యాపార ప్రముఖుల నివాసాలపై కస్టమ్స్ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ హై-ఎండ్ వాహనాలను ముందుగా హిమాచల్ ప్రదేశ్‌కు అక్రమంగా రవాణా చేసి, అక్కడ తాత్కాలిక చిరునామాలతో రిజిస్టర్ చేసుకుంటారు ఈ లగ్జరీ కార్ల ముఠా. ఆ తర్వాత వీటిని ప్రముఖ సినీ నటు-లు, వ్యాపారవేత్తలకు ఓ ముఠా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ అక్రమ రవాణా కోసం ఏజెంట్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారని అధికారులు తెలిపారు. భూటాన్ భారత్ మధ్య ఉన్న వ్యాపార ఒప్పందాల్లోని లసుగులను ఉపయోగించుకుని ఈ స్మగ్లింగ్‌కు పాల్పడు తున్నారని సమాచారం. భూటాన్‌లో ఈ వాహనాలను వేలంలో కొనడం చట్టబద్ధమే అయినప్పటికీ, భారత్‌లోకి సరైన పన్నులు చెల్లించకుండా తీసుకువచ్చి అమ్మడం కస్టమ్స్ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతోందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ కేరళ, లక్షద్వీప్ కమిషనర్ పర్యవేక్షణలో జరుగుతోంది. సినీనటు-ల ఇళ్లతో పాటు- కలమస్సేరిలోని వ్యాపారవేత్తల నివాసాలు, మలప్పురం, కోజికోడ్‌లోని కార్ డీలర్‌షిప్‌లపై కూడా అధికారులు దాడులు చేస్తున్నారు. ఈ వాహనాలను కొనుగోలు చేసిన వారి జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఆ జాబితాలోని ప్రముఖుల ఇళ్లలో సోదాలు చేసి, నిజానిజాలను నిర్ధారించుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370